మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శుక్రవారం 23 అక్టోబర్ 2026 || సంపుటి: 10 || సంచిక: 287 || పేజీలు:12 || వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

డ్రైవింగ్ లైసెన్స్ కావాలంటే 75 శాతం మార్కులు రావాల్సిందే!



2



తమ దేశ స్వాతంత్ర్య దినోత్సవాలకు అతిథిగా రావాలంటూ ప్రధాని మోడీని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఆహ్వానించారు

ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి

బీసీ ఏలోకి మారుస్తం

వచ్చే క్యాబినెట్‌లోనే దీనిపై నిర్ణయం

ఎన్నికల్లో అండగా ఉండండి.. మీకేం కావాలో నేను చూసుకుంటా

భూస్వాములు, జమిందార్లపై పోరాటం చేసిన వ్యక్తి పండుగ సాయన్న

ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తం

పండుగ సాయన్న జయంతి సభలో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 22 (మనం బ్యూరో) : భూస్వాములు, జమిందార్లపై పోరాటం చేసిన వ్యక్తి పండుగ సాయన్న ముదిరాజ్ అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తన పోరాటం ద్వారా ఎందరికో ఆయన ఆదర్శంగా నిలిచారని చెప్పారు. పండుగ సాయన్న జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తామని చెప్పారు. గురువారం రవీంద్రభారతిలో నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల్లో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొరలు ఆక్రమించిన భూములను సాయన్న తన పోరాటంతో పేదలకు పంచిపెట్టారని కొనియాడారు. చరిత్ర పుటల్లో ఆయనకూ ఓ పేజీ ఉండాలనీ, ఆయన పోరాటాన్ని ఇప్పటికీ జానపదాలుగా పాడుకుంటారని వివరించారు. ''ట్యాంక్‌బండ్‌పై దొడ్డి కొమురయ్య, పండుగ సాయన్న విగ్రహాలు నిర్మిస్తాం. సర్వాయి పాపన్న, చాకలి ఐలమ్మ, కొండా లక్ష్మణ్ బాపూజీని స్మరించుకుంటున్నాం. అందెశ్రీ, గద్దర్‌కు అండగా నిలిచామని పేర్కొన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో అత్యధిక జనాభా ముదిరాజ్‌లదేననీ,. గతంలో నాకు వారు చేసిన సాయం ఎప్పటికీ గుర్తుంచుకుంటా. వారికి సంపూర్ణ న్యాయం చేస్తామని హామీ ఇస్తున్నా. మా ప్రభుత్వం వచ్చాక ముదిరాజ్ బిడ్డలకు

కొడంగల్‌లో రేవంత్ దసరా ఆత్మీయ సమ్మేళనం

పెద్ద సంఖ్యలో పాల్గొన్న ప్రజలు, నాయకులు

2

గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదును

ప్రతిష్ఠాత్మకంగా తీసుకోండి

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచే అత్యధిక మెజార్టీ రావాలి

ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, అక్టోబర్ 22 : 'హైదరాబాద్ - రంగారెడ్డి - మహబూబ్ నగర్' గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలని కాంగ్రెస్ శ్రేణులకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచే అత్యధిక మెజార్టీ రావాలని, ఆ దిశగా బూత్ స్థాయి నుంచే పక్కా ప్రణాళిక రూపొందించుకుని, పాత-కొత్త నేతలంతా సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. శంషాబాద్ మల్లికా గార్డెన్స్ లో గురువారం నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కేడర్ కు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ప్రభుత్వోద్యోగాల భర్తీ, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. బీఆర్ఎస్, బీజేపీ కుట్రలను సమర్థవంతంగా ఎదుర్కొంటూనే.. వారి వైఫల్యాలను పట్టభద్రుల ముందు ఎండగట్టాలన్నారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా గట్టిగా తిప్పికొట్టాలన్నారు. గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వారీగా ప్రత్యేక ఓటర్ ఎన్ రోల్ మెంట్ డ్రైవ్ చేపట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు. బూత్ స్థాయి నుంచి ప్రతి పట్టభద్రుడిని కలిసి ఓటరుగా నమోదు చేయించే బాధ్యతను నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలన్నారు. దరఖాస్తుల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పక్కాగా పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు, ప్రచారంలో అత్యుత్తమంగా పనిచేసే కార్యకర్తలకు, నేతలకు పార్టీలో తగిన ప్రాధాన్యత ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీ డా.మల్లు రవి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, మనోహర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, ఏఐసీసీ ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్ మధు యాష్కీ, ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ డీసీసీ అధ్యక్షులు పారిజాత నర్సింహారెడ్డి, వ్రజేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయం కోసం సమష్టిగా కృషి చేయాలె : మంత్రి పొన్నం

3

జాగో..!

ఎల్‌నినోను ఎదుర్కొందాం

ప్రకృతి విపత్తుపై 'మన'ం యుద్ధం

manamelnino2026@gmail.com, whatsapp no 9133199333

ఎల్‌నినో విపత్తును ఎదుర్కొనే దిశలో మనమంతా భాగస్వాములమవుదాం. సామాజిక బాధ్యతను నిర్వర్తిద్దాం. ఎల్ నినో ఎందుకు వచ్చింది..? ఇందుకు కారకులెవరు..?? లాంటివి ఇప్పుడు అప్రస్తుతం. మన ముంగిటికి ఎల్ నినో రక్కసి వచ్చి చేరింది. ఈ సమయంలో వ్యక్తిగతంగా ప్రతి పౌరుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. సామాజికంగా ఎలాంటి అడుగులు ముందుకు పడాలి ... ఇదే ఇప్పుడు అత్యవసరం. అలాగే ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యలు ఎలా ఉండాలి వంటి అంశాలు ఎంతో ముఖ్యం. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇందుకు సన్నద్ధమయ్యాయి. పౌరులుగా మనమందరం కూడా ఇందుకు సిద్ధం కావాలి. తెలంగాణ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి సబ్ కమిటీని సైతం ఏర్పాటు చేసింది. ఎల్ నినోలాంటి విపత్తులను దిగ్విజయంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రజలు ఎవరి బాధ్యతలను వాళ్లు నిర్వర్తించాల్సిందే... ఎల్ నినో ప్రభావం ఇప్పుడిప్పుడే ప్రారంభమైనప్పటికీ సమీప భవిష్యత్తులో దాని విశ్వరూపాన్ని చూడాల్సిన పరిస్థితిలు రావచ్చు.. విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడం మనకేం కొత్త కాకపోయినప్పటికీ పౌరులుగా మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు మనం తీసుకోవాల్సిందే... ప్రభుత్వాలు చేపట్టాల్సిన చర్యలు చేపట్టాల్సిందే. ఈ కోణంలోనే ఎలాంటి జాగ్రత్తలు ప్రజలు తీసుకోవాలి , ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే అంశాన్ని మీరు సూటిగా స్పష్టంగా తెలియజేయండి. ఈ విపత్కర పరిస్థితిలకు కారకులు వీరంటూ, వారంటూ ఎవరిని నిందించాల్సిన అవసరం లేదు.. అసలు ఆ జోలికే వెళ్ళకూడదు.. నిర్మాణాత్మకంగా ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు వీటిపైనే మీ సూచనలు సలహాలు పంపాలి.. మీడియా సంస్థగా మనం తెలుగు దినపత్రిక ఈ అంశాన్ని తన బాధ్యతగా గుర్తించి ఈ బహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మహా యజ్ఞంలో మీరూ పాలుపంచుకోండి. మీ ఆలోచనలను మాకు పంపించండి. వాటిని మీ పేరు, చిరునామా, ఫోటోతో పాటు ఈ శీర్షికలో రోజువారీగా ప్రచురిస్తాం. ఉత్తమ సూచనలకు గుర్తింపు కూడా ఇస్తాం మీ ఆలోచనలు, సలహాలు, సూచనలను పైన తెలిపిన వాట్సాప్ లేదా ఈ మెయిల్‌కు పంపించండి.

– ఎడిటర్

కరెంటు కొరత రాకుండా

పటిష్ట చర్యలు

రోజువారీ విద్యుత్ ఉత్పత్తిని 140 మిలియన్ యూనిట్లకు పెంచాలె

మూతపడిన పరిశ్రమల విద్యుత్ బకాయిల చెల్లింపులకు వన్‌టైమ్ సెటిల్మెంట్ అవకాశం

థర్మల్ విద్యుత్ ఉత్పత్తిపై సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, అక్టోబర్ 22 : ఎల్ నినో ప్రభావంతో జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం, రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ పెరిగే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో విద్యుత్ కొరత తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రానున్న రబీ, వేసవి సీజన్లలో వ్యవసాయ, గృహ విద్యుత్ అవసరాలను సమర్థంగా తీర్చేందుకు థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని రోజుకు 140 మిలియన్ యూనిట్లకు పెంచేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో గురువారం విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, బకాయిల అంశాలపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం రోజువారీ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సగటున 91 మిలియన్ యూనిట్లకు చేరిందని, ఇటీవల ఒక్కరోజులో 118 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి నమోదైందని అధికారులు వివరించారు. ఈ స్థాయి నుంచి ఉత్పత్తిని మరింత పెంచి రోజుకు

...మిగతా 2లో

ఏపీలో నవంబర్ 1నే పోలింగ్

మూడో తేదీన కౌంటింగ్

అమరావతి, అక్టోబర్ 22 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 99 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు నవంబర్ ఒకటో తేదీన పోలింగ్ జరగనుంది. మైదుకూరు పురపాలక సంఘానికి పోలింగును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అనిల్ చంద్ర పునేఠా వాయిదా వేశారు. మైదుకూరులో మళ్లీ నామినేషన్లు ప్రక్రియ ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారు. నవంబర్ మూడో తేదీన కౌంటింగ్ నిర్వహించాలని నిర్ణయించారు.

ఏడు జిల్లాలోని 19 పురపాలక సంఘాలపై ఆరోపణలు రావడంతో వీటిపై కలెక్టర్ల నుంచి నివేదికలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ తెప్పించుకున్నారు. న్యాయనిపుణులతో మాట్లాడిన అనంతరం నవంబర్ ఒకటో తేదీన ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. మైదుకూరులో మళ్లీ తాజాగా నామినేషన్లు తీసుకోవాలని నిర్ణయించారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపై కూడా సమాలోచనలు చేస్తున్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు యథావిధిగా నిర్వహించాలా? లేదా అనే అంశంపై చర్చిస్తున్నారు.

ప్రకృతితో మమేకం కాకపోతే

విపత్తులు తప్పవు



దత్తాత్రేయ అలయ్‌బలయ్ కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

3

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ మద్దతు ఎవరికి?

విడివిడిగా ఎన్నికల బరిలో బీజేపీ, జనసేన

ఇప్పటికే టీడీపీ మద్దతు కోరిన కమలనాథులు

అధికారికంగా ప్రకటించని ఆ పార్టీ నాయకత్వం

హైదరాబాద్, (మనం బ్యూరో): త్వరలో జరుగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ ఎవరికి మద్దతు ఇస్తుందనే ప్రశ్న రాజకీయ వర్గాలలో ఆసక్తిని రేపుతోంది. రాష్ట్రంలోని నల్గొండ-ఖమ్మం-వరంగల్, హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ స్థానాలకు సంబంధించిన ఎన్నికల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. అన్ని

...మిగతా 2లో

పత్తి కొనుగోళ్లకు సర్వం సిద్ధం

పత్తి రైతుకు ధరల భరోసా కల్పించాలె

అధికారులకు తుమ్మల దిశానిర్దేశనం

3

లాడెన్ దాసుకున్నచోటే దావూద్ దాసుకుండు

తెలుసుకొని మాట్లాడండి: మండిపడిన భారత్

న్యూయార్క్, అక్టోబర్ 22 : ఐక్యరాజ్యసమితి (ఐరాస) ప్రత్యేక ప్రతినిధి ఇచ్చిన నివేదిక తప్పులతడకగా ఉందని భారత్ తీవ్రంగా ఖండించింది.



అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం గురించి చేసిన ప్రస్తావనలు తోసిపుచ్చింది. దావూద్ డీ-కంపెనీ 'భారత్కు చెందిన క్రిమినల్ గ్రూప్' అని పేర్కొనడంపై మండిపడింది. ఈ మేరకు ఐరాసలో భారత శాశ్వత మిషన్ ఫస్ట్ సెక్రటరీ రఘూ పూరి మాట్లాడారు.

అల్ ఖైదా తో సంబంధాలున్నాయనే ఆరోపణలపై 2003లో భారత దేశానికి చెందిన డీ-కంపెనీ నాయకుడిని ఐరాస భద్రతా మండలి అంతర్జాతీయ ఉగ్రవాది జాబితాలో చేర్చింది. ఆ ప్రత్యేక ప్రతినిధి ఇచ్చిన నివేదికలో ఈ మాట

...మిగతా 2లో

యునెస్కో తాత్కాలిక జాబితాలో

భారత్ నుంచి 3 ప్రాంతాలు



ప్యారిస్, అక్టోబర్ 22 : భారతదేశం నుంచి కొత్తగా మూడు ప్రదేశాలను ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ-యునెస్కో ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో చేర్చారు. ఒక ప్రదేశానికి ప్రపంచ వారసత్వ హోదా ఇచ్చే విషయం పరిశీలించాలంటే, దాన్ని మొదట యునెస్కో తాత్కాలిక జాబితాలో చేర్చాలి. అండమాన్-నికోబార్ ద్వీప సముదాయానికి చెందిన బరాటాంగ్ దీవిలోని బురద అగ్నిపర్వతం, అండమాన్ సబ్ డక్షన్ అగ్నిపర్వతాలైన నార్కొండమ్-బారెన్ దీవులు, ఛత్తీస్గఢ్ లోని సిర్పూర్ సాంస్కృతిక-పురాతత్వ ప్రాంతాన్ని తాజాగా యునెస్కో తాత్కాలిక జాబితాలో చేర్చారు. యునెస్కో వెబ్ సైట్ ప్రకారం, భారతదేశ యునెస్కో శాశ్వత ప్రతినిధి బృందం సెప్టెంబర్ 28న ఈ ప్రతిపాదనను పంపింది. మధ్యప్రదేశ్ లోని ఉదయగిరి గుహలు, భారత్, దక్షిణాఫ్రికాలలో గాంధీజీ సత్యాగ్రహంతో ముడిపడి ఉన్న ప్రదేశాలతో పాటు మొత్తం నాలుగు ప్రదేశాలను ఇటీవలే భారతదేశ యునెస్కో ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో చేర్చినట్లు అధికారులు సెప్టెంబర్ 30న తెలిపారు. ఇప్పుడు యునెస్కో తాత్కాలిక జాబితాలో భారత్ కు చెందిన మొత్తం 81 ప్రదేశాలు ఉన్నాయి. వీటికి తోడు తాజాగా ప్రతిపాదించిన

...మిగతా 2లో

నోబెల్ రాలేదు..

కనీసం పులిట్జర్ అయినా ఇవ్వరా?

అవార్డుల కోసం అర్రులు చాస్తున్న ట్రంప్



వాషింగ్టన్, అక్టోబర్ 22 : ప్రపంచవ్యాప్తంగా అనేక యుద్ధాలను ఆపానని.. అందుకు నోబెల్ శాంతి బహుమతి వచ్చి తీరాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదే పదే ప్రకటించుకున్న విషయం తెలిసిందే. ఇలా పలుసార్లు ఆశించి భంగపడిన ఆయన.. చివరకు మరో పురస్కారంపై కన్నేసినట్లు తెలుస్తోంది. తనకు నోబెల్ రాలేదని.. కనీసం తన రచనలకు పులిట్జర్ వచ్చి ఉండాల్సిందని మరోసారి అసంతృప్తిని వ్యక్తం

...మిగతా 2లో

డ్రైవింగ్ లైసెన్స్ రావాలంటే 75% మార్కులు రావాల్సిందే!

ఢిల్లీ, అక్టోబర్ 22 : డ్రైవింగ్ లైసెన్స్ నిబంధనలకు సంబంధించి కేంద్రం కొత్త ప్రతిపాదనలు తీసుకొచ్చింది. సురక్షిత డ్రైవింగ్ పై అవగాహన కోసం నిర్వహించే ఆన్ లైన్ అసెస్ మెంట్ పరీక్ష పాస్ మార్కులను 60 శాతం నుంచి 75 శాతానికి పెంచింది. డ్రైవింగ్ పై అవగాహన కోసం నిర్వహించే ఈ ట్యుటోరియల్ కనీసం 30 నిమిషాల పాటు సాగాలని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేసింది. భాగస్వామ్యపక్షాల నుంచి 30 రోజుల పాటు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఫీడ్ బ్యాక్ ఆధారంగా తుది నోటిఫికేషన్ విడుదల చేస్తారు.

గడువు దాటి నిర్ణయం చెప్పకపోతే అమోదం పొందినట్టే...

కొత్త ప్రతిపాదనల ప్రకారం.. పేరు, చిరునామా వివరాల మార్పు కోసం వచ్చే దరఖాస్తులను అధికారులు 15 రోజుల్లోగా ఆమోదించడం లేదా తిరస్కరించడం చేయాలి. ఒకవేళ తిరస్కరిస్తే తగిన కారణం తెలపాల్సి ఉంటుంది. చిరునామా మార్పు దరఖాస్తుపై 30 రోజుల్లోగా ఎలాంటి నిర్ణయం తీసుకోకపోతే ఆమోదం పొందినట్లుగా పరిగణిస్తారు. ఆధార్ అథంటికేషన్ ద్వారా ఆన్లైన్లో పొందే కొన్ని డ్రైవింగ్ లైసెన్స్ సేవలకు ఫీజు మినహాయింపు ఇవ్వాలని భావిస్తున్నారు. పేరు, చిరునామా వంటి వ్యక్తిగత వివరాల మార్పులకూ ఛార్జీలు తొలగించనున్నారు.

పాత బండికి.. కొత్త లెక్కలు.. గ్రీన్ ట్యాక్స్, ఆర్సీ రెన్యువల్ తప్పనిసరి..

గుర్తింపు, వయసు, చిరునామా ధ్రువీకరణ కోసం ఆధార్, పాస్ పోర్ట్, ఓటర్ ఐడీ, జనన ధ్రువీకరణ పత్రాలు, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్లు, ఇ-రేషన్ కార్డు, గడిచిన 3 నెలల్లోపు వచ్చిన విద్యుత్, గ్యాస్ బిల్లులను అనుమతిస్తారు. చిరునామా ధ్రువీకరణ పత్రాల జాబితా నుంచి ఎల్ఐసీ పాలసీలను తొలగించాలని ముసాయిదా పేర్కొంది. అలాగే, కొత్తగా జారీ చేసే డ్రైవింగ్ లైసెన్సులు, రెన్యువల్ లైసెన్సులను లేమినేటెడ్ లేదా పీవీసీ కార్డు రూపంలో జారీ చేయాలని ముసాయిదాలో కేంద్రం తెలిపింది.

ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి
బీసీ ఏలోకి మారుస్తం

(మొదటి పేజీ తరువాయి)

అనేక అవకాశాలు కల్పించాం. నేను పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు మంత్రి వాకిటి శ్రీహరికి రాజకీయంగా అవకాశం కల్పించా. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఆయనను మంత్రిని చేశామని గుర్తు చేశారు.మిగతా ముదిరాజ్ నేతలకు కూడా త్వరలో అవకాశాలు వస్తాయని ప్రకటించారు. ఎన్నికల్లో అండగా ఉండండి మీకేం కావాలో నేను చూసుకుంటామని హామీ ఇచ్చారు. ''జనగణనలో కులగణన చేసి వందేళ్లలో ఎవరూ చేయని పనిని మా ప్రభుత్వం పూర్తిచేసింది. ఏడాదిలోనే కులగణన పూర్తిచేసి దేశానికే ఆదర్శంగా నిలిచాం. బీసీ డి నుంచి బీసీ ఏలోకి మార్చాలని ముదిరాజ్‌లు కోరుతున్నారు. బీసీ సామాజికవర్గాలకు న్యాయం చేయాలనేదే మా ప్రభుత్వం లక్ష్యం. ఎందరు ప్రధానులు మారినా ఎస్సీ కులాల వర్గీకరణ జరగలేదు. దాన్ని కూడా చేపట్టి దేశానికి ఆదర్శంగా నిలిచామని'' పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు ఇచ్చిన సంక్షేమ పథకాలను రెండింతలు పెంచి ఇస్తున్నాం.

రాష్ట్రంలో 3.48కోట్ల మంది పేదలకు సన్న బియ్యం ఇస్తున్నాం. ఎల్నినో కారణంగా ఇవాళ మార్కెట్లో సన్నబియ్యం రేట్లు పెరిగాయి. అనేక మంది పేదలు రేషన్ సన్నబియ్యం తింటున్నారు. ఎన్నికల్లో అండగా ఉండండి.. మీకు ఏం కావాలో నేను చూసుకుంటా'' అని సీఎం రేవంత్ అన్నారు. నాడు ఎన్టీఆర్ హయాంలో రూ.2లకు కిలో బియ్యం ఇస్తే.. తాము ఇప్పుడు సన్నబియ్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. 3.48 కోట్ల మందికి నేడు సన్నబియ్యం ఇస్తున్నామని చెప్పుకొచ్చారు. నిజాం హయాంలో దొరలు.. పేదల భూములను ఆక్రమిస్తుంటే వారికి అండగా పండుగ సాయన్న నిలిచారనీ, దొరలకు వ్యతిరేకంగా తాను ఓ దళాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. సాయన్న ప్రజలకు ధాన్యం పంచడమే కాదని, పేద ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక సాయం చేశారని కొనియాడారు. ఆయనను నిజాం పోలీసులు అరెస్టు చేస్తే నాటి వనపర్తి మహారాణి పెద్దఎత్తున నిధులు చెల్లించి విడిపించారని తెలిపారు. లెక్కలు లేనందునే ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ కు మార్చలేకపోయారని అన్నారు. ఈ అంశంపై వచ్చే క్యాబినెట్ భేటీలో చర్చిస్తామని మాటిచ్చారు. మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసి, పూర్తిస్థాయిలో అధ్యయనం చేయిస్తామని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

లాడెన్ దాసుకున్న చోటే దావూద్ దాసుకుండు

(మొదటి పేజీ తరువాయి)

భారత్ కు తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించింది. 'మా దేశం గురించి ప్రస్తావించిన కొన్ని తప్పులను మీ ముందు ఉంచుతున్నాం. 'డీ కంపెనీ' అంటూ మీరు ప్రస్తావించిన వాక్యాన్ని విడిగా చదివితే.. వాస్తవాలకు విరుద్ధమైన అర్థం వస్తుంది. 1993లో జరిగిన ఉగ్రదాడులకు సంబంధించి ఆ నేర సంస్థ, ఆ నాయకుడు భారత్ లో మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్నాడు. ఈ వాస్తవాన్ని ప్రస్తావించకపోవడం విచారకరం. ప్రత్యేక పదవులను చేపట్టిన వారి నుంచి ఇలాంటి అసమర్థ వ్యాఖ్యలు ఐరాసకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయని ఆయన విమర్శించారు.

వాస్తవం ఏంటంటే.. 2003లో ఐరాస అతడిని ఉగ్రవాది జాబితాలో చేర్చకముందే భారత్ నుంచి పారిపోయాడు. అల్ ఖైదా, ఒసామా బిన్ లాడెన్ తో ఉన్న సంబంధాల కారణంగా అతడిని ఆ జాబితాలో చేర్చింది. అప్పుడు అతడు భారత్ లో లేడు. బిన్ లాడెన్ ఎక్కడైతే నక్కి, ప్రాణాలు కోల్పోయాడో.. దావూద్ ఇబ్రహీం కూడా ఆ దేశంలోనే ఉన్నాడని ఐరాస జాబితాను బట్టి స్పష్టమవుతోంది' అని రఘూపూరి తేల్చిచెప్పారు. 2001లో అమెరికాలో మారణహోమం సృష్టించిన బిన్లాడెన్కు పాకిస్తాన్ ఆశ్రయం ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ దేశంలో అగ్రరాజ్యం నిర్వహించిన ఆపరేషన్లో లాడెన్ హతమయ్యాడు.

కొడంగల్‌లో రేవంత్ దసరా ఆత్మీయ సమ్మేళనం

- పెద్ద సంఖ్యలో పాల్గొన్న ప్రజలు, నాయకులు

హైదరాబాద్, అక్టోబర్ 22 (మనం బ్యూరో) : సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గురువారం ఉదయం హైదరాబాద్ నుంచి కొడంగల్ కు బయలుదేరిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్‌లోని తన నివాసంలో స్థానికులు, స్థానిక నాయకులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న సీఎం ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్‌లోని నివాసానికి



నియోజకవర్గ ప్రజలు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. కొడంగల్ పర్యటన ముగిసిన అనంతరం తిరిగి హైదరాబాద్‌కు చేరుకున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ మద్దతు ఎవరికి?

(మొదటి పేజీ తరువాయి)

పార్టీల కంటే ముందే జనసేన పార్టీ నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానానికి అభ్యర్థిగా డా.గడల శ్రీనివాస్‌ను ప్రకటించింది. ఆ తరువాత అధికార కాంగ్రెస్ పార్టీ రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించింది. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ స్థానానికి అభ్యర్థిగా సామ రామ్మోహన్ రెడ్డి పేరును ప్రకటించింది. ఇక హైదరాబాద్-రంగారెడ్డి- మహబూబ్‌నగర్ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు పేరు దాదాపు ఖరారైంది. ఇప్పటికే పార్టీలు తమ పేర్లను అధికారికంగా ప్రకటించిన అభ్యర్థులు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన ఓటర్ల నమోదు ప్రక్రియను జోరుగా సాగించడమే కాకుండా ప్రచారాన్ని సైతం ప్రారంభించారు. ఇదిలా ఉండగా, పక్క రాష్ట్రమైన ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలో ఉంది. కూటమిలో భాగస్వాములుగా ఉన్న బీజేపీ,జనసేన పార్టీలు రాష్ట్రంలో త్వరలో జరుగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో విడివిడిగా అభ్యర్థులను ప్రకటించాయి. దీంతో రాష్ట్రంలో టీడీపీ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఏ పార్టీకి మద్దతు ఇస్తుందనేది ఆసక్తికరంగా మారింది. రాష్ట్రంలో టీడీపీకి ఖమ్మం జిల్లాతో పాటు రాజధాని హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాలు, శివారు నియోజకవర్గాలలో మంచి పట్టు ఉంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని కమలనాథులు ఇప్పటికే టీడీపీ మద్దతు కోరారు. అయితే, ఆ పార్టీ బీజేపీకి మద్దతిచ్చినట్లు అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. మరోవైపు, కూటమిలో జనసేన సైతం కీలక భాగస్వామిగా ఉంది. ఆ పార్టీ సైతం అభ్యర్థిని రంగంలోని దించడంతో టీడీపీ కార్యకర్తలు, అభిమానులు అయోమయానికి గురవుతున్నారు. అయితే, టీడీపీ నాయకత్వం మాత్రం పార్టీకి ఉన్న సంస్తాగత బలం, పార్టీ శ్రేణుల అభిప్రాయాలు, ఇతర పార్టీలతో సంబంధాల నేపథ్యంలో తాజా రాజకీయ పరిణామాలను గమనిస్తున్నట్లు రాజకీయ వర్గాలలో ప్రచారం జరుగుతోంది. తొందరపడి ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా అభ్యర్థుల గెలుపోటములపై కార్యకర్తల అభిప్రాయం తీసుకున్న తరువాతనే ఏ పార్టీకి మద్దతు ప్రకటించాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. మరోవైపు, 2027లో జరుగనున్న ఈ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రధాన పార్టీలన్నీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. అభ్యర్థుల పట్టభద్రుల ఓటర్ల నమోదు, క్షేత్రస్థాయిలో పరిచయాల పెంపు, ఉద్యోగాలు, నిరుద్యోగం, విద్యారంగ సమస్యలను ప్రస్తావించడం వంటి అంశాలను ప్రధానంగా తీసుకుని ఎన్నికల క్షేత్రంలోని వెళుతున్నారు. ఇప్పటికే బీజేపీ, జనసేన పార్టీలు అధికారికంగా ప్రకటించిన అభ్యర్థులు టీడీపీ ఎవరికి మద్దతు ఇస్తుంది అనే విషయాన్ని ఆలోచించకుండా తమదైన శైలిలో దూసుకుపోతున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత వేలాది ఖాళీలను భర్తీ చేసి నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలిచ్చామని పేర్కొంటుండగా, బీజేపీ, జనసేన పార్టీల అభ్యర్థులు ప్రధానంగా ఏటా రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని నిలబెట్టుకోవడంలో విఫలమైందని ప్రచారం చేస్తున్నారు.

యునెస్కో తాత్కాలిక జాబితాలో భారత్ నుంచి 3 ప్రాంతాలు

(మొదటి పేజీ తరువాయి)

మూడు ప్రదేశాలలో ఒకటైన బరాటాంగ్ బురద అగ్నిపర్వతం భారతదేశంలోని ఏకైక మట్టి అగ్నిపర్వతం. ఇది సాధారణ అగ్నిపర్వతంలా వేడి వేడి లావాను కాకుండా చల్లగానో, కాస్త వెచ్చగానో ఉండే బురదను ఎగజిమ్ముతుంది. భూగర్భంలోని నీరు, ఖనిజాలు, సహజ వాయువులు ఒత్తిడికి గురై బురదను పైకి నెట్టడం వల్ల ఈ మట్టి అగ్నిపర్వతం ఏర్పడుతుంది.

బర్మా భూఫలకం కిందకు భారతీయ భూ ఫలకం చొచ్చుకుపోవడం (సబ్ డక్షన్) వల్ల అండమాన్-నికోబార్ దీవులు ఏర్పడ్డాయి. ఇలా రెండు భూ ఫలకాలు లేదా పొరలు పరస్పరం ఢీకొన్నప్పుడు అగ్ని పర్వతాలు ఏర్పడతాయి. అండమాన్ ద్వీప సముదాయంలో భాగమైన నార్కొండమ్, బారెన్ దీవులు 26 లక్షల సంవత్సరాల క్రితం ఇలానే ఏర్పడిన సబ్డక్షన్ అగ్నిపర్వతాలని యునెస్కో వెబ్సైట్ పేర్కొంది.

ఛత్తీస్ గఢ్ లోని మహాసముంద్ జిల్లాలో ఉన్న సిర్పూర్ (శ్రీపుర్) గ్రామం జాతీయ స్మారక చిహ్నం. ఈ ప్రదేశం ఛత్తీస్ గఢ్ రాజధాని రాయ్ పూర్ కు 78 కి.మీ దూరంలో మహానది తూర్పు ఒడ్డున ఉంది. ఈ చారిత్రక పట్టణం శర్భపురీయ రాజవంశం ఆధ్వర్యంలో కోసల రాజ్యానికి రాజధానిగా నిర్మితమైంది.. ఈ పట్టణం పాండువంశీ రాజవంశం ఆధ్వర్యంలో మరింత అభివృద్ధి చెందిందని యునెస్కో వెబ్సైట్ తెలిపింది. సిర్పూర్ ప్రాంతం సున్నపురాళ్ల నిక్షేపాలున్న చోట నెలకొని ఉన్నది. ఈ నిక్షేపాలు కోట్ల సంవత్సరాల పాటు సైనోబాక్టీరియా ద్వారా ఏర్పడిన శిలాజ పొరల వంటి అవక్షేప నిర్మాణాలు. అందుకే ఈ ప్రాంతాన్ని యునెస్కో పరిశీలనకు పంపారు.

కరెంటు కొరత రాకుండా పటిష్ట చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

140 మిలియన్ యూనిట్ల లక్ష్యాన్ని చేరుకోవాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని రెండు యూనిట్లకు బొగ్గు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా కోల్ ఇండియా లిమిటెడ్ నుంచి ప్రత్యామ్నాయ బొగ్గు సరఫరా అనుసంధానాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మార్గం ద్వారా బొగ్గు సరఫరా నవంబర్ నుంచి ప్రారంభం అవుతుందని వెల్లడించారు.

విద్యుత్ ఉత్పత్తి పెంపులో భాగంగా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. 'ఈ కేంద్రంలోని 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లు ఇప్పటికే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి. ఐదో యూనిట్ను ఈ నెల 20న గ్రిడ్కు అనుసంధానించామని, మిగిలిన సాంకేతిక, నిర్వహణపరమైన సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి, ఐదో యూనిట్ను పూర్తిస్థాయి వాణిజ్య కార్యకలాపాల్లోకి తీసుకువస్తున్నామని అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. 'టీజీజెన్కో థర్మల్ విద్యుత్ కేంద్రాల రోజు వారీ సగటు ఉత్పత్తి 2024-25 సంవత్సరంలో 65.90 మిలియన్ యూనిట్లు, 2025-26 ఆర్థిక సంవత్సరంలో సుమారు 76.46 మిలియన్ యూనిట్లు ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అక్టోబర్ 21 నాటికి 90.97 మిలియన్ యూనిట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రోజుకు 14.51 మిలియన్ యూనిట్ల మేర, సుమారు 19 శాతం పెరుగుదల నమోదైంది. అక్టోబర్ 16న ఒక్కరోజులో 118 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి'' జరిగిందని అధికారులు తెలిపారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల్లోని అన్ని యూనిట్లు గరిష్ఠ సామర్థ్యంతో పనిచేసేలా చూడాలని, ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ను పెంచాలని, ఉత్పత్తిని రోజువారీ సమీక్షిస్తూ లక్ష్య సాధన దిశగా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని భట్టి విక్రమార్క ఆదేశించారు.

వన్టైమ్ సెటిల్మెంట్ కు అవకాశం

తెలంగాణ రాష్ట్రంలో మూతపడిన పరిశ్రమలకు పెండింగ్లో ఉన్న విద్యుత్ బకాయిల చెల్లింపుల విషయంలో వన్టైమ్ సెటిల్మెంట్ విధానం ద్వారా బకాయిల చెల్లింపును సులభతరం చేసి, వినియోగదారులకు ప్రయోజనం కలిగించేలా సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. మూతపడిన పరిశ్రమల యాజమాన్యాలతో సమన్వయం చేసుకొని, విద్యుత్ బకాయిల పరిష్కారానికి అందుబాటులో ఉన్న అవకాశాలు, నిబంధనలపై అవగాహన కల్పించాలని ఖీఎఖ్కి వృఇఔ, ఖీఎఖ్కి వృఇఔ సీఎండీలను డిప్యూటి సిఎం ఆదేశించారు. ఈ విధానం ద్వారా అర్హత కలిగిన పరిశ్రమలకు బకాయిల చెల్లింపుల్లో కొంతమేర వెసులుబాటు లభించడంతో పాటు, విద్యుత్ పంపిణీ సంస్థలకు దీర్ఘకాలిక బకాయిల వసూళ్లకు అవకాశం కలుగుతుందన్నారు. అలాగే సింగరేణి, జెన్కో, ట్రాన్స్కో తదితర సంస్థలకు వివిధ విభాగాల నుంచి రావాల్సిన బకాయిల వసూలుకు చర్యలు చేపట్టాలని ఆర్థిక శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినా దానికి అనుగుణంగా ఉత్పత్తి, ప్రసారం, సరఫరా వ్యవస్థలను సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎండీ బుద్ధ ప్రకాష్ జ్యోతి, జెన్కో సీఎండీ హరీశ్, ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్, ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఆర్పీడీసిఎల్ సీఎండీ ముషారఫ్, సింగరేణి డైరెక్టర్ గౌతం పోట్రు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు బడుల్లో పేదలకు 25 శాతం సీట్లు

- తెలంగాణ విషయంలో సుప్రీం కోర్టు ఆగ్రహం

ఢిల్లీ, అక్టోబర్ 22 : రాష్ట్రంలోని నిరుపేద వర్గాల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించే వ్యవహారంలో ముందడుగు పడుతోంది. దశాబ్దాలు గడుస్తున్నా పలు రాష్ట్రాలు ఇప్పటికీ అమలు చేయకపోవడంపై ఇటీవల జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సంఘం (ఎన్సీపీసీఆర్)పై సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నెల 27న జరిగే విచారణకు స్వయంగా హాజరై అమలు తీరుపై నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఎన్సీపీసీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ కోరగా.. పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ ఢిల్లీ వెళ్లి.. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేస్తామంటూ ఆ సంఘానికి హామీ ఇచ్చారు.

చాలా రాష్ట్రాలు అమలు చేస్తున్నా..

విద్యాహక్కు చట్టం సెక్షన్ 12(1)(సి) ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఒకటో



తరగతిలో 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలి. దీని అమలుపై ఈ ఏడాది జనవరిలో సుప్రీం మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రవేశాల కోసం ప్రత్యేకంగా పోర్టల్ ప్రారంభించాలని, ఆన్లైన్లో దరఖాస్తులు స్వీకరించాలని, లాటరీ విధానంలో సీట్లు కేటాయించాలని, సమస్యలను పరిష్కరించేందుకు గ్రీవెన్స్ సెల్ను ప్రారంభించాలని.. ఇలా పలు నిబంధనలను విధించింది. అమలు, పర్యవేక్షణ బాధ్యతలను ఎన్సీపీసీఆర్కు అప్పగించింది. యూపీ, మహారాష్ట్ర, రాజస్థాన్, హరియాణా, తమిళనాడు తదితర రాష్ట్రాలు వివిధవిధానాలు రూపొందించుకొని అమలు చేస్తున్నాయి.

గత ఏడాది తూతూమంత్రంగా..

తెలంగాణలో ఈ చట్టం అమలుపై హైకోర్టులో గత ఏడాదే పిటిషన్ దాఖలు కాగా.. అమలు చేస్తామంటూ విద్యాశాఖ న్యాయస్థానంలో అంగీకరించింది. ప్రభుత్వ బడులు అందుబాటులో లేని 96 ఆవాసాల్లో పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలకు అవకాశం కల్పించేలా విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా 2025 జులైలో ఉత్తర్వులు జారీ చేశారు. కానీ కేవలం డీఈవోలకు ఉత్తర్వులు పంపి ఊరుకున్నారు. ఫలితంగా 2025-26, 2026-27 విద్యాసంవత్సరాల్లో 180 మంది మాత్రమే ప్రవేశాలు పొందినట్లు విద్యాశాఖ వర్గాల సమాచారం. సుప్రీం దృష్టిసారించిన నేపథ్యంలో దీని అమలుపై అధికారులు మళ్లీ కసరత్తు ఆరంభించారు.

కనీసం పులిట్జర్ అయినా ఇవ్వరా?

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. 'నాకు నోబెల్ బహుమతి రాలేదు. పులిట్జర్ కూడా రాలేదు. కనీసం నా రచనలకు పులిట్జర్ వచ్చి ఉండాల్సింది. రష్యా అనే అంశంపై కథనాలు రాసినవాళ్లకు వచ్చింది. రాకుడని వాళ్లకు వచ్చింది. వాళ్లకు రావాల్సింది కాదు' అని ట్రంప్ పేర్కొన్నారు.

సౌత్ కరోలినా సభలో పాల్గొన్న ట్రంప్.. తన మద్దతుదారులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా గతంలో అమెరికా ఎన్నికల్లో రష్యా జోక్యంపై కథనాలు రాసిన జర్నలిస్టులు పులిట్జర్ ప్రైజ్ గెలుచుకోవడంపై విమర్శలు గుప్పించారు. వారి రిపోర్టింగ్ తప్పుగా ఉందని, తనను లక్ష్యంగా చేసుకొని రాశారని ఆరోపించారు. ఇదిలాఉంటే, జర్నలిజం, పుస్తకాలు, నాటకం, సంగీతం రంగాల్లో విశేష ప్రతిభ కనపరిచే వారికి పులిట్జర్ పురస్కారాన్ని అందిస్తారు.

జనవరి 1 నుంచి సిమ్ బైండింగ్ రూల్స్



హైదరాబాద్, అక్టోబర్ 22 : వాట్సప్, టెలిగ్రామ్ వంటి కమ్యూనికేషన్ యాప్స్ కు సంబంధించిన సిమ్ బైండింగ్ నిబంధనలు వచ్చే ఏడాది జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. అంటే సిమ్ లేకుండా ఇకపై ఆయా యాప్స్ ఫోన్లో పనిచేయవన్నమాట. ఈ ఏడాది డిసెంబర్ 31లోగా సంబంధిత ప్లాట్ ఫారమ్ రిజిస్ట్రేషన్ కోసం ఉపయోగించే లైవ్ సిమ్ములతో ఖాతాలను అనుసంధానించాలని టెలికాం విభాగంమార్గదర్శకాలు జారీ చేసింది. మొబైల్ నంబర్లను ఉపయోగించి చేసే సైబర్ నేరాలను అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ నిబంధనలు కేంద్రం తీసుకొచ్చింది. ఈ ఏడాది మార్చి నుంచే ఈ రూల్స్ను అమలు చేయాల్సి ఉండగా.. పరిశ్రమ వర్గాల విజ్ఞప్తి మేరకు గడువును పొడిగించింది.

సిమ్ బైండింగ్ నిబంధనల ప్రకారం.. సిమ్ కార్డు లేకపోయిన లేదా సిమ్ తొలగించినా వాట్సప్, టెలిగ్రామ్, సిగ్నల్ వంటి కమ్యూనికేషన్ యాప్ సేవలు ఆటోమేటిక్ గా ఆగిపోతాయి. ప్రస్తుతం యాప్ ఇన్ స్టలేషన్ సమయంలోనే సిమ్కార్డును ధ్రువీకరించుకుంటున్నారు. ఆ తర్వాత డివైజ్ నుంచి సిమ్కార్డును తొలగించినా, డీయాక్టివేట్ చేసినా సేవలు మాత్రం కొనసాగుతున్నాయి. దీంతో ఇతర దేశాల్లో ఉండే సైబర్ నేరగాళ్లు యాప్స్ ను వినియోగించుకోవడం సాధ్యమవుతోంది. సిమ్ బైండింగ్ నిబంధన వల్ల మోసపూరిత కార్యకలాపాలు తగ్గుతాయని సైబర్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఎవరిపై ప్రభావం?

ఎవరైనా సిమ్ లేకుండా వాట్సప్ వాడుతుంటే ఆ ఫోన్లలో కొత్త నిబంధనల ప్రకారం యాప్ సేవలు నిలిచిపోతాయి. ఒకే యాప్ ను వేర్వేరు డివైజుల్లో వాడుతున్నప్పుడూ ప్రైమరీ డివైజులు కాకుండా మిగిలిన వాటిలో సేవలు నిలిచిపోతాయి. వాస్తవానికి వెబ్ లాగిన్ ను ఆరు గంటలకోసారి లాగౌట్ అయ్యేలా తొలుత నిబంధన తెచ్చినప్పటికీ.. తర్వాత ఆ నిబంధనను తొలగించారు. రిస్క్ బేస్డ్ లాగౌట్ విధానాన్ని డాట్ తీసుకొచ్చింది.

స్విట్జర్లాండ్‌లో మంచు కరిగి..
బయటపడుతున్న ఏళ్లనాటి రహస్యాలు

వాషింగ్టన్, అక్టోబర్ 22 : తెల్లని మంచు శిఖరాలు, పచ్చని లోయలకు నిలయమైన స్విట్జర్లాండ్ కు పెనుముప్పు పొంచి ఉంది. పర్వతాలపై ఉన్న మంచు వేగంగా కరగడంతో దిగువనున్న గ్రామాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ ఏడాది స్విట్జర్లాండ్ మొత్తం మంచులో 5.5 శాతం తగ్గిపోయింది.

ప్రపంచంలో ఇది రెండో అతిపెద్ద క్షీణతని శాస్త్రవేత్తలు వెల్లడించారు. కరుగుతున్న ఈ మంచు పొరల కింద దశాబ్దాల క్రితం గల్లంతైన పర్వతారోహకుల మృతదేహాలతో పాటు శతాబ్దాల చరిత్ర బయటపడుతోంది. ఇలా బయటపడ్డ వస్తువులతో లూసర్న్ నగరంలో ట్రెజరీ ఆఫ్ ఐస్ పేరిట ప్రదర్శన ఏర్పాటు చేశారు. దీనిలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన రెండు వేల ఏళ్లనాటి రోమన్ విగ్రహం కూడా ఉంది.

ఉక్రెయిన్‌తో చర్చలకు పుతిన్ అంగీకారం

మాస్కో, అక్టోబర్ 22 : రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు దిశగా కీలక ముందడుగు పడింది. శాంతి స్థాపనకు వీలుగా రష్యా, ఉక్రెయిన్, అమెరికాల మధ్య త్రైపాక్షిక చర్చలను పునరుద్ధరించేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అంగీకరించారు. అమెరికా-రష్యా ఆర్థిక సంబంధాల పునరుద్ధరణపైనా చర్చలకు సిద్ధంగా ఉన్నానని ఆయన పేర్కొన్నారు. ఇరాన్‌తో తమకున్న ప్రత్యేక సంబంధాలను ఉపయోగించుకుని అమెరికాతో శాంతికి సహకరిస్తాననీ హామీ ఇచ్చారు. పుతిన్‌తో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్ బుధవారం భేటీ అయ్యారు. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో 3 గంటలపాటు జరిగిన ఈ సమావేశంలో యుద్ధం ముగింపుపై చర్చించారు. ట్రంప్ అల్లుడు, చర్చల ప్రతినిధి జేర్డ్ కుష్నర్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా పాల్గొన్నారు. ఉక్రెయిన్‌పై రష

ఖిల్లా వరంగల్ అభివృద్ధికి పరిపాలన అనుమతులు

హైదరాబాద్, అక్టోబర్ 22 : హనుమకొండ కోర్ ఏరియా, ఖిల్లా వరంగల్ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. రూ.382 కోట్లతో ఖిల్లా వరంగల్, సెంట్రల్ ప్లాజా, బస్ టెర్మినల్, వెయ్యి స్తంభాల గుడి, మ్యూజికల్ గార్డెన్ అభివృద్ధి పనులు చేపట్టేందుకు అనుమతిచ్చింది. ప్రపంచ బ్యాంకు నిధులతో కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఈ అభివృద్ధి పనులు చేపట్టనుంది.

పాలమూరు నుంచి డిండికి నీటి తరలింపును ఆపండి

- ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన జిల్లా నేతలు



మహబూబ్ నగర్, అక్టోబర్ 22 : పాలమూరు నుంచి డిండి ప్రాజెక్టుకు నీటి తరలింపును ఆపాలని జిల్లా ప్రతినిధులు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, జానారెడ్డి తదితరులు గురువారం ఉత్తమ్ తో సమావేశమయ్యారు. దాదాపు గంటన్నరపాటు చర్చించారు. డిండి ప్రాజెక్టు విషయంలో ఇబ్బందులను ఉత్తమ్ దృష్టికి తీసుకెళ్లారు. డిండి ప్రాజెక్టుకు ఏదుల నుంచి కాకుండా వేరే మార్గం ద్వారా నీటిని తీసుకోవాలని కోరారు. డిండి ప్రాజెక్టుకు నీరు ఇచ్చేందుకు తాము వ్యతిరేకం కాదని, ఏదుల నుంచి నీటిని తీసుకుంటే పాలమూరు ఆయకట్టుకు ఇక్కట్లు ఎదురవుతాయని చెప్పారు. అధికారులతో చర్చించి ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని ఉత్తమ్ హామీ ఇచ్చారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో

కాంగ్రెస్ పార్టీ విజయం కోసం సమష్టిగా కృషి చేయాలె



నవంబర్ 6 లోపు పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించాలి

మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, అక్టోబర్ 22, (మనం బ్యూరో) : హైదరాబాద్ - రంగారెడ్డి - మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని హైదరాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. గురువారం నాంపల్లిలోని రెడ్ రోజ్ గార్డెన్స్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ పరిధిలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు పార్టీకి ఎంతో రాజకీయ ప్రాధాన్యత ఉందన్నారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా భవిష్యత్తులో హైదరాబాద్ పరిధిలో జరిగే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ తన బలాన్ని నిరూపించుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, పార్టీ సీనియర్ నాయకుల సలహాలు, సూచనల మేరకు కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సామ రామ్మోహన్ రెడ్డిని ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఖరారు చేసినట్లు తెలిపారు. అభ్యర్థి విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని సూచించారు. నవంబర్ 6వ తేదీలోపు అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించే ప్రక్రియను పూర్తి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. హైదరాబాద్ పరిధిలోని నియోజకవర్గాల్లో బూత్ అధ్యక్షులు, బ్లాక్ అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, బూత్ స్థాయి ఏజెంట్లు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, వివిధ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు తదితర అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. హైదరాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రిగా తాను, మంత్రి అజారుద్దీన్ తదితర నాయకులు క్షేత్రస్థాయి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ యువతకు వేలాది ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వివిధ శాఖల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. ప్రభుత్వ విజయాలను పట్టభద్రులకు వివరించడంతో పాటు, వారి సమస్యలను తెలుసుకుని పార్టీకి మద్దతు కూడగట్టాలని నాయకులకు ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

సంస్థ వాటాలపై అసత్య ప్రచారం



వివరాలు వెల్లడించిన మెడికవర్

రోగి మృతి ఘటనపై వివరణ ఇచ్చిన యాజమాన్యం

సమగ్ర విచారణకు డీజీపీని కలుస్తామని వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 22(మనంన్యూస్): మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యం తమ సంస్థకు సంబంధించిన వాటాల వివరాలను గురువారం మీడియాకు వెల్లడించింది. సంస్థ షేర్ల విషయంలో అసత్య ప్రచారం జరుగుతోందని తెలిపింది. సికింద్రాబాద్లోని మెడికవర్ ఆసుపత్రిలో యువ రోగి మృతి ఘటనకు సంబంధించి గత రెండు వారాలుగా మీడియాలో జరుగుతున్న ప్రచారంపైనా ఆసుపత్రి యాజమాన్యం స్పందించింది.ఈ ఘటనకు సంబంధించిన వైద్యపరమైన వివరాలను మీడియా ముందు వెల్లడిస్తూ, వాస్తవాలను వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని ఆరోపించింది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)ను కోరనున్నట్లు వెల్లడించింది.ఈ సందర్భంగా డాక్టర్ అనిల్ కృష్ణ మాట్లాడుతూ రోగికి అవసరమైన వైద్య చికిత్సను తగిన సమయంలో అందించామని, నిర్దేశిత వైద్య విధానాలను అనుసరించామని పేర్కొన్నారు. కిడ్నీ రాయి కంటే, తీవ్రమైన ఇన్ఫెక్షన్ మరియు దానికి శరీరం స్పందించిన తీరు ఈ విషాదకర పరిణామానికి కారణమయ్యాయని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి కొన్ని సోషల్ మీడియా ఛానళ్లు వాస్తవాలకు విరుద్ధమైన సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు, నిరసనలను ప్రోత్సహిస్తూ ఆసుపత్రి ప్రతిష్ఠను, రోగుల్లో ఆసుపత్రిపై ఉన్న నమ్మకాన్ని, వైద్యుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు.ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ డీజీపీని కలిసి వినతిపత్రం అందించనున్నట్లు వెల్లడించారు. వాస్తవాలను వక్రీకరించి ప్రచారం చేయడంపైనే తమ అభ్యంతరమని తెలిపారు. ప్రతి క్లిష్టమైన కేసులోనూ తమ వైద్యులు అదే అంకితభావంతో చికిత్స అందిస్తారని, ఒక ఘటనతో తమ సేవా నిబద్ధత, విలువలు మారవని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, మెడికవర్ ఆసుపత్రుల యాజమాన్యానికి సంబంధించి ఇటీవల వస్తున్న ఆరోపణలపైనా యాజమాన్యం వివరణ ఇచ్చింది. సహృదయ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ జనవరి 2011లో స్థాపించబడిందని తెలిపింది. మెడికవర్ ఏబీ అనే స్టాక్ మార్కెట్లో నమోదైన సంస్థ 2017 నుంచి పెట్టుబడులు పెట్టిందని, ప్రస్తుతం ఆ సంస్థ 66.1 శాతం వాటాను కలిగి ఉందని పేర్కొంది. 2017 నుంచి ఇప్పటివరకు కొత్త షేర్ల కేటాయింపు జరగలేదని యాజమాన్యం వెల్లడించింది. కేకేఆర్ తో ఇటీవల జరిగిన లావాదేవీకి ముందు మూడు న్యాయ సంస్థల ద్వారా పూర్తి స్థాయి డ్యూ డిలిజెన్స్ నిర్వహించినట్లు తెలిపింది.సంస్థ పై నిరాధార ఆరోపణలు చేసిన బాధ్యులపై సివిల్, క్రిమినల్ పరువు నష్టం చర్యలు చేపడుతున్నట్లు మెడికవర్ హాస్పిటల్స్ యాజమాన్యం స్పష్టం చేసింది.

రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం, వారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం తమ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్న మెడికవర్ యాజమాన్యం, ఈ ఘటనపై వాస్తవాలు వెలుగులోకి రావడానికి సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరపాలని కోరింది.ఈ మీడియా సమావేశంలో మెడికవర్ హాస్పిటల్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కృష్ణతో పాటు, డాక్టర్ ఏ. శరత్ రెడ్డి, సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ అండ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్; పి. హరికృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్; డాక్టర్ ప్రమోద్ కుమార్ కుచులకంటి, చీఫ్ ఆఫ్ కార్డియాలజీ, డైరెక్టర్ - స్ట్రక్చరల్ హార్ట్ అండ్ అడ్వాన్స్డ్ కరోనరీ ఇంటర్వెన్షన్స్ పాల్గొన్నారు.

ప్రకృతితో మమేకం కాకపోతే.. విపత్తులు తప్పవు

- దత్తాత్రేయ అలయ్‌బలయ్ కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు
- పాల్గొన్న గవర్నర్ శుక్లా, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు



హైదరాబాద్, అక్టోబర్ 22 : భారతీయ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ప్రకృతితో మమేకమై జీవనం సాగించకపోతే.. విపత్తులు తప్పవని హితవు పలికారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ నేతృత్వంలో హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో అలయ్ బలయ్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాజకీయాలకు అతీతంగా పలు పార్టీల నేతలు హాజరయ్యారు.

తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు సహా పలువురు బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ సహా పలు పార్టీల నేతలు సైతం తరలివచ్చారు. మనుషుల మధ్య ఐక్యతను పెంపొందించే కార్యక్రమమే అలయ్ బలయ్ అని ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు చెప్పారు. సెక్యులర్ దేశంలో ఏ మతాన్నీ, ఏ పండగనూ తక్కువ చేసి చూడొద్దని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. వికసిత్ భారత్ మనందరి లక్ష్యం కావాలని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. అలయ్ బలయ్ అనేది కులమతాలు, రాజకీయాలు, ప్రాంతాలకు అతీతమైన వేదిక అని దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి అన్నారు.

కాళేశ్వరం విచారణపై సర్కార్‌కు సవాల్

నిరసనలు శాంతియుతంగా చేయాలె

కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంపీ రఘునందన్

హైదరాబాద్, అక్టోబర్ 22 : దేశవ్యాప్తంగా ప్రధాని మోడీ, కేంద్ర ప్రభుత్వం గురించి తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ ప్రతిపక్షాలపై మెదక్ ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు. ప్రతిపక్షాల నిరసనలు శాంతియుతంగా జరిగిన రోజు మేధావులు, ప్రజలు హర్షిస్తారని అన్నారు. లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత టీషర్టులు వేసుకుని బారికేడ్లు ఎక్కుతున్నారంటూ రాహుల్ గాంధీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. గీత దాటి వ్యవహరిస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుందని ప్రతిపక్షాలను హెచ్చరించారు. దేశంతో సంబంధం లేని వ్యక్తులు పార్లమెంట్‌పై దాడి చేస్తామంటే ఊరుకోబోమని స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీ నేతలు నిరసన వ్యక్తం చేస్తామంటే అరెస్ట్ చేస్తున్నారని కాంగ్రెస్ సర్కార్ తీరును ఈ సందర్భంగా మెదక్ ఎంపీ ఎండగట్టారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న తెలంగాణలో బీజేపీ అరెస్టులపై సమాధానం చెప్పాలని రాహుల్ గాంధీని ఆయన డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ ఎందుకు వేయడం లేదని కేంద్రప్రభుత్వాన్ని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నిస్తున్నారని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని ఆయన తప్పుడు ప్రచారం చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మూడు బ్యారేజీలపై విచారణకు ఇవ్వకుండా.. ఓ బ్యారేజ్ మీద ఎందుకు విచారణ అడుగుతున్నారో సమాధానం చెప్పాలని అధికార పార్టీ నేతలను ఆయన డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డిని పెంచి పోషిస్తున్న కాంట్రాక్టర్ ను కాపాడేందుకే విచారణకు ఇవ్వడం లేదని రఘునందన్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీలో పొత్తు కోసం నంది నగర్ కేసీఆర్ నివాసానికి గతంలో గులాంనబీ ఆజాద్‌తో వెళ్లింది నిజం కాదా? అని కాంగ్రెస్ పార్టీ నేతలను ఎంపీ సూటిగా ప్రశ్నించారు. కొండారెడ్డి పల్లిలో ఎన్ని ఓట్లు పోయాయో వాళ్లను వేంకటేశ్వరస్వామి గుడికి తీసుకురావాలని.. లేకుంటే తన సొంత ఊరు బొప్పాపురంనకు రావాలని ఎస్ఐఆర్(సర్) పై చర్చిద్దామని సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. రాష్ట్రంలో ఓట్లు పోలేదు కానీ తెలంగాణ నుంచి డిల్లీకి నోట్లు పోతున్నాయని వ్యంగ్యంగా అన్నారు. ముస్లిం ఓటర్లు కూడా కాంగ్రెస్ వాదనను పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. హిందువుల ఓట్లు శాస్త్రీయంగా పోయాయన్నారు.

హైదరాబాద్‌లో ఓట్లు తగ్గడానికి ప్రధాన కారణం సొంత ఊర్లోనే ఓటును ఉంచుకున్నారని వివరించారు. గతంలో సొంతూరుతోపాటు హైదరాబాద్‌లో కలిపి రెండు ఓట్లు ఉండేవని రఘునందన్ రావు అన్నారు. రాహుల్ గాంధీ తెలంగాణ సభ పెట్టే ముందు కొండారెడ్డి పల్లిలో ఎన్ని ఓట్లు పోయాయో ఓటర్ లిస్ట్ బహిరంగ పర్చాలని రేవంత్ రెడ్డిని ఆయన డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ద్వారా ఓట్లు పోలేదని నిరూపించడానికి బీజేపీ ప్రజా ప్రతినిధులము సిద్ధంగా ఉన్నామని ప్రతిపక్ష పార్టీలకు ఆయన స్పష్టం చేశారు. బీసీలపై చిత్త శుద్ధి ఉంటే మంత్రివర్గంలో జనాభాకు అనుగుణంగా 56 శాతం మంత్రి పదవులు ఇవ్వాలని అధికార పార్టీని డిమాండ్ చేశారు. కాంగ్రెస్.. బీఆర్ఎస్ రెండు పార్టీల ఆస్తుల వివాదం పై హైకోర్టు చీఫ్ జస్టిస్ కు లేఖ రాశానని తెలిపారు. హైకోర్టు చీఫ్ జస్టిస్ స్పందన తర్వాత వివరాలు వెల్లడిస్తానని ఎంపీ రఘునందన్ రావు చెప్పారు.

వాటర్ బోర్డ్ ఉద్యోగుల సమ్మెపై

నిషేధం పొడిగింపు ఎల్‌నినో



హైదరాబాద్, అక్టోబర్ 22 : ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ వాటర్ వర్క్స్‌లో ఉద్యోగుల సమ్మెపై విధించిన నిషేధాన్ని మరోసారి పొడిగించింది. మరో ఆరు నెలల పాటు సమ్మెపై నిషేధాన్ని విధించింది. గురువారం ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జీవో నంబర్ 955ను ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ జారీ చేశారు. ఆదేశాలను అమలు చేయాలని హైదరాబాద్ వాటర్ బోర్డు ఎండీకి స్పష్టం చేశారు. అక్టోబర్ 21వ తేదీ నుంచి ఈ సమ్మెపై నిషేధం అమల్లోకి వచ్చిందని ఆ జీవోలో స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుందని వివరించారు. నీటి సరఫరా, పంపింగ్ సేవల్లో సమ్మెలకు అనుమతి లేదని జారీ చేసిన జీవోలో వివరించారు.



పత్తి కొనుగోళ్లకు సర్వం సిద్ధం

పత్తి రైతుకు ధరల భరోసా కల్పించాలె

అధికారులకు తుమ్మల దిశానిర్దేశం

హైదరాబాద్, అక్టోబర్ 22: రాష్ట్రంలో 2026-27 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ కు సంబంధించి పత్తి కొనుగోలు కేంద్రాలను గత ఏడాది మాదిరిగానే ప్రారంభించి, రైతులకు కనీస మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార మరియు చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో మార్కెటింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రాష్ట్రంలో పత్తి సాగు, ఉత్పత్తి అంచనాలు, మార్కెట్ ధరలు, సీసీఐ కొనుగోళ్లకు చేసిన ఏర్పాట్లు, రైతులకు అందిస్తున్న సౌకర్యాలపై సమీక్షించారు. పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, కొనుగోళ్లలో జాప్యం లేకుండా చూడటం, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవడం ప్రభుత్వ ప్రాధాన్యత అని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుత 2026-27 ఖరీఫ్ సీజన్ లో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 48.20 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరగగా, 29.43 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా వేస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. గత సీజన్లో 50.73 లక్షల ఎకరాల్లో సాగు జరగగా, 28.33 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి నమోదైంది. దేశవ్యాప్తంగా ప్రస్తుత సీజన్లో 271.06 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరగగా, 133.04 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా. గత సీజన్లో 148.02 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి నమోదైంది. దేశవ్యాప్తంగా ఎల్నినో ప్రభావం సహా ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా పత్తి ఉత్పత్తి తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో, రాష్ట్రంలో కొనుగోళ్ల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని మంత్రి సూచించారు.

కనీస మద్దతు ధర రూ.8,667.. రైతులకు ధరల భరోసా

కేంద్ర ప్రభుత్వం 2026-27 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ కు పత్తి కనీస మద్దతు ధరను క్వింటాల్కు రూ.8,667గా ప్రకటించింది. ప్రస్తుతం తెలంగాణలో పత్తి మోడల్ మార్కెట్ ధర సుమారు రూ.9,000గా ఉందని అధికారులు వివరించారు. ఇది కనీస మద్దతు ధర కంటే రూ.333 అధికం. మార్కెట్ ధరలు కనీస మద్దతు ధర కంటే ఎక్కువగా ఉన్నప్పుడు రైతులు బహిరంగ మార్కెట్లో విక్రయించుకోవచ్చని, ధరలు తగ్గి కనీస మద్దతు ధర కంటే దిగువకు వచ్చినప్పుడు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తిని విక్రయించుకునే అవకాశం ఉంటుందని మంత్రి తెలిపారు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు సీసీఐ, మార్కెటింగ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పత్తిలో తేమ శాతం, నాణ్యత ఆధారంగా సీసీఐ నిబంధనల ప్రకారం కొనుగోలు ధర నిర్ణయిస్తారని, రైతులు పత్తిని విక్రయించే ముందు నాణ్యత ప్రమాణాలు, తేమ శాతాన్ని పరిశీలించుకోవాలని సూచించారు.

335 జిన్నింగ్ మిల్లులు కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై..

2026-27 సీజన్లో పత్తి కొనుగోళ్ల కోసం సీసీఐ గత సీజన్లో ఉన్న 122 కొనుగోలు కేంద్రాల సంఖ్యను 133కు పెంచింది. రాష్ట్రంలో రోజుకు 1,09,035 బేళ్ల సామర్థ్యంతో 356 జిన్నింగ్ మిల్లులు ఉండగా, ఇప్పటివరకు 30 జిల్లాల్లో 335 జిన్నింగ్ మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై చేసినట్లు అధికారులు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, పత్తి నాణ్యత పరీక్షలు, జిన్నింగ్, బేళ్ల తయారీ, గోదాములకు రవాణా, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. దేశంలోని ఇతర ప్రధాన పత్తి మార్కెట్లతో పోలిస్తే తెలంగాణలో కొన్ని మార్కెట్లలో ధరలు తక్కువగా ఉండటానికి గల కారణాలను మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గుజరాత్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో పత్తి గింజల ప్రాసెసింగ్ యూనిట్లు, స్పిన్నింగ్ పరిశ్రమల సంఖ్య, సామర్థ్యం తక్కువగా ఉండటం కూడా ధరలపై ప్రభావం చూపుతోందని అధికారులు వివరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పత్తి ప్రాసెసింగ్, స్పిన్నింగ్, ఆయిల్ పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన అవకాశాలను పరిశీలించాలని మంత్రి సూచించారు. ఇతర రాష్ట్రాల్లో పరిశ్రమలకు అందిస్తున్న ప్రోత్సాహకాలు, రాయితీలు, సౌకర్యాల వివరాలను సేకరించి, తెలంగాణలో పత్తి ఆధారిత పరిశ్రమల విస్తరణకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మార్కెటింగ్ శాఖ, సీసీఐ అధికారులు బహిరంగ మార్కెట్లో పత్తి ధరలను ప్రతిరోజూ సమీక్షిస్తూ, ధరల వ్యత్యాసాలకు గల కారణాలను విశ్లేషించాలని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో పత్తి ప్రాసెసింగ్ సామర్థ్యం పెరిగితే స్థానికంగా పత్తికి డిమాండ్ పెరిగి, రైతులకు మెరుగైన ధరలు లభించే అవకాశాలు ఉంటాయని తెలిపారు.

నాణ్యమైన పత్తి సేకరణపై ప్రత్యేక దృష్టి...

పత్తి కొనుగోళ్లలో తెలంగాణ దేశంలో ముందంజలో ఉండటానికి రాష్ట్రంలో పండించే నాణ్యమైన పత్తి ప్రధాన కారణమని మంత్రి పేర్కొన్నారు. రైతులు పండించిన పత్తిని సేకరించి మార్కెట్లకు తరలించే సమయంలో నాణ్యత దెబ్బతినకుండా రైతులకు అవగాహన కల్పించాలని, కొనుగోలు కేంద్రాల్లో నాణ్యత పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలను కాపాడటం ద్వారా రైతులకు మెరుగైన ధర లభించడంతో పాటు సీసీఐ కొనుగోళ్లు కూడా సజావుగా సాగుతాయని తెలిపారు.

కపాస్ కిసాన్ యాప్ తో రైతులకు సౌలభ్యం...

పత్తి కొనుగోళ్లలో పారదర్శకత పెంచేందుకు కపాస్ కిసాన్ యాప్, ఆన్ లైన్ చెల్లింపులు, రైతుల వివరాల ధ్రువీకరణ వంటి డిజిటల్ విధానాలను అమలు చేస్తున్నారు. అక్టోబర్ 21, 2026 నాటికి 12,75,185 మంది రైతులకు సంబంధించిన 21,58,938 వివరాలను కపాస్ కిసాన్ యాప్ తో అనుసంధానం చేసినట్లు అధికారులు తెలిపారు. రైతులు పత్తి విక్రయానికి స్లాట్ బుక్ చేసుకునే ముందు యాప్లో నమోదైన వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. జిల్లాకు నిర్ణయించిన సగటు దిగుబడి కంటే ఎక్కువ పత్తి దిగుబడి ఉన్న రైతులు అదనపు దిగుబడి ధ్రువీకరణ కోసం సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలి. కౌలు రైతులు తమ పేర్ల నమోదు కోసం సంబంధిత అడ్డును సంప్రదించి, అవసరమైన భూమి, ఆధార్, మొబైల్ వివరాలను అందించాలని అధికారులు సూచించారు. భూ యజమాని ధ్రువీకరణ అనంతరం నమోదు ప్రక్రియ పూర్తవుతుంది.

టోల్ ఫ్రీ, వాట్సాప్ సేవలు అందుబాటులోకి...

పత్తి రైతులకు సమాచారం, సహాయం అందించేందుకు మార్కెటింగ్ శాఖ 1800-599-5779 టోల్ఫ్రీ నంబర్ను అందుబాటులోకి తీసుకువచ్చింది. అలాగే 8897281111 వాట్సాప్ నంబర్ ద్వారా పత్తి కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను తెలుసుకునే సౌకర్యం కల్పించింది. ఈ సేవల ద్వారా రైతులు సీసీఐ ద్వారా ఎంత పత్తి విక్రయించవచ్చో, విక్రయించిన పంట విలువ, చెల్లింపుల స్థితి, కొనుగోలు కేంద్రాల్లో వేచి ఉండే సమయం తదితర వివరాలను తెలుసుకోవచ్చు. అన్ని మార్కెట్ యార్డుల్లో ప్రత్యేక హెల్ప్డెస్క్ ఏర్పాటు చేసి, కొనుగోలు కేంద్రాల్లో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. రైతులు పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ముందు తేమ శాతాన్ని పరీక్షించుకునేందుకు రాష్ట్రంలోని రైతు వేదికల వద్ద మాయిశ్చర్ మీటర్లను అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు.

రైతులకు మంత్రి విజ్ఞప్తి

రైతులు ప్రస్తుత మార్కెట్ ధరలను పరిశీలించి, కనీస మద్దతు ధర కంటే ఎక్కువ ధర లభిస్తున్నప్పుడు బహిరంగ మార్కెట్లో పత్తిని విక్రయించుకోవాలని మంత్రి సూచించారు. మార్కెట్ ధర తగ్గినప్పుడు సీసీఐ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలకు అనుగుణంగా పత్తిని విక్రయించుకోవాలని కోరారు. పత్తి కొనుగోళ్లలో పారదర్శకత, రైతులకు ధరల భరోసా, సకాలంలో చెల్లింపులు, కొనుగోలు కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పత్తి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.

ఆరు వేళ్లు

అమ్మ చివరిసారి
శ్వాస పీలుస్తూ నిద్రలో విశ్రాంతి పొందుతున్న వేళ
నడిచిన పాద ముద్రలను వెతికాను..
అందరి అమ్మల కాళ్లకు ఐదు వేళ్లైతే
మా అమ్మకు ఆరు వేళ్లు..
కాలుతున్న వెన్నుముక వెంట
రాత్రులు కాపలా కాశాను
నీలో కదులుతున్న చివరి వాక్యాన్ని నీ పెదాల
కదలికల వెంట జారుతున్నపుడు
అందుకోలేక పోయాను

మన ఇంటి వాకిట్లో నీ తెల్లటి ముగ్గులో
కదులుతున్న నీ చేతి ముని వేళ్ళను చూశాను తల్లీ
నా నుదుటి మీద వొణుకు తున్న
చేతులతో స్పృశించిననీ చల్లటి
స్పర్శ ఇంకా నాలో కదులుతుంది

నీకు కావలసిన ఆక్సిజన్ అందించలేకపోయాను
ముడుచుకుంటున్న ఊపిరి తిత్తుల నిండా
కదలని శ్వాసలో కలవరింతలు విన్నాను
బతకాలనే ఆరాటంలో
లోపల కదులుతున్న మృత్యునావ
తిరగబడుతున్నదని
నీకు తెలుసు
స్పర్శ కోల్పోతున్న దేహానికి
వొక.. పోరాటాన్ని అంకితం చేశావు
ప్రతి పూల పండుగకు నిన్ను
వెతుక్కుంటూ నేనొస్తాను
తలుపులు తెరిచిన ఇంట్లో
నువ్వు ఎదురుచూస్తుంటావని..

చీకటిని తరమడానికి నువ్వెలింగించిన
దీపం వెలుగుతూనే ఉంది
నీకిష్టమైన మందారపువ్వు
నువ్వొస్తావని ఎదురుచూస్తుంది
నీతో ముచ్చటించాలని
నీ వెంట తిరగాలని తుల్య
మాటలను స్కూల్ బ్యాగ్‌లో సర్దుకుని వచ్చింది..
ఈ నవరాత్రుల వేళ...బతుకమ్మవై...
బతికిరామ్మా

- ఎం.వి.రమణ
9989000265

యూరప్ ఆందోళనలనకు కారణాలేమిటి?



ఒకప్పుడు ప్రపంచానికి ప్రజాస్వామ్య విలువలను,సంక్షేమరాజ్య భావనను, నాణ్యమైన విద్యను, సామాజిక భద్రతను పరిచయం చేసిన యూరప్ ఇప్పుడు ఆందోళనలతో అట్టుడు కుతోంది. ఫ్రాన్స్‌లో పాఠశాలల దుస్థితి, ఉపాధ్యాయుల కొరతపై మొదలైన నిరసనలు జీవన వ్యయానికి వ్యతిరేకంగా విస్తరిస్తుంటే, స్పెయిన్, పోర్చుగల్లో గృహ సంక్షోభం ప్రజలను వీధుల్లోకి తీసుకొస్తోంది. ఇటలీలో ధరల పెరుగుదల, తక్కువ వేతనాలపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. బెల్జియంలో ప్రభుత్వ పొదుపు చర్యలు, విద్యారంగ సమస్యలు నిరసనలకు కారణమవుతున్నాయి. కొన్నిచోట్ల ఈ ఆందోళనలు హింసాత్మకంగా మారుతున్నాయి.

ఒక దేశంలో నిరసనలు జరిగితే అక్కడి ప్రభుత్వ విధానాలను తప్పుపట్టవచ్చు. కానీ, అనేక దేశాల్లో ఒకే సమయంలో ఇలాంటి పరిణామాలు చోటుచేసుకోవడం యాదృచ్ఛికం కాదు. ఇవి వ్యక్తిగత పాలకుల వైఫల్యాలకే పరిమితమైన సమస్యలు కావు. యూరప్ ఆర్థిక నమూనా, సంక్షేమ రాజ్య భవిష్యత్తు, తరాల మధ్య పెరుగుతున్న అసమానతలు, ప్రజాస్వామ్యంపై ప్రజలకు తగ్గుతున్న విశ్వాసం వంటి లోతైన పరిణామాలకు సంకేతాలు. అసలు ఈ అసంతృప్తి మూలాలు ఎక్కడున్నాయి?

ప్రస్తుతం యూరప్‌ను కుదిపేస్తున్న ప్రధాన సమస్య జీవన వ్యయం. ఆహారం, ఇంధనం, విద్యుత్తు, అద్దెల ధరలు పెరుగుతున్నా, వేతనాలు అదే స్థాయిలో పెరగడం లేదు. ఫలితంగా ఉద్యోగం చేస్తున్నవారు సైతం ఆర్థిక అభద్రతను ఎదుర్కొంటున్నారు. నెలవారీ ఆదాయంలో అధికభాగం ఇంటి అద్దెకే ఖర్చవుతుంటే, విద్య, వైద్యం, ఇతర అవసరాలకు డబ్బు మిగలడం లేదు.

సామాన్యులను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. స్పెయిన్‌లోనూ గృహసంక్షోభం యువతను నిరసనల వైపు నడిపి స్తోంది. మరోవైపు, అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ఇంధన సరఫరాలో అంతరాయాలు ధరల ఒత్తిడిని మరింత పెంచుతున్నాయి. అంటే, ప్రజల ఆగ్రహానికి తక్షణ కారణాలు దేశీయమైనప్పటికీ, వాటిని తీవ్రతరం చేస్తున్న శక్తుల్లో అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలూ ఉన్నాయి.

రెండో ప్రపంచ యుద్ధం తరువాత యూరప్ దేశాలు సంక్షేమ రాజ్య నిర్మాణానికి ప్రాధాన్యమిచ్చాయి. ప్రభుత్వ విద్య, ప్రజారోగ్యం, నిరుద్యోగ భృతి, కార్మిక హక్కులు, పింఛన్లు ప్రజలకు సామాజిక భద్రత కల్పించాయి. మార్కెట్ ఆర్థిక వ్యవస్థలోని అసమానతలను కొంతవరకు తగ్గించాయి.



అయితే, ప్రపంచీకరణ, ఆర్థిక పోటీ, జనాభా వృద్ధాప్యం, ప్రభుత్వాలపై పెరుగుతున్న అప్పుల భారం ఈ నమూనాకు సవాళ్లు విసురుతున్నాయి. బడ్జెట్ లోటును తగ్గించాలనే పేరుతో ప్రభుత్వాలు ఖర్చులను కుదించినప్పుడు, దానిప్రభావం తరచుగా విద్య,వైద్యం, ప్రజారవాణా వంటి సేవలపై పడుతోంది.

బెల్జియంలో ప్రభుత్వ బడ్జెట్ కోతలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు నిరసనలు చేపట్టడం ఈ సంఘర్షణకు ఉదాహరణ. ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణ ఒకవైపు అవసరమే. కానీ దాని భారాన్ని కార్మికులు, పెన్షనర్లు, తక్కువ ఆదాయ వర్గాలే మోయాల్సి వస్తే సంక్షేమ రాజ్యంపై విశ్వాసం దెబ్బతింటుంది.

విద్యారంగం క్షీణిస్తే భవిష్యత్తు ఏమవుతుంది?

విద్య అనేది కేవలం ప్రభుత్వ వ్యయంలో ఒక అంశం కాదు. సమాజ భవిష్యత్తుకు పునాది. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత,విద్యార్థుల సంఖ్య మరీ ఎక్కువగా ఉండడం, వసతుల లేమి, నాణ్యత తగ్గడం వంటి సమస్యలు యువత భవిష్యత్తుపై అనిశ్చితిని పెంచుతున్నాయి.

ఫ్రాన్స్‌లోపాఠశాలల వనరులు, సిబ్బంది కొరతపై మొదలైన నిరసనలు క్రమంగా జీవన వ్యయం, ప్రభుత్వ సేవలపై అసంతృప్తితో కలిశాయి. స్పెయిన్‌లో ఉపాధ్యాయుల మెరుగైన వేతనాలు, పని పరిస్థితుల కోసం ఉద్యమిస్తున్నారు.

చదువుకుంటే ఉద్యోగం వస్తుందనే నమ్మకం బలహీన పడినప్పుడు యువతలో నిరాశ పెరుగుతుంది. విద్యార్హతలు పెరిగినా స్థిరమైన ఉపాధి, సొంతఇల్లు, మెరుగైన జీవితం అందక పోతే వ్యవస్థ తమకు అవకాశాలు కల్పించడం లేదనే భావన ఏర్పడుతుంది. ఈ నిరాశే నిరసనలకు ఇంధనంగా మారుతోంది.

చరిత్ర పాఠాలు.. వర్తమాన హెచ్చరికలు

యూరప్‌లో ప్రజాఉద్యమాలకు సుదీర్ఘ చరిత్ర ఉంది. 1789 ఫ్రెంచ్ విప్లవం సామాజిక అసమానతలు, ఆర్థిక సంక్షోభం, పాలకవర్గాల ప్రత్యేక హక్కులకు వ్యతిరేకంగా ప్రజలు తిరగబడిన చారిత్రక ఘట్టం. 1848 నాటి యూరోపియన్ విప్లవాలు రాజకీయ హక్కులు, జాతీయ స్వాతంత్ర్యం, సామాజిక న్యాయం కోసం సాగాయి. 1968లో ఫ్రాన్స్‌లో విద్యార్థుల ఉద్యమం కార్మిక సమ్మెలతో కలసి విస్తృత సామాజిక మార్పుల చర్చకు దారితీసింది.

ఈ చరిత్రను ప్రస్తుత నిరసనలతో సమానంగా చూడలేం. అయినప్పటికీ, ఒక విషయం స్పష్టమవుతుంది. ఆర్థిక ఇబ్బందులు రాజకీయ అసంతృప్తితో కలిసినప్పుడు చిన్న సమస్య కూడా పెద్ద ఉద్యమానికి నాంది కావచ్చు.

ప్రస్తుత పరిస్థితుల్లో మరో ప్రమాదం ఉంది. ప్రజల అసంతృప్తిని పరిష్కరించడంలో ప్రధాన రాజకీయ పార్టీలు విఫలమైతే, వలసదారులను లేదా ఇతర బలహీన వర్గాలను సమస్యలకు కారణంగా చూపే అతివాద రాజకీయ శక్తులు బలపడవచ్చు. అసలు కారణాలపై చర్చ జరగకుండా ప్రజల ఆగ్రహం ఇతరులపైకి మళ్లే ప్రమాదం ఉంది.

అయితే, అన్ని దేశాల్లోనూ సమస్యలు ఒకేలా లేవు. ఒకచోట విద్యారంగం, మరొకచోట గృహ సంక్షోభం, ఇంకొక చోట ప్రభుత్వ పొదుపు చర్యలు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. స్థానిక సమస్యలు వేర్వేరైనా, వాటి వెనుక ఉన్న ఉమ్మడి ప్రశ్న ఒక్కటే. ఆర్థిక వృద్ధి ఫలాలు సామాన్య ప్రజలకు ఎంతవరకు అందుతున్నాయి?

ప్రభుత్వాలు హింసను అరికట్టడం అవసరమే. ప్రజా ఆస్తుల విధ్వంసాన్ని సమర్థించేవారెరూ ఉండరు. కానీ హింసాత్మక ఘటనలనే మొత్తం ఉద్యమానికి ప్రతిరూపంగా చూపించి, నిరసనలకు దారితీసిన అసలు సమస్యలను విస్మరించడం పరిష్కారం కాదు. నాణ్యమైన ప్రభుత్వ విద్య, అందుబాటులో గృహాలు, గౌరవప్రదమైన వేతనాలు, మెరుగైన ప్రజాసేవలు, పారదర్శక పాలనకు ప్రాధాన్యమివ్వాలి. యూరప్ వీధుల్లో వినిపిస్తున్న నినాదాలు కేవలం ధరల తగ్గింపు కోసం చేస్తున్న డిమాండ్లు కావు. అవి తమ భవిష్యత్తుపై ప్రజలు సంధిస్తున్న ప్రశ్నలు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, వారి ఆకాంక్షలకు భరోసా కల్పించడం లాంటి ప్రశ్నకు పాలకులు సమాధానం చెప్పలేకపోతే, నేటి నిరసనలు క్రమంగా రాజకీయ ప్రకంపనలుగా మారనుండడాన్ని రేపటి రోజున మనం చూడబోతున్నాము.

- గుండెబోయిన శ్రీనివాస్
9985194697

మాటలు వద్దు.. ప్రాతినిధ్యం కావాలి



తెలంగాణ రాజకీయాల్లో బీసీలకు ఇచ్చిన హామీలు, వాటికి అనుగుణంగా లభిస్తున్న రాజకీయ ప్రాతినిధ్యం మరోసారి చర్చకు రావాల్సిన సమయం ఇది. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ, ఇటీవల కాంగ్రెస్ ప్రకటించిన రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలు, నవంబర్‌లో ఖాళీ కానున్న గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలు, ఖైరతాబాద్ ఉప ఎన్నిక నేపథ్యంలో బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన యువతకు రాజకీయ అవకాశాల ప్రశ్న ముందుకు వచ్చింది.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ముందు బీసీలకు 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ దిశగా చర్యలు చేపట్టినప్పటికీ, న్యాయపరమైన సవాళ్ల కారణంగా ఆ హామీ పూర్తి స్థాయిలో అమలు కాలేకపోయింది. ఆ హామీ అమలు కోసం ప్రభుత్వం అవసరమైనంత చిత్తశుద్ధితో, రాజకీయ పట్టుదలతో కృషి చేయలేదనే విమర్శ వస్తోంది. జనాభాలో పెద్ద భాగంగా ఉన్న బీసీలకు సాధారణ రాజకీయ స్థానాల్లో కూడా తగిన భాగస్వామ్యం ఉండాలి.

మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ ప్రశ్నకు రాజకీయంగా సమాధానం చెప్పాల్సినబాధ్యత కాంగ్రెస్‌పై.. ముఖ్యంగా ముఖ్యమంత్రిపై ఉంది. బీసీలకు కీలక శాఖలు అప్పగించడం ద్వారా పాలనలో నిర్ణయాత్మక భాగస్వామ్యం కల్పించవచ్చు. విద్య,నిధుల కేటాయింపు, ఆర్థిక అభివృద్ధి, రాజకీయ-సాంస్కృతిక రంగాల్లో బీసీల భాగస్వామ్యానికి సంబంధించిన ప్రశ్న. బీసీ ప్రజాప్రతినిధిత్వం అంటే బీసీ వ్యక్తి పదవిలో ఉండటం మాత్రమే కాదు. ఆ పదవిని బీసీల హక్కుల కోసం ఉపయోగించడం. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన యువతకు అవకాశాల ప్రశ్న కూడా ఇదే సందర్భంలో చూడాలి.



తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములైనవారు, ప్రజా సమస్యలపై పోరాడినవారు, కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కృషి చేసినవారు, ప్రజల్లో పనిచేస్తున్న కొత్త నాయకత్వానికి పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు, ఇతర రాజకీయ అవకాశాల్లో తగిన స్థానం కల్పించాలి. యువతకు రాజకీయాల్లో మరింత ప్రాతినిధ్యం అవసరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ప్రస్తావించారు. ఈ ఆలోచనలు ప్రకటనలకే పరిమితం కాకుండా ఆచరణలో కనిపించాలి. ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన కష్టపడే యువతకు అవకాశాలు కల్పించాలి.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ప్రారంభ దశలో నామినేటెడ్ పదవుల్లో రెడ్డి సామాజిక వర్గానికే అధిక ప్రాధాన్యం లభించిందనే విమర్శ ఉంది. తర్వాత బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, మహిళలకు అవకాశాలు కల్పించినప్పటికీ, ప్రారంభ దశలో ఏర్పడిన అసమతుల్యతపై పార్టీ స్వయం పరిశీలన చేసుకోవాలి. అధికారంలోకి రావడానికి అన్ని సామాజిక వర్గాలూ పనిచేసినప్పుడు, అధికారంలో భాగస్వామ్యం కూడా అందుకు అనుగుణంగా ఉండాలి. ప్రజాసేవ, సామాజిక ఉద్యమాలు, ప్రజాసమస్యలపై పనిచేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా నాయకత్వానికి అవకాశం కల్పించడం ద్వారా మరింత సామాజిక విలువ చేకూరుతుంది.

కాంగ్రెస్ తీసుకునే నిర్ణయమే అయినా, ఉన్న అవకాశాల్లోనే సామాజిక ప్రాతినిధ్యం కనిపించాలి. కొత్త పదవులు వచ్చినప్పుడు మాత్రమే సామాజిక న్యాయం గురించి మాట్లాడకుండా, మంత్రివర్గం, ఎమ్మెల్సీ స్థానాలు, పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు, అభ్యర్థిత్వాలు-అన్ని అవకాశాల్లోనూ అది ప్రతిఫలించాలి. బీసీలకు ఇచ్చిన రాజకీయ హామీలను ఆచరణలోకి తీసుకురావడమే ఈ డిమాండ్ల సారాంశం. ప్రస్తుత పార్టీల్లోనే సామాజిక న్యాయం కోసం మరింత బలంగా డిమాండ్ చేయాలా, లేక తమ రాజకీయ ప్రాతినిధ్యాన్ని మరింత స్వతంత్రంగా నిర్మించుకోవాలా అనే ప్రశ్న ముందుకు రావచ్చు. అవసరమైతే ప్రస్తుత పార్టీలకు భిన్నంగా స్వతంత్ర ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి గురించి కూడా ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. అందువల్ల బీసీలను, బడుగు వర్గాలను, కష్టపడే యువతను కేవలం ఓటర్లుగా చూస్తారా? లేక రాజకీయ అధికారంలో భాగస్వాములుగా గుర్తించి చేతల్లో చూపిస్తారా?

- పాపని నాగరాజు
9948872190

వ్యంగ్య చిత్రకారులలో మేటి ఆర్. కె.లక్ష్మణ్

కార్టూన్ రంగ చరిత్రలో అనేక పాత్రలు సృష్టించబడినా, ఆర్.కె.లక్ష్మణ్ సృష్టించిన సామాన్య మానవుడు (కామన్ మాన్) అనితర సాధ్యమైన ప్రాచుర్యం పొందడం విశేషం. లక్ష్మణ్ వేసిన దాదాపు అన్ని రాజకీయ వ్యంగ్య చిత్రాలలో కూడా ఆయన విశేష వూహాచిత్రమైన సామాన్య మానవుడు దర్శనమిస్తాడు. బట్టతల, కళ్ళజోడు, గళ్ళకోటుతో ఉండే వ్యక్తి ప్రధానమంత్రి కార్యాలయం నుండి, గ్రామ కార్యాలయం వరకూ అన్ని చోట్ల దర్శనమిస్తూ, అక్కడ జరుగుతున్న విచిత్ర విషయాలకు సాక్షిగా నిలుస్తూ, చక్కటి హావ భావ ప్రకటన మాత్రమే చేస్తూ, ఎన్నడూ ఒక్క మాటకూడ మాట్లాడక పోవడం గమనార్హం.

ఈ సామాన్య వ్యక్తి కార్టూన్ పాత్ర ఎంత ప్రసిద్ధి చెందిందంటే, ముంబాయిలో వర్లీ సముద్ర తీరంలో, సామాన్య వ్యక్తికి ఒక లోహవిగ్రహం ప్రతిష్ఠించారు. భారత దేశంలో ఒక కార్టూన్ పాత్రకు ఒక విగ్రహం ఉండటం ఇదొక్కచోట మాత్రమే కావడం విశేషాల్లోకి విశేషం.

ఆర్.కె.లక్ష్మణ్‌గా లబ్ధప్రతిష్ఠులైన రాశిపురం కృష్ణస్వామి అయ్యర్ లక్ష్మణ్ (అక్టోబర్ 23 1924 - జనవరి 26,2015) భారత దేశంలో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న వ్యంగ్య చిత్రకారులలో ఒకరు. ముంబాయి నుండి ప్రచురించబడే ఆంగ్ల దినపత్రిక టైమ్స్ ఆఫ్ ఇండియాలో ప్రతిరోజూ వ్యంగ్య చిత్రాలు వేస్తూ ఉండే వారు. కొన్ని దశాబ్దాలనుండి ఒకే వార్తా పత్రికలో పనిచేస్తూ, తన కార్టూన్లకు ఒక ప్రత్యేకతను సంతరించుకున్నారు. ఆయన ముఖ్యంగా రాజకీయ వ్యంగ్య చిత్రాలను వేస్తూ ఉండేవారు. లక్ష్మణ్ సృష్టించిన సామాన్య వ్యక్తి (Common Man) పాత్ర కార్టూన్ల చరిత్రలో అత్యంత పేరు తెచ్చుకున్న పాత్ర. రాజకీయ కార్టూన్లు వేసి భారత దేశంలో ఉన్న రాజకీయ నాయకులందరినీ ఆటపట్టించి, వారిమీద సద్విమర్శలు చేసి రాజకీయరంగాన్ని సరైన పంధాలో నడిపించటానికి తనవంతు కృషి చేసిన ఘనత ఆయనకే దక్కింది. లక్ష్మన్ అంటే, రాజకీయ నాయకులందరికీ గౌరవం, అంతకుమించి ఎనలేని ప్రేమ. 2003లో తీవ్రఅస్వస్థులై ఆసుపత్రి పాలైనప్పుడు, దేశంలోని హేమాహేమీలందరూ ఆయన ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు ఆదుర్దాతో తెలుసు కోవడమే కీఆకుండా,మాజీ ఉపరాష్ట్రపతి భైరవ్ సింగ్ షేకావత్ తో సహా చాలా మంది ఆసుపత్రికి వెళ్ళి పరామర్శించారు.

ఆర్కే లక్ష్మణ్ మైసూర్ నగరంలో ఒక తమిళ కుటుంబంలో జన్మించారు. తండ్రి పాఠశాల ప్రధానోపాధ్యాయులు. లక్ష్మణ్ ఆరుగురు సంతానంలో చిన్నవాడు. ఆయన అన్నలలో ఒకరైన ఆర్.కె. నారాయణ్ మాల్గుడి డేస్ కథలు రచించిన ప్రముఖ ఆంగ్ల రచయిత కావడం యాదృచ్ఛికం. చిన్నతన నుండి లక్ష్మణ్‌కు బొమ్మల పుస్తకాలు చూసే అలవాటు ఉండేది. ఆంగ్ల పత్రికలైన స్ట్రాండ్ (Strand), పంచ్ (Punch), బైస్టాండర్ (Bystander), వైడ్-వరల్డ్ (Wide World), టిట్ బిట్స్ (Tit Bits) వంటి బొమ్మల కార్టూన్ పుస్తకాలను, తాను చదవటం నేర్వకముందే చూసేవాడు. బొమ్మల పుస్తకాలు చూస్తూ, మెల్లిగా గీతలు గీస్తూ బొమ్మలు వెయ్యటం మొదలు పెట్టారు. నేల మీద, గోడల మీద, తలుపుల మీద, ఎక్కడ పడితే అక్కడ రకరకాల బొమ్మలు వేసేవారు. తన ఉపాధ్యాయులనూ వదలక వాటి చిత్రాలుకూడ వేసారు. తాను వేసిన బోధి వృక్షం ఆకు బొమ్మను టీచర్లు కూడా మెచ్చుకున్నప్పుడు తానొక చిత్రకారుడిగా తయారయ్యే అవకాశం ఉన్నదని భావించారు.



ఉన్నత పాఠశాల తరువాత, లక్ష్మణ్ బొంబాయి (ఇప్పటి ముంబాయి) లోని జె.జెఇన్స్‌ట్యూట్ ఆఫ్ అప్లైడ్ ఆర్ట్స్‌లో చేరి బొమ్మలు వేయటం నేరుకోవటానికి, తన దరఖాస్తు చేశారు. కానీ, ఆ పాఠశాల ప్రధానాధికారి, అటువంటి బొమ్మలు వేసేవాడు తమ స్కూలులో విద్యార్థిగా ఉండ తగడు అని చేర్చుకోలేదని చెపుతారు.

అయితే లక్ష్మణ్ ఆ తర్వాత అదే పాఠశాల... ఏ పాఠశాలలో బొమ్మలు వేయటం నేర్చుకోవటానికి ప్రవేశం లభించలేదో, దాని పక్కనే ఉన్న ప్రముఖ ఆంగ్ల దినపత్రికలో కొన్ని దశాబ్దాల పాటు వారి కార్టూనిస్టుగా ఉండి ప్రపంచ వ్యాప్తంగా పేరు తెచ్చుకోవటం ఆయన అకుంఠిత దీక్షకు నిదర్శనం. చివరకు మైసూర్ విశ్వవిద్యాలయం నుండి బి.ఎ. చదివి పట్ట భద్రుడయి, చదువు కొన సాగిస్తూనే బొమ్మలు వేస్తూ, ప్రీలాన్స్ (స్వతంత్ర) చిత్రకారునిగా కొనసాగారు. ఆ కాలంలోనే 'స్వరాజ్య' అన్న పత్రికలో కార్టూన్లు వేశారు. అలాగే, నారద అనే కార్టూన్ సినిమాకు కూడా బొమ్మలు వేశారు.

అక్టోబర్ 23...ఆర్. కె.లక్ష్మణ్ జయంతి

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

చదువులో ముందడుగు.. అంతటా వెనుకడుగే!



ఒక అమ్మాయి అబ్బాయితో సమానంగా చదువుతోంది. పరీక్షల్లో ప్రతిభ చూపుతోంది. ఉన్నత విద్యను అభ్యసిస్తోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటోంది. అయినా ఉద్యోగం కోసం వెతికేటప్పుడు అవకాశాల కొరత, వేతనాల్లో వివక్ష, కుటుంబ బాధ్యతల భారం ఎదుర్కొంటోంది. ప్రతిభ ఉన్నా నాయకత్వ స్థానాలకు చేరడం కష్టమవుతోంది. రాజకీయాల్లోకి రావాలంటే ఆర్థిక వనరులు, సామాజిక మద్దతు, భద్రత వంటి సవాళ్లను అధిగమించాల్సి వస్తోంది. ఇదే భారతదేశంలో లింగ సమానత్వం ఎదుర్కొంటున్న అసలు వైరుధ్యం.

ప్రపంచ ఆర్థిక వేదిక విడుదల చేసిన ప్రపంచ లింగ అంతరాల సూచీ-2026లో 145 దేశాల్లో భారత్ 131వ స్థానంలో నిలవడం ఈ పరిస్థితికి అద్దం పడుతోంది. దేశ స్కోరు 64.5 శాతంగా నమోదైంది. 2006 నుంచి ఇరవయ్యేళ్లలో కేవలం 4.3 శాతం పాయింట్ల పురోగతి మాత్రమే కనిపించింది. మహిళలకు విద్య అందించడం మొదటి మెట్టు మాత్రమే. ఆ విద్యను ఆర్థిక స్వాతంత్ర్యంగా, సమాన వేతనంగా, నిర్ణయాధికారంగా మార్చినప్పుడే నిజమైన సమానత్వం సాధ్యమవుతుంది.

ఈ సూచీ ఆర్థిక భాగస్వామ్యం, విద్యా సాధన, ఆరోగ్యం-మనుగడ, రాజకీయ సాధికారత అనే నాలుగు రంగాల్లో మహిళలు, పురుషుల మధ్య అంతరాన్ని కొలుస్తుంది. వంద శాతం స్కోరు అంటే సూచీలో కొలిచిన అంశాల్లో సమానత్వం సాధించినట్లు. ఇది మహిళల మొత్తం అభివృద్ధికి సంబంధించిన శాతం కాదు.

భారత్ విద్యలో 96.6 శాతం, ఆరోగ్యంలో 95.6 శాతం స్కోర్లు సాధించగా, ఆర్థిక భాగస్వామ్యంలో 41.2 శాతం, రాజకీయ సాధికారతలో 24.5 శాతం మాత్రమే నమోదయ్యాయి. ఈ గణాంకాలు విద్య, ఆరోగ్య రంగాల్లో పురోగతి ఉన్నప్పటికీ, ఉపాధి, నాయకత్వం, నిర్ణయాధికారంలో అంతరం ఎంత తీవ్రంగా ఉందో స్పష్టం చేస్తున్నాయి. వయోజన అక్షరాస్యతలో సమానత్వ స్కోరు 82.5 శాతంగా ఉంది. గత ఏడాదితో పోలిస్తే ఇది 2.7 శాతం పాయింట్లు తగ్గినా,2006లోని 65.2 శాతంతో పోలిస్తే దీర్ఘ కాలిక పురోగతి నమోదైంది. అయితే విద్యలో ప్రవేశం పొందడం, చదువు పూర్తి చేయడం, అర్హతకు తగిన ఉద్యోగం పొందడం వేర్వేరు దశలు. సురక్షిత ప్రయాణం లేకపోవడం, నైపుణ్య శిక్షణ కొరత, పిల్లల సంరక్షణ బాధ్యతలు, వివాహం లేదా ప్రసవం తర్వాత ఉద్యోగం కొనసాగించేందుకు అనుకూల పరిస్థితులు లేకపోవడం మహిళల ఉపాధిని ప్రభావితం చేయవచ్చు.

విద్యతోపాటు నైపుణ్యాభివృద్ధి, సురక్షిత రవాణా, పిల్లల సంరక్షణ కేంద్రాలు, సమాన వేతనం, కార్యాలయాల్లో వేధింపుల నిరోధం, ప్రసూతి అనంతరం ఉద్యోగంలో కొనసాగేందుకు అనుకూల విధానాలు అవసరం. విద్యను



స్వతంత్ర జీవితానికి పునాదిగా మార్చే బాధ్యత ప్రభుత్వానిదే.

ఆర్థిక భాగస్వామ్య స్కోరు 41.2 శాతంగా ఉంది. 2025తో పోలిస్తే 0.5 శాతం పాయింట్లు పెరిగినా, 2013లో నమోదైన 44.6 శాతం గరిష్ఠస్థాయి కంటే తక్కువే. వృత్తి పరమైన, సాంకేతిక ఉద్యోగాల్లో సమానత్వ స్కోరు 2006లోని 26.6శాతం నుంచి 2026లో 49.9 శాతానికి పెరగడం సానుకూల పరిణామం. కానీ ఉన్నతాధికారులు, నిర్వాహకులు, శాసనసభ్యుల స్థానాల్లో స్కోరు కేవలం 13.1 శాతం మాత్రమే.

కార్మిక శక్తి భాగస్వామ్య సమానత్వ స్కోరు 44.1 శాతం. ఇది మహిళల్లో 44.1 శాతం మంది ఉద్యోగాలు చేస్తున్నారని అర్థం కాదు. ప్రపంచ బ్యాంకు గణాంకాల ప్రకారం, 2025లో భారత్‌లో మహిళల కార్మిక శక్తి భాగస్వామ్య రేటు 32.4 శాతం కాగా, పురుషుల్లో 77.6 శాతంగా ఉంది. మహిళల ఆర్థిక స్వాతంత్ర్యం పెరగాలంటే ఉద్యోగాల సంఖ్యతోపాటు న్యాయమైన వేతనం, ఉద్యోగ భద్రత, పదోన్నతులు, ఆస్తి హక్కులు, రుణ సదుపాయాలు, స్వయం ఉపాధికి మార్కెట్ అవకాశాలు కల్పించాలి. గృహబాధ్యతల్లో పురుషులూ సమానంగా భాగస్వాములు కావాలి.

ఆరోగ్య, మనుగడ విభాగంలో భారత్ 95.6 శాతం స్కోరు సాధించినప్పటికీ, పుట్టుక సమయంలో లింగ నిష్పత్తికి సంబంధించిన అంతరం పూర్తిగా తొలగిపోలేదు. బాలికలకు పోషకాహారం, టీకాలు, రక్తహీనత నివారణ, యుక్తవయసు ఆరోగ్యఅవగాహన, పునరుత్పత్తి ఆరోగ్య సేవలు, గర్భిణులకు వైద్యం, ప్రసవానంతర సంరక్షణ అందాలి. గ్రామీణ, గిరిజన, పేద కుటుంబాల మహిళలకు వైద్య సేవలు చేరువ చేయాలి.

రాజకీయ సాధికారతలో భారత్ 24.5 శాతం స్కోరుతో 67వ స్థానంలో నిలిచింది. పార్లమెంటులో ప్రాతినిధ్యానికి సంబంధించిన సమానత్వ స్కోరు 16.1 శాతం కాగా, మంత్రివర్గ ప్రాతినిధ్య స్కోరు కేవలం 5.9 శాతం. 2019లో మంత్రివర్గ సూచిక 30 శాతం గరిష్ఠ స్థాయికి చేరినా, ఆ తర్వాత తగ్గింది.

ప్రపంచవ్యాప్తంగా లింగ అంతరంలో ఐస్లాండ్ 93 శాతం స్కోరుతో మొదటి స్థానంలో, ఫిన్లాండ్ 87.2 శాతంతో రెండో స్థానంలో, నార్వే 85.7 శాతంతో మూడో స్థానంలో నిలిచాయి. ప్రస్తుత వేగంతోనే ప్రపంచం ముందుకు సాగితే సంపూర్ణ లింగ సమానత్వానికి ఇంకా 120 సంవత్సరాలు పట్టవచ్చని నివేదిక అంచనా వేస్తోంది. భారత్ 131వ స్థానం ఒక ర్యాంకు మాత్రమే కాదు. మహిళల అవకాశాలపై దేశం తనను తాను ప్రశ్నించు కోవాల్సిన హెచ్చరిక. చదువులో ముందున్న బాలిక ఉద్యోగంలో వెనుకబడకూడదు. శ్రమించే మహిళకు తగిన వేతనం దక్కాలి. రైతు మహిళకు భూమిపై హక్కు, రుణం, మార్కెట్ అవకాశాలు కలగాలి. ప్రతిభావంతురాలైన మహిళ రాజకీయాల్లోకి రావాలంటే అవకాశాలు పెరగాలి. మహిళలకు విద్య ఇచ్చి అవకాశాలు ఇవ్వకపోతే అభివృద్ధి అసంపూర్ణం. దేశం నిజంగా అభివృద్ధి చెందిందో లేదో తెలుసుకోవాలంటే మహిళలు ఎంత చదివారన్నదే కాదు.. ఎంత స్వతంత్రంగా జీవిస్తున్నారు, ఎంత సంపాదిస్తున్నారు, ఎంత నిర్ణయాధికారం కలిగి ఉన్నారు, ఎంత గౌరవంగా బతుకుతున్నారు అన్నదీ కొలవాలి. ప్రతిభకు అడ్డంకులు తొలగి, వారి శ్రమకు విలువ పెరిగి, వారి స్వరానికి అధికారంలో స్థానం దక్కినప్పుడే లింగ సమానత్వం నినాదం నుంచి వాస్తవంగా మారుతుంది.

- కాలగిరి శ్రీనివాసరెడ్డి
9010128884

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ చేపట్టాలి



- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల, అక్టోబర్ 22:(మనం ప్రతినిధి): ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వచ్చే ఎనిమిది నెలల నీటి అవసరాలకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు.

గురువారం జగిత్యాల జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, దైవ కృపతో జగిత్యాల జిల్లాలో తక్కువ నష్టాలతో 2026 ఖరీఫ్ సీజన్ను పూర్తి చేసుకునే పరిస్థితి ఉందని, ఇతర జిల్లాలతో పోలిస్తే మన జిల్లాలో వర్షపాతం లోటు కూడా తక్కువగా ఉందని మంత్రి పేర్కొన్నారు. అయితే రానున్న ఎనిమిది నెలల్లో వర్షం పడకపోవచ్చనే పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్ఆర్ఎస్పీ), చెరువులు, ఇతర నీటి వనరుల్లో అందుబాటులో ఉన్న నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాల కోసం కాపాడుకోవాలని స్పష్టం చేశారు.

దక్షిణ తెలంగాణలోని నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ వంటి జిల్లాల్లో పరిస్థితులు మరింత సమస్యాత్మకంగా ఉన్నాయని, జగిత్యాల జిల్లాలోనూ నీటి వినియోగంపై ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుత ఖరీఫ్ పంటలను సాధ్యమైనంత వరకు కాపాడేందుకు మండల స్థాయి అధికారులు, వ్యవసాయ అధికారులు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. అవసరమైతే పొరుగు రైతుల బోర్ల నుంచి నీటిని అందించే అవకాశాలను పరిశీలించి, రైతుల మధ్య సమన్వయం కల్పించాలని తెలిపారు.

రైతుల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరిగేలా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని, రైతులు ఎదుర్కొనే సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని అన్నారు.

యాసంగి పంటల ప్రణాళికను ప్రస్తుత నీటి లభ్యతకు అనుగుణంగా పూర్తిగా సమీక్షించాలని మంత్రి ఆదేశించారు. ఎస్ఆర్ఎస్పీ నుంచి యాసంగి పంటలకు నీరు విడుదల చేసే అవకాశం లేదని స్పష్టం చేస్తూ, బోరు నీరు అందుబాటులో ఉన్నా వరి సాగుకు వెళ్లవద్దని రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నీటి కొరత ఏర్పడితే పంటలను చివరి వరకు కాపాడటం కష్టమవుతుందని, అందువల్ల తక్కువ నీటితో, తక్కువ కాలంలో చేతికొచ్చే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకునేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు.

ప్రతి మండలంలో అధికారులు రైతులతో సమావేశాలు నిర్వహించి, గ్రామాల వారీగా యాసంగి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని మంత్రి తెలిపారు. తాగునీరు, పశువుల నీటి అవసరాలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, రాబోయే రోజుల్లో పెరిగే డిమాండ్కు అనుగుణంగా నీటి వనరులు, నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితిని మండలాల వారీగా అంచనా వేసి ప్రణాళికలను సవరించాలని ఆదేశించారు.

స్ప్రింక్లర్ల కోసం రైతుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు వివరాలతో నివేదిక సమర్పించాలని, ఈ అంశాన్ని ప్రభుత్వంతో పాటు సంబంధిత మంత్రితో చర్చించి అవసరమైన చర్యలు తీసుకునేలా చూస్తామని తెలిపారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను కాపాడేందుకు అవసరమైన చోట నీటి సరఫరాపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఆఖేపల్లి ఆయకట్టు రైతుల ప్రస్తుత పంటలను రక్షించేందుకు ఒకసారి నీటిని విడుదల చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ ఎస్.వాణి, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ నారాయణ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, (ఎంఆర్ఓలు), వ్యవసాయ అధికారులు (ఏఓలు), ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్.
- కథలాపూర్ పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



జగిత్యాల అక్టోబర్ 22 (మనం ప్రతినిధి): జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించే క్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఈరోజు కథలపూర్ పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు వివరాలు, బీట్ వ్యవస్థ అమలు, రౌడీషీటర్లు మరియు నేరస్తులపై నిఘా అంశాలను సమీక్షించారు.అలాగే స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఎస్పీ ప్రత్యేకంగా ఆరా తీశారు.

ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ..... ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని అన్నారు. ప్రజలకు భద్రతాభావం కల్పించడంలో విజిబుల్ పోలీసింగ్ కీలక పాత్ర పోషిస్తుందని కావున సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాల పూర్తి సమాచారం సిబ్బంది అందరి దగ్గర ఉండాలని, గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగినా పై అధికారులకు తక్షణమే తెలియజేయాలని సూచించారు.రాత్రి వేళల్లో పెట్రోలింగ్ను మరింత ముమ్మరం చేసి చోరీలు, గంజాయి అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన నిఘా కొనసాగించాలని సూచించారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు గ్రామాలు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఆన్లైన్ మోసాలు, ఓటీపీ, కేవైసీ, ఫేక్ ఇన్వెస్ట్మెంట్ యాప్లు, డిజిటల్ అరెస్ట్ వంటి మోసాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, హెల్మెట్, సీట్బెల్ట్ వినియోగంపై ప్రత్యేక డ్రైవ్ను నిర్వహించాలని, ప్రమాదకర డ్రైవింగ్, మైనర్ల వాహనాల వినియోగం, మోడిఫైడ్ సైలెన్సర్ల పై చట్టపరమైన చర్యలు కొనసాగించాలని తెలిపారు. ఎస్పి వెంట ఎస్.ఐ రవి కిరణ్ మరియు సిబ్బంది ఉన్నారు.

ప్రజల గుండెల్లో చెరగని స్థానం పండుగ సాయన్న



జగిత్యాల అక్టోబర్ 22 (మనం ప్రతినిధి): పండుగ సాయన్నముదిరాజ్ జయంతిని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ పండుగ సాయన్నముదిరాజ్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పెత్తందారుల అన్యాయాలకు ఎదురొడ్డి నిలిచిన ధైర్యశాలి అణగారిన ప్రజల కన్నీళ్లు తుడుస్తూ, ఆకలితో అలమటించే పేదలకు అండగా నిలిచి, ప్రజల గుండెల్లో చెరగని స్థానం సంపాదించుకున్న ప్రజావీరుడని,అధికారం, ఆధిపత్యం కొందరి చేతుల్లోనే ఉన్న కాలంలో, అన్యాయాన్ని ప్రశ్నించి, పేదల పక్షాన నిలబడటమే నిజమైన ధైర్యమని తన పోరాటాల ద్వారా చాటిచెప్పిన సాయన్న గారి జీవితం తరతరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆత్మగౌరవం కోసం, సమానత్వం కోసం, ఆకలిలేని సమాజం కోసం సాగిన పోరాటానికి ప్రతీక పండుగ సాయన్న అన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి చేతన్ నితిన్ ఆర్.ఐ. వేణు, సైదులు తో పాటు సిబ్బంది పాల్గొని పండుగ సాయన్న కు ఘనంగా నివాళులు అర్పించారు.

జగిత్యాల నియోజకవర్గానికి ప్రతిష్టాత్మక యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

- 25 ఎకరాల్లో నిర్మాణం.. 25న మంత్రుల చేతుల మీదుగా శంకుస్థాపన


జగిత్యాల అక్టోబర్ 22(మనం న్యూస్): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్లో భాగంగా జగిత్యాల నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ను తాటిపల్లి-మొరపల్లి శివారులోని 25 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్నారు. ఈ నెల 25వ తేదీ ఆదివారం రోజున తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ల చేతుల మీదుగా పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో, జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ మండల, స్థానిక నాయకులతో కలిసి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ స్థలాన్ని, శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించే సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తూ యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ను ఏర్పాటు చేస్తోందన్నారు. జగిత్యాల నియోజకవర్గానికి ప్రతిష్టాత్మకమైన ఈ పాఠశాల మంజూరు కావడం సంతోషకరమని, 25 ఎకరాల్లో అత్యాధునిక వసతులతో పాఠశాల ఏర్పాటుతో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను పరిశీలించి, సంబంధిత అధికారులు, స్థానిక నాయకులతో సమన్వయం చేసుకుని అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.

జగిత్యాల జిల్లా నియోజకవర్గ విద్యార్థుల భవిష్యత్తుకు ఈ యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఒక గొప్ప వరంగా నిలుస్తుందని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ఈ



కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు నందయ్య, ఏఎంసి చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి పిఏసిఎస్ చైర్మెన్ కొలుగూరి దామోదర్ రావు టి పి సి సి సెక్రటరీ బండ శంకర్ మాజీ జడ్పీటీసీ పెండెం రాములు,సర్పంచులు కట్ట రాజేందర్ గంగారెడ్డి ఆనంద్ రెడ్డి , ఎమ్మార్వో హకీం, మండల పార్టీ అధ్యక్షుడు బాల ముకుందం,మాజీ ఏఎంసి చైర్మెన్ నక్కల రవీందర్ రెడ్డి,సీనియర్ నాయకులు సమీండ్ల శ్రీనివాస్ , ఏఎంసి వైస్ చైర్మన్ అబ్బూరి మల్లేశం,అసెంబ్లీ యూత్ అధ్యక్షులు భూమా రెడ్డి,కౌన్సిలర్ లు తిరుమలయ్య ,కమల్, ఏఎంసి డైరెక్టర్ గడ్డం గంగారెడ్డి, పిఏసిఎస్ డైరెక్టర్ నీరటి గంగారెడ్డి , శ్రీనివాస్ ,నలువలసురేష్ తిరుపతి, దాసరి సతీష్, నరేష్ ,మాజీ సర్పంచ్ గంగారం ,సదానందం,టిల్లు, ప్రవీణ్ రావు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ రైతులకు దసరా కానుక



- ఎస్ఆర్ఎస్పీ ఇందిరమ్మ వరద కాలువకు రూ.251.951 కోట్లు మంజూరు
- సిసి లైనింగ్ టెండర్లకు అనుమతిపై చిగురుమామిడిలో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు
- మంత్రి పొన్నంకు కృతజ్ఞతలు

చిగురుమామిడి, అక్టోబర్ 22 (మనం న్యూస్): హుస్నాబాద్ నియోజకవర్గ రైతాంగానికి దసరా కానుకగా ఎస్ఆర్ఎస్పీ ఇందిరమ్మ వరద కాలువ పనుల కోసం రూ.251.951 కోట్లు మంజూరు కావడం పట్ల రైతులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో ఈ నిధులు విడుదల కావడం పట్ల గురువారం చిగురుమామిడి మండల కేంద్రంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొని బాణసంచా కాల్చి, ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్ లు మాట్లాడుతూ... హుస్నాబాద్ నియోజకవర్గ రైతుల చిరకాల స్వప్నమైన ఇందిరమ్మ వరద కాలువకు మహర్దశ పట్టిందని, ఇది రైతాంగానికి నిజమైన దసరా పండుగ కానుక అని ఆనందం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ వరద కాలువ ప్యాకేజీ-3 పనుల కోసం రూ.211.172 కోట్లతో పరిపాలనా ఆమోదం లభించడం, అలాగే మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ, నిరంతర కృషి ఫలితంగా ప్రధాన కాలువల్లో సిసి లైనింగ్ మరియు అదనపు నిర్మాణాల పనుల కోసం మరో రూ.40.771 కోట్లతో టెండర్లకు అనుమతి రావడం హుస్నాబాద్ నియోజకవర్గ వ్యవసాయ రంగానికి ఒక కీలక ముందడుగు, చారిత్రాత్మక ఘట్టం అని కొనియాడారు.

గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన వరద కాలువ పనులకు మా మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో ఇంత భారీ నిధులు రావడం పట్ల రైతులంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారని, ఈ నిధుల మంజూరుతో కాలువ చివరి ఆయకట్టు వరకు ఉన్న ప్రతి ఎకరాకు సకాలంలో సాగునీరు అంది, రైతుల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తుందని, దీనికి కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ కు నియోజకవర్గ రైతుల తరఫున, కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో, సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్, సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు మర్మా రాజ్ కుమార్ గౌడ్, డీసీసీ కార్యదర్శులు బడుకొలు దేవేందర్ రెడ్డి, సొంబారి బాబు, సర్పంచ్ లు ఆకవరం భవాని శివప్రసాద్, అలువాల శంకర్, గూళ్ల రజిత రాజు, గోగురి లక్ష్మీ మురారి రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్లు పోటు మల్లారెడ్డి, శ్రీరామోజు రాజకుమార్, ఉపసర్పంచ్ ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు పూల లచ్చిరెడ్డి, సిరవేణి సంపత్, కాత తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి భరోసా

40వ వార్డు లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే



జగిత్యాల అక్టోబర్ 22(మనం ప్రతినిధి): ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని మోతే రోడ్డు వద్ద గల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.52,04,450 విలువైన చెక్కులను 111 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగిత్యాల పట్టణంలోని 40వ వార్డుకు చెందిన సభ్యులు ఊరడి సత్యనారాయణ, అనుగంటి చంద్రయ్యలకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అందజేశారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్సల కోసం అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తున్న పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. వైద్య ఖర్చుల కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ సహాయం కొంత ఉపశమనం కలిగిస్తుందని తెలిపారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సహాయ పథకాలు అందడం ద్వారా వారికి ఆర్థిక భరోసా లభిస్తుందని, అవసరమైన సమయంలో అండే సహాయం బాధిత కుటుంబాలకు ఎంతో తోడ్పాటునిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు సీఎం సహాయనిధి అండ



- 111 మంది లబ్ధిదారులకు రూ.52.04 లక్షల చెక్కుల పంపిణీ

జగిత్యాల అక్టోబర్ 22(మనం న్యూస్): జగిత్యాల పట్టణంలోని మోతే రోడ్డు జిల్లా పార్టీ కార్యాలయంలో జగిత్యాల పట్టణానికి చెందిన 111 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.52,04,450 విలువైన చెక్కులను జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందని అన్నారు. చికిత్స ఖర్చుల భారంతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తూ భరోసా కల్పిస్తోందని తెలిపారు. జగిత్యాల నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం సహాయనిధి ద్వారా సహాయం అందేలా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజంగి నందయ్య మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ ఏఎంసి చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి పాక్స్ చైర్మెన్ దామోదర్ రావు మాజీ మున్సిపల్ చైర్మన్ అడువల జ్యోతి లక్ష్మణ్ టి పి సి సి సెక్రటరీ బండ శంకర్ గట్టు సతీష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కౌన్సిలర్ లు,కో ఆప్షన్ సభ్యులు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రెండవ రోజు 44 నామినేషన్‌లు దాఖలు



కాట్రేనికోన అక్టోబర్ 22 మనం ప్రతినిధి : స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా కాట్రేనికోన మండల పరిషత్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి జి మమ్మీ, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు బి రాజేశ్వర్ రావు, వి రవి కిరణ్ లు ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు.రెండవ రోజు మొత్తం 44 నామినేషన్లు వచ్చినట్లు ఆర్. ఓ తెలిపారు. ఇందులో టీడీపీ 17, వైసీపీ 21, జనసేన 4, బి ఎస్పీ1 ఇండిపెండెంట్ 1 ఉన్నాయి. కాట్రేనికోన,2, 3 ఎంపీటీసీ స్థానాలకు ,మాజీ సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, చెయ్యేరు 1 కి మాజీ సర్పంచ్ చెల్లి సురేష్, చెయ్యేరు 2 నడింపల్లి సందీప్ వర్మ, పల్లం 1 దండుప్రోలు బాలయోగి, బంటుమిల్లి - ఉప్పూడి నల్లా రాంబాబు తదితరులు నామినేషన్ వేశారు. వర్షం కారణంగా నామినేషన్ లు వేయడానికి ఇబ్బందులు పడ్డారు నామినేషన్ కేంద్రాల వద్ద సి సి కెమెరా లు ఏర్పాటు చేశారు విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ ఐ వి దుర్గా శ్రీనివాస్, అదనపు ఎస్ఐ వి సత్యనారాయణ పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నారు . మూడవ రోజు అధిక సంఖ్యలో నామినేషన్ దాఖలు అయ్యే అవకాశం ఉంది . ఈ కార్యక్రమం లో వైసీపీ, టీడీపీ జనసేన , బి ఎస్పీ తదితర నాయకులు పాల్గొన్నారు.

పాలకొల్లులో వైసీపీకి మరో షాక్

- మాజీ ఎంపీపీ కనకలక్ష్మి, మాజీ ఎంపీటీసీ ఏడుకొండలు టీడీపీలో చేరిక

పాలకొల్లు, అక్టోబర్ 22,మనం ప్రతినిధి: నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. రెండు రోజుల క్రితం చింతపర్రు గ్రామంలో 50కిపైగా కుటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరగా.. తాజాగా పాలకొల్లు మండల మాజీ ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి, మాజీ ఎంపీటీసీ చిట్టూరి ఏడుకొండలుతో పాటు పలువురు నాయకులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. పాలకొల్లులోని మంత్రి కార్యాలయం వద్ద గురువారం మంత్రి నిమ్మల రామానాయుడు సమక్షంలో వారు పసుపు కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా కనకలక్ష్మి, ఏడుకొండల దంపతులను పార్టీ కండువాలు కప్పి మంత్రి సత్కరించారు.

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, మంత్రి నిమ్మల రామానాయుడు పనితీరుకు ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు ఏడుకొండలు తెలిపారు. వైసీపీలో సుమారు 16 ఏళ్లపాటు కష్టపడి పనిచేసినా తగిన గుర్తింపు లభించలేదని, ఆక్వా వ్యాపారాన్ని సైతం వదులుకొని ఆర్థికంగా నష్టపోయానని పేర్కొన్నారు.



కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలు, పాలకొల్లు అభివృద్ధికి మంత్రి చేస్తున్న కృషిని గుర్తించి టీడీపీలో చేరినట్లు వెల్లడించారు. పార్టీ సీనియర్ నాయకులు, కూటమి శ్రేణులను కలుపుకొని పనిచేస్తానన్నారు.

ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. వైసీపీలో సుదీర్ఘకాలం పనిచేసిన ఏడుకొండలు, కనకలక్ష్మి దంపతులు టీడీపీలో చేరడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పాలకొల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు గత రెండున్నరేళ్లలో కోట్లాది రూపాయల నిధులు తీసుకొచ్చినట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని నిధులు సాధించి గ్రామాలు, పట్టణ వార్డుల్లో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపడతామన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల రుణం తీర్చుకునేలా అహర్నిశలు పనిచేస్తున్నానని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న పాలనను చూసి వైసీపీ నాయకులు టీడీపీలో చేరడం శుభపరిణామమన్నారు.

మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ మాట్లాడుతూ.. వైసీపీలో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు లభించకపోగా, పార్టీ కారణంగా ఆర్థికంగా నష్టపోయిన ఏడుకొండలు దంపతులు టీడీపీలో చేరడం సమంజసమన్నారు. కనకలక్ష్మి మాట్లాడుతూ తాను ఎవరినీ విమర్శించదలచుకోలేదని, వైసీపీలో తగిన గౌరవం లభించకపోవడంతో పాటు ఎంతో నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో పాలకొల్లు టీడీపీ అధ్యక్షుడు పాముల రజనీకుమార్, నాయకులు మేడిది డేవిడ్ జ్ఞానాజు, పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, మామిడిశెట్టి పెద్దిరాజు, కడల్ గోపాలరావు, ఆరుమిల్లి చిన్ని, బోనం నాని, పొట్నూరి శ్రీనివాస్, బిరుదుకోట శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా పోరాట యోధుల చరిత్రకు గుర్తింపు ఇవ్వడం అభినందనీయం

కాంగ్రెస్ నేత నీలం మధు


పండుగ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు

సీఎంకు అమ్మవారి విగ్రహం బహూకరించిన నీలం

పటాన్ చెరు, అక్టోబర్ 22 (మనం న్యూస్) : తెలంగాణ ప్రజల కోసం పోరాడిన పండుగ సాయన్న జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ఆయన చరిత్రకు దక్కిన గొప్ప గౌరవమని ప్రజా పోరాట యోధుల జీవితాలను గుర్తించి, వారి స్ఫూర్తిని భావితరాలకు అందించడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ అభినందనీయమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి పర్యవేక్షణలో అధికారికంగా నిర్వహించిన 174 వ పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై పాల్గొని సాయన్న చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించడం పట్ల నీలం హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాబిన్‌హుడ్గా ప్రజల హృదయాల్లో నిలిచిన పండుగ సాయన్నకు అధికారికంగా గుర్తింపు కల్పించిన ముఖ్యమంత్రికి నీలం మధు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముదిరాజ్ సంఘం నాయకులు, ముదిరాజులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ దుర్గాదేవి నవరాత్రి పవిత్రోత్సవాలు

హైదరాబాద్, అక్టోబర్ 22(మనంన్యూస్): పటాన్ చెరులోని శ్రీ దుర్గా దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గత 11 రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవోపేతంగా నిర్వహించిన పవిత్రోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ ఉత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన 4వ వార్షికోత్సవ సంబరాలు భక్తుల కోలాహలం, ఆధ్యాత్మిక వాతావరణం నడుమ కనులపండువగా సాగాయి. ఈ వార్షికోత్సవ వేడుకలను గోకుల్ నవదుర్గ అసోసియేషన్ అధ్యక్షుడు కె. మోహన్ యాదవ్ తన ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించారు. దుర్గామాత ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలంతా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో విలసిల్లాలని కాంక్షిస్తూ ఈ ఉత్సవాలను విజయవంతం చేశారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టంగా, అమ్మవారి సేవలో ఆధ్యాత్మిక జీవితాన్ని గడుపుతు 50 మంది ప్రముఖ శ్రీ దేవి ఉపాసకులను అసోసియేషన్ ప్రత్యేకంగా సత్కరించింది. మోహన్ యాదవ్ గారి నేతృత్వంలో ఈ ఉపాసకులకు అమ్మవారి పవిత్ర ఆధ్యాత్మిక చిహ్నాలతో ప్రత్యేకంగా రూపొందించిన అద్భుతమైన జ్ఞాపికలను, గౌరవప్రదమైన అవార్డులను అందజేసి ఘనంగా సన్మానించారు. ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న పర్యావరణ విపత్తులపై ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కె. మోహన్ యాదవ్ ప్రత్యేకంగా మాట్లాడుతూ..ప్రస్తుత ప్రకృతి విపత్తులు, పర్యావరణ మార్పులపై తీవ్ర



ఆందోళన వ్యక్తం చేశారు. 'ఎల్ నినో ప్రభావంతో సాధారణం కంటే చాలా ముందస్తుగానే ఉష్ణోగ్రతలు పెరిగిపోతాయి. వేసవి కాలంలోనే కాకుండా మిగిలిన రోజుల్లోనూ తీవ్రమైన ఎండలు, ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. భారతదేశానికే కాకుండా ప్రపంచానికి జీవనాధారమైన నైరుతి రుతుపవనాలు ఎల్ నినో వల్ల బలహీనపడ్డాయి. ఈ పరిస్థితుల వల్ల, వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోతాయి. చెరువులు, జలాశయాలలో నీటి నిల్వలు తగ్గి తీవ్ర తాగునీటి మరియు సాగునీటి ఎద్దడి ఏర్పడుతుంది. సరైన సమయానికి వర్షాలు పడక పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతారు. ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గి నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. కావున, ఇలాంటి విపత్తు కష్టకాలం నుండి మమ్ములను, యావత్ ప్రపంచాన్ని రక్షించాలని ఆ లోకమాత శ్రీ దుర్గా దేవి మాతను భక్తిశ్రద్ధలతో వేడుకున్నాము.'

సమాజంలో ఆధ్యాత్మిక భావనను పెంపొందించడంలోనూ, అమ్మవారి పూజా విధానాలను నిరంతరం కొనసాగించడంలోనూ దేవి ఉపాసకుల పాత్ర ఎంతో కీలకమైనదని కొనియాడారు. వారి భక్తి తత్పరతను గుర్తించి, ఇలా అవార్డులతో సత్కరించుకోవడం తమ అసోసియేషన్ పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. 11 రోజుల పాటు జరిగిన ఈ పవిత్రోత్సవాల్లో స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించి పునీతులయ్యారు. దుర్గామాత నిమజ్జన శోభాయాత్రలో ముఖ్య అతిథులుగా బిఆర్ఎస్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి పాలుగొన్నారు, భవాని మాత ఉపాసకులు దీక్ష పరిపూర్ణంగ ముగియడంతో మెదక్ ఏడుపాలయ్యా శ్రీ దుర్గ మాత దర్శించుకున్నారు. ఈ శోభాయాత్రలో వేడుకల్లో గోకుల్ నవదుర్గ అసోసియేషన్ కమిటీ సభ్యులు, శ్రీ భవాని మాత ఉపాసకులు (మాత భక్తులు) - మోహన్ యాదవ్ , శ్రీకాంత్ యాదవ్ , కిరణ్ ముధిరాజ్ , బ్రహ్మం చారి , నాని , రాజు, చిట్ల కుందన్ ముదిరాజ్ (బిజెపి, గౌతమ్ నగర్ ఎఎఇ డివిజన్ బూత్ అధ్యక్షులు) మరియు ఈ కార్యక్రమంలో గోకుల్ నగర్ వాసులు ట్రస్ట్ సభ్యులు, మహిళలు, భక్తులు, స్థానిక ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమన్ని దిగ్విజయం చేశారు. ఆలయ పరిసరాలన్నీ భక్తిగీతాల ఆలపనతో, దుర్గామాత నామస్మరణతో మారుమోగాయి.

టీఆర్ఎస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా బానోత్ వెంకన్న నాయక్



హైదరాబాద్, అక్టోబర్ 22(మనం న్యూస్): తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత వివిధ కమిటీలను ప్రకటిస్తూ మీడియా కమిటీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీగా భానోత్ వెంకన్న నాయకులు నియమించారు. బొల్లెపల్లి వాస్తవ్యులు గూడూరు మండలం మహబూబాబాద్ జిల్లాకు చెందిన బానోత్ వెంకన్న నాయక్ 15 సంవత్సరాలుగా వివిధ మీడియాలో పనిచేసిన ఆయన తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆవిర్భవించినాటి నుండి పనిచేస్తూ తనకిచ్చిన బాధ్యతను నెరవేరుస్తూ, గతంలో జూబ్లీహిల్స్ జెండా పండుగ అబ్జర్వ్ గా నియమించిన కవితక్క పార్టీకి మరియు ప్రజలకి అనుసంధానంగా ఉండే మీడియా వ్యవస్థలో తనను గుర్తించి ఈ అవకాశం ఇచ్చిన కవితకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ, సహకరించిన రూప్సింగ్ నాయక్, కిషన్ నాయక్, శ్రీకాంత్ గౌడ్, మాధవి లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా భానోత్ వెంకన్న నాయక మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచిన తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కి ధన్యవాదములు తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు: కలెక్టర్ ప్రతీక్ జైన్

గుర్తింపు పొందిన7 రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం



సంగారెడ్డి, అక్టోబర్ 22 మనం న్యూస్ ప్రతినిధి: ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్-2026) ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి ఎస్ఐఆర్-2026 ప్రక్రియ పురోగతిపై గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఓటరు జాబితాకు సంబంధించి అందే ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని నిర్దేశిత ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఓపీ) ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు పేర్కొన్నారు.నవంబర్ 5వ తేదీలోగా ప్రక్రియను పూర్తి చేసి, నవంబర్ 9న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించి ఏవైనా సమస్యలు, అభ్యంతరాలు లేదా సూచనలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఈ సమావేశంలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రపంచ రికార్డు సృష్టించిన సోనాలికా ట్రాక్టర్స్

హైదరాబాద్, అక్టోబర్ 22(మనంన్యూస్): ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లా సికంద్రాబాద్లో రెండు సోనాలికా గోల్ సిరీస్ ట్రాక్టర్లతో వ్యవసాయ క్షేత్రంలో హిందీ పదం 'దమ్'ను అతిపెద్ద పరిమాణంలో చెక్కారు. 125 అడుగుల ఎత్తు, 272 అడుగుల వెడల్పుతో మొత్తం 34,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో రూపొందించిన ఈ ఘనతను వరల్ రికార్డ్స్ ఇండియా గుర్తించింది. 'జీతే కా దమ్' (గెలిచే సత్తా) అనే అజేయ స్ఫూర్తిని చాటుతూ సోనాలికా ట్రాక్టర్స్ సరికొత్త ప్రపంచ రికార్డును సృష్టించింది. భూమిపై హిందీ పదం 'దమ్'ను అత్యంత పెద్ద పరిమాణంలో చెక్కి ఈ ఘనతను సాధించింది. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రూపొందించిన తన ప్రసిద్ధ గోల్డ్ సిరీస్ ట్రాక్టర్లను ఉపయోగించి, భారతదేశంలో ట్రాక్టర్ ఎగుమతుల్లో నంబర్ వన్ బ్రాండ్గా గుర్తింపు పొందిన సోనాలికా ఈ రికార్డును నెలకొల్పింది. ఈ ఘనతపై ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ రామన్ మిట్టల్ మాట్లాడుతూ 'దమ్' అనేది ప్రతి రైతులో ఉండే ఆత్మవిశ్వాసానికి, ధైర్యానికి ప్రతీక. ప్రతి పంట సీజన్ను కొత్త ఆశతో ప్రారంభించి, ఒకప్పుడు అసాధ్యంగా అనిపించిన లక్ష్యాలను సాధించేందుకు రైతులకు ఇది స్ఫూర్తినిస్తుంది. గత 30 సంవత్సరాలుగా ఈ స్ఫూర్తే మమ్మల్ని సాధారణ ఆలోచనలకు మించి ఆలోచించేలా, నిరంతరం కొత్త విజయాలను సాధించేలా ప్రేరేపిస్తోంది.నేడు ఈ స్ఫూర్తికి ప్రపంచ రికార్డుల్లో స్థానం సంపాదించే స్థాయిలో రూపాన్ని ఇవ్వగలిగినందుకు మేము గర్విస్తున్నాం. మా లక్ష్యం ప్రతిరోజూ సాకారమయ్యే ఈ నేలపైనే ఈ రికార్డును సృష్టించడం మాకు మరింత గర్వకారణం. ఉత్తరప్రదేశ్లోని వ్యవసాయ క్షేత్రంలో హిందీ పదం 'దమ్'ను అత్యంత పెద్ద పరిమాణంలో రూపొందించడం మా గోల్ సిరీస్ ట్రాక్టర్ల శక్తి, సామర్థ్యానికి నిదర్శనమన్నారు.



గజ్వేల్ అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వండి

- పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయండి
- నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయండి
- మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామిలను కలిసిన కాంగ్రెస్ నేతలు



గజ్వేల్ అక్టోబర్ 22(మనం న్యూస్): గజ్వేల్ అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వాలని, పెండింగ్ పనులు పూర్తి చేయాలని, ఖాళీగా ఉన్న నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ గురువారం గజ్వేల్ కాంగ్రెస్ నేతలు మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామిలను కలసి విజ్ఞప్తి చేశారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో గజ్వేల్ కు ప్రాధాన్యత ఇవ్వాలని, గత మూడేళ్లుగా అసంపూర్తి దశలో నిలిచిన రింగు రోడ్డు, రోడ్ల విస్తరణ, ప్రభుత్వ కార్యాలయాల మరమ్మత్తులు, నూతన భవనాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే వివిధ నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయడంతో పాటు రాష్ట్రస్థాయి పోస్టుల్లో గజ్వేల్ నేతలకు అవకాశం ఇవ్వాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు గజ్వేల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి నాయకులు నాయిని యాదగిరి, వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్, వైస్ చైర్మన్ ప్రభాకర్ గుప్త, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, లీగల్ సెల్ నేత సాజిద్ బేగ్, సర్పంచ్ ఫోరం అధ్యక్షులు అశోక్ రెడ్డి కీసర వెంకటేష్, జిల్లా మైనార్టీ సెల్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు సమీర్, ఆయా మండలాల కాంగ్రెస్ బాధ్యులు, నేతలు రవీందర్ రెడ్డి, అశోక్, సుఖేందర్ రెడ్డి, గాడిపల్లి శ్రీనివాస్, సుకేందర్ రెడ్డి, కృష్ణారెడ్డి, కొండల్ రెడ్డి, కర్ణాకర్, గుంటుకు శ్రీను, నక్క రాములు గౌడ్, ఉపేందర్ రెడ్డి, రమేష్, జహీర్ భాయి తదితరులు పాల్గొన్నారు.

రైతులు దళారులను ఆశ్రయించొద్దు

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సూచన



పటాన్ చెరు, అక్టోబర్ 22 (మనం న్యూస్): రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ప్రతి ధాన్యపు గింజకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి రైతులకు విజ్ఞప్తి చేశారు. రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ముత్తంగి డివిజన్ పరిధిలోని పోచారం గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ముత్తంగి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వానాకాలం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో కల్పించిన సదుపాయాలను పరిశీలించి, ధాన్యం విక్రయించేందుకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులు పండించిన పంటను విక్రయించే సమయంలో ఇబ్బందులు ఎదుర్కోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా సాగాలని, రైతులకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన ధరల వివరాల ప్రకారం సన్న వడ్ల ఏ గ్రేడ్కు క్వింటాలుకు రూ.2,461 మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ కలిపి మొత్తం రూ.2,961 చెల్లించనున్నారు. రైతులు తమ పంటకు ప్రభుత్వం ప్రకటించిన ధరను పొందేలా కొనుగోలు కేంద్రాలు దోహదపడనున్నాయి. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ముత్తంగి చైర్మన్ బిక్షపతి, డైరెక్టర్లు, సీనియర్ నాయకులు అంతిరెడ్డి, శివారెడ్డి, నరేందర్ రెడ్డి, దుర్గారెడ్డి, రామచందర్, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

బాబా పిలుపుతో పుస్తకావిష్కరణ



సంగారెడ్డి, అక్టోబర్ 22(మనంన్యూస్): జర్నలిస్టు కల్వల మల్లికార్జున్ రెడ్డి రచించిన బాబా పిలుపుతో పుస్తకం ఆవిష్కరణ గురువారం సంగారెడ్డి బైపాస్ రోడ్డు ప్రశాంత్ నగర్ లోని సాయిబాబా ఆలయంలో జరిగింది. 2023లో మల్లికార్జున్ రెడ్డి దంపతులు సంగారెడ్డి షిరిడి సాయిబాబా ఆలయం నుంచి షిరిడి సాయిబాబా ఆలయం వరకు 16 రోజులపాటు చేసిన పాదయాత్ర అనుభవాలను ఈ పుస్తకంలో పంచుకున్నారు. గురువారం ఆలయంలో నిర్వహించిన మహా సంప్రోక్షణ కార్యక్రమాల సందర్భంగా ఆయన రచించిన పుస్తకాన్ని భక్తుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మల్లికార్జున్ రెడ్డి, ఆయన సతీమణి లతాశ్రీ ని సన్మానించి ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ రెడ్డి దంపతులు తమ షిరిడీ పాదయాత్రలో ఎదురైన అనుభవాలను, బాబా లీలలను భక్తులతో పంచుకున్నారు. బాబా అనుగ్రహంతోనే పుస్తకాన్ని భక్తులకు అందించగలిగానని పేర్కొన్నారు. ఆలయ పూజారి బసవరాజు, ఆలయ నిర్వాహకులు సూర్యాపేట వీరేందర్, బాసుపల్లి ప్రభాకర్‌రెడ్డి, కాశప్ప, నరసయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బాబా పిలుపుతో పుస్తకాన్ని భక్తులకు అందజేశారు.


టీజీపీఎస్సీ పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ



సంగారెడ్డి అక్టోబర్ 22 మనం న్యూస్ ప్రతినిధి: తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలిలో అసిస్టెంట్ సైంటిస్ట్ అనలిస్ట్ గ్రేడ్-ఐఐ పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో ఈ నెల 24.న తేదీన నిర్వహించనున్న కంప్యూటర్ ఆధారిత రిక్రూట్మెంట్ టెస్ట్ (సిబిఆర్టి) నేపథ్యంలో, రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రం వద్ద చేపట్టనున్న పోలీసు బందోబస్తు, అభ్యర్థుల రాకపోకల మార్గాలు, పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు తీసుకుంటున్న భద్రతా చర్యలను సమీక్షించారు. పరీక్షా కేంద్రం పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. పరీక్షా నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా ఎస్పీ వెంట అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్, ఎస్పీ ఇన్స్పెక్టర్ సదా నాగరాజు, ఇన్సాపూర్ ఇన్స్పెక్టర్, భానూర్ ఇన్స్పెక్టర్ విజయ్ కృష్ణ, మహేష్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ రావ్, గీతం యూనివర్సిటీ యాజమాన్యం వర్మ, సతీష్ తదితరులు ఉన్నారు.

మంత్రులను కలిసిన కాట శ్రీనివాస్ గౌడ్

దామోదర రాజనర్సింహా, గడ్డం వివేక్ వెంకటస్వామికి దసరా శుభాకాంక్షలు



పటాన్ చెరు, అక్టోబర్ 22 (మనం న్యూస్): విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలుసుకొని దసరా శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమం, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి దామోదర రాజనర్సింహను హైదరాబాద్లోని ఆయన నివాసంలో కాట శ్రీనివాస్ గౌడ్ కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా హైదరాబాద్లోని రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాస్త్ర శాఖల మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని కాట శ్రీనివాస్ గౌడ్, మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ నీలం మధుతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. విజయదశమి పండుగను పురస్కరించుకొని మంత్రికి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. విజయదశమి సందర్భంగా మంత్రులను కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం ద్వారా పండుగ శుభాకాంక్షలను పరస్పరం పంచుకున్నారు. ఈ పర్వదినం ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, సిరిసంపదలు నింపాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని మంత్రులు ఆకాంక్షించారు. ఈ మర్యాదపూర్వక భేటీలు విజయదశమి పర్వదినం సందర్భంగా ఆత్మీయ వాతావరణంలో సాగాయి.

మండల పరిషత్ ఎన్నికలకు 35 నామినేషన్లు దాఖలు

ఏలేశ్వరం,అక్టోబర్ 22(మనం న్యూస్): ఏలేశ్వరం మండల పరిషత్ ఎన్నికలకు వివిధ పార్టీల నుండి ఎంపీటీసీ స్థానాలకు 35 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల ప్రత్యేక అధికారి సిరిల్ వెల్లడించారు.మండల పరిషత్ ఎన్నికల ప్రకృతిలో భాగంగా నామినేషన్ ప్రక్రియ ప్రారంభమై రెండు రోజునాటికి 35 నామినేషన్లు దాఖలు అయ్యాయి వీటిలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఎంపీటీసీలు 15 మంది కాగా వైసీపీకి 16 నామినేషన్లు, జనసేన3, ఇండిపెండెంట్ 1 చొప్పున మొత్తం 35 నామినేషన్ దాఖలు అయ్యాయి.నామినేషన్లకు ఒక్క రోజు గడివే మిగిలి ఉంది. అయితే జడ్పిటిసి స్థానానికి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.



ఇందిరమ్మ ఇళ్లపై ప్రతిపక్షాల ఆరోపణలు అర్థరహితం

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్

ఖమ్మం , అక్టోబర్ 22(మనం న్యూస్): ఇందిరమ్మ ఇళ్లపై ప్రతిపక్షాలు రోడ్లు ఎక్కటం విడ్డూరంగా ఉన్నదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఎద్దేవా చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు మంత్రివర్గ సహచరులతో కలిసి నిష్పక్షపాతంగా పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. రైతు రుణ మాఫీ, ఉచిత ఆర్ టి సి బస్, 200 యూనిట్లు ఉచిత విద్యుత్, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వటంలో రాజకీయానికి తావులేకుండా నిష్పక్షపాతంగా ప్రభుత్వ అధికారులు విచారణ జరిపి అర్హులైన పేదలకు ఇళ్ల కేటాయింపు చేశారని అన్నారు. రాబోవు రోజుల్లో ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన పేద వారిని గుర్తించి మంజూరు చేస్తారని, ఎక్కడైనా పొరబాట్లు జరిగితే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు. అనేక సంక్షేమ కార్యక్రమాలు నిష్పక్షపాతంగా అమలు చేస్తున్న ప్రభుత్వానికి సహకరించాలని ప్రతిపక్షాలకు పత్రికా ముఖంగా విజ్ఞప్తి చేశారు.

జిల్లా అభివృద్ధి కోసం స్పష్టమైన లక్ష్యాలతో పనిచేయాలి

- కలెక్టర్ దివాకర టిఎస్
- ఆరు నెలల్లో స్వల్పకాలిక లక్ష్యాలు 100 శాతం పూర్తి చేయాలి
- విద్య, వైద్యం, నైపుణ్య శిక్షణ, పరిశ్రమల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి
- మిర్చి ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు పెంచాలి
- అన్నిశాఖల అభివృద్ధి ప్రణాళికలను పరిశీలించి పలు సూచనలు చేసిన కలెక్టర్

ఖమ్మం, అక్టోబర్ 22(మనం న్యూస్): జిల్లా అభివృద్ధి కోసం అన్ని శాఖలు స్పష్టమైన లక్ష్యాలతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి సంబంధిత శాఖల అధికారులు ఇప్పటికే రూపొందించిన జిల్లా అభివృద్ధి ప్రణాళికలపై సమీక్షించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ ప్రణాళికలను వివరించగా, వాటిని పరిశీలించిన కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రతి శాఖ స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించుకోవాలని తెలిపారు. స్వల్పకాలిక లక్ష్యాలను ఆరు నెలల్లోగా వంద శాతం సాధించేలా, మధ్యకాలిక లక్ష్యాలను ఆరు నుంచి పన్నెండు నెలల్లో, దీర్ఘకాలిక లక్ష్యాలను పన్నెండు నుంచి ఇరవై నాలుగు నెలల్లో సాధించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రతి నెలా లక్ష్యాల సాధనలో పురోగతిని సమీక్షించాలని, నిర్దేశిత నమూనాలో పూర్తి వివరాలతో ప్రణాళికలను సవరించి తిరిగి సమర్పించాలని ఆదేశించారు. అత్యంత ముఖ్యమైన పనులను వెంటనే చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అన్ని శాఖల ప్రణాళికలకు ప్రాథమిక కార్యాచరణ నమూనా సిద్ధమైన తర్వాత ప్రతి రంగానికి అవసరమైన కన్సల్టెన్సీ సేవలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు.

వైద్య సేవలు మెరుగుపడాలి:

జిల్లాలో శిశు మరణాల రేటు, మాతృ మరణాల రేటు తగ్గించేందుకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ సూచించారు. గర్భిణుల నమోదు వంద శాతం పూర్తి చేయడంతో పాటు ప్రసవాల వివరాలు, గర్భిణుల ఆరోగ్య పరిస్థితి, టీకాల కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. వైద్య సేవల మెరుగుదలకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఇప్పటికే అమలులో ఉన్న విధానాలను క్షేత్రస్థాయిలో ఎలా పర్యవేక్షిస్తున్నారో నిర్దేశిత నమూనాలో వివరాలు సమర్పించాలని తెలిపారు. సిజేరియన్ ప్రసవాలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని, పీసీపీఎన్డీటీ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని సూచించారు. పిల్లల్లో తీవ్రమైన పోషకాహార లోపం, మధ్యస్థ పోషకాహార లోపం తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ముఖ్యంగా అటవీ ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లో పిల్లల్లో పోషకాహార లోపానికి గల కారణాలను గుర్తించి, సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన ప్రతి అంశంపై లక్ష్యాలు, అమలు విధానం, పర్యవేక్షణ వివరాలను నిర్దేశిత నమూనాలో సమర్పించాలని ఆదేశించారు.

పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి:

ప్రతి పాఠశాల ప్రస్తుత రేటింగును పరిగణనలోకి తీసుకొని విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేలా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడంతో పాటు విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతను మెరుగుపరచాలని తెలిపారు. పాఠశాలల వారీగా సాధించాల్సిన లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించి, వాటి పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు పెంచాలి:

యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు, స్కిల్ యూనివర్సిటీ, వృత్తి విద్యా శిక్షణ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పరిశ్రమలు, మార్కెట్లో ప్రస్తుతం ఉన్న నైపుణ్యాల డిమాండ్కు అనుగుణంగా శిక్షణ కోర్సులు రూపొందించాలని సూచించారు. నైపుణ్య శిక్షణ కార్యక్రమాల్లో ఎక్కువ మంది యువత పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని, శిక్షణ పొందుతున్న యువత వివరాలు, శిక్షణ పురోగతి, సాధించిన ఫలితాలపై ప్రత్యేక రికార్డు నిర్వహించాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తూ యువతకు ఉపాధి అవకాశాలు పెరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వసతి విద్యాసంస్థల్లో త్రాగునీటి పరిస్థితిపై వారంలో నివేదిక ఇవ్వాలి

జిల్లాలోని అన్ని వసతి విద్యాసంస్థల్లో త్రాగునీటి సదుపాయాల పరిస్థితిని వచ్చే వారం రోజుల్లోగా సమగ్రంగా పరిశీలించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు సురక్షితమైన త్రాగునీరు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

పరిశ్రమలు, మిర్చి ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులు, ఉత్పత్తులు, పారిశ్రామిక అవకాశాలను పరిగణనలోకి తీసుకొని పరిశ్రమల అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ తెలిపారు. పెద్ద, మెగా పరిశ్రమల స్థాపనకు అవకాశాలను గుర్తించడంతో పాటు చిన్న, మధ్య తరహా పరిశ్రమల పరిధిలో వ్యవసాయ ఆధారిత ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో మిర్చి ఉత్పత్తి అధికంగా ఉన్నప్పటికీ, దానికి అనుగుణంగా ప్రాసెసింగ్ యూనిట్లు తక్కువగా ఉన్న అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మిర్చి ప్రాసెసింగ్తో పాటు ఇతర వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ప్రతిపాదిత ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా ఎంతమందికి ఉపాధి లభిస్తుంది, ఎంత ఆర్థిక విలువ సృష్టించ వచ్చు అనే వివరాలతో స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలు సమర్పించాలని ఆదేశించారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ఆన్లైన్ సేవలు పెంచాలి

ప్రభుత్వ కార్యాలయాల్లో హాజరు సహా సంబంధిత పరిపాలనా ప్రక్రియలను ఆన్లైన్లో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వివిధ శాఖల పనితీరు, లక్ష్యాల సాధన, సేవల పురోగతిని సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు డ్యాష్బోర్డు అభివృద్ధి చేయాలని తెలిపారు. దీనికి అవసరమైన సమాచారాన్ని ముందుగానే గుర్తించి, సంబంధిత శాఖల నుంచి వివరాల సేకరణకు తగిన విధానం ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

పట్టణాల్లో మౌళిక సదుపాయాలు మెరుగుపరచాలి

పట్టణ ప్రాంతాల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాల పనితీరు మెరుగుపరచడంతో పాటు త్రాగునీటి సరఫరా, ఫుట్పాత్లు, పారిశుధ్య సదుపాయాలను మెరుగు పరచాలని కలెక్టర్ తెలిపారు. పట్టణాల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని సమగ్ర పట్టణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. జనాభా పెరుగుదల, పట్టణాలు, నగరాల విస్తరణ, కొత్త కాలనీల ఏర్పాటు, భవన నిర్మాణాల అవసరాలను ముందుగానే అంచనా వేసి



ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేపట్టాలని ఆదేశించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌళిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగంగా అందించాలి

ప్రతి ప్రభుత్వ కార్యాలయం నుంచి ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించాలని కలెక్టర్ సూచించారు. వివిధ సేవల కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను తగ్గించి, సేవలను వేగంగా అందించేందుకు కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ప్రతి సేవకు సంబంధించి తీసుకునే సమయం, సేవల పంపిణీలో మెరుగుదల వంటి అంశాలపై స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించుకోవాలని సూచించారు. అన్ని శాఖలు తమ ప్రణాళికలను సూచనలకు అనుగుణంగా సవరించి, నిర్దేశిత నమూనాలో తిరిగి సమర్పించాలని ఆదేశించారు. ప్రతి నెలా లక్ష్యాల సాధనను సమీక్షిస్తూ, జిల్లా అభివృద్ధి ప్రణాళికలను ఫలితాల ఆధారంగా ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, సిపిఓ శ్రీనివాస్, సంబంధిత జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ వివక్షపై భగ్గుమన్న విపక్షం





- ప్రజా పాలన కాదిది కాంగ్రెస్ పాలనే
- కండువ కప్పుకుంటేనే అర్హుడా...?
- రాజకీయ వివక్షను మానుకోండి
- వామపక్ష, బిఆర్ఎస్ నాయకులు
- ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా ఆందోళన: కలెక్టరు వినతి

ఖమ్మం, అక్టోబర్ 22(మనం బ్యూరో): ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ప్రభుత్వం చూపెడుతున్న రాజకీయ వివక్షపై విపక్షాలు భగ్గుమన్నాయి. వామపక్షాలు బిఆర్ఎస్ నేతృత్వంలో గురువారం భారీ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా ధర్నాచౌక్లో ఎంఎల్సీ తాతా మధు అధ్యక్షతన ఆందోళన కార్యక్రమంలో వివిధ పార్టీల నేతలు మాట్లాడుతూ రాజకీయ వివక్షను మానుకోకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని అసలైన అర్హులకు ఇండ్లు దక్కే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి ఇందిరమ్మ గ్రామ కమిటీలను తక్షణం రద్దు చేయాలని లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ, సిపిఎం, బిఆర్ఎస్, సిపిఐ (ఎంఎల్) మాస్లైన్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ తదితర పార్టీల నేతృత్వంలో ఖమ్మం ధర్నాచౌక్లో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి వివిధ పక్షాల నాయకులు మాట్లాడుతూ అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు దక్కడం లేదని ఎల్1, ఎల్2, ఎల్క తో పాటు ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి అధికార పార్టీ కార్యకర్తలకు ఇండ్లు కట్టబెడుతున్నారన్నారు. రాష్ట్ర మంత్రులు ఇందిరమ్మ ఇండ్లలో ఎటువంటి వివక్ష లేదని అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెబుతున్న మాటలకు గ్రామాల్లో జరుగుతున్న పరిణామాలకు పొంతన లేదన్నారు. ఆచరణలో తద్విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అధికార యంత్రాంగం సైతం అధికార పార్టీకి దాసోహం అంటూ క్యాంపు కార్యాలయాల్లో లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించి ఖర్చు చేస్తున్న సొమ్ము కాంగ్రెస్ పార్టీదో, మంత్రులదో కాదని అది ప్రజా ధనమని ప్రజా ధనంపై అందరికీ హక్కు ఉంటుందని వారు స్పష్టం చేశారు. రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు 73, 74 రాజ్యాంగ సవరణ చేశారని దానిని కూడా కాంగ్రెస్ పార్టీ తుంగలో తొక్కి సర్పంచులకు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో కనీస ప్రమేయం లేకుండా చేస్తుందని నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ వారే పన్ను కడుతున్నారా ఇతరులు పన్ను కట్టడం లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ కండువ కప్పుకుంటేనే ఇండ్లు ఇస్తామన్నది సమాంజసం కాదని పద్ధతి మార్చుకోకపోతే పతనం తప్పదని హెచ్చరించారు.

పేదలందరికీ ఇండ్లు ఇవ్వాల్సిన ప్రభుత్వం రాజకీయ వివక్షకు తావిచ్చి కాంగ్రెస్సేతర రాజకీయ పక్షాలలో ఉన్న వారికి ఇండ్లు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని బోనకల్లు, కల్లూరు మండలం మర్లపాడులో ప్రభుత్వం వ్యవహరించిన తీరుకు నిదర్శనమన్నారు. గతంలో పేదలను గుర్తించి లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసే వారని కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం తీరు మార్చుకుని తక్షణం ఇందిరమ్మ గ్రామ కమిటీలను రద్దు చేసి అర్హులను గుర్తించి లాటరీ పద్ధతిలో లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ గేటు వద్ద దాదాపు గంట సేపు బైఠాయించారు. జిల్లా నలుమూలల నుంచి వామపక్షాలు, బిఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. అనంతరం డిమాండ్తో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్కు అందజేయడంతో పాటు జిల్లాలో నెలకొన్న పరిస్థితిని అర్హులకు జరుగుతున్న అన్యాయాన్ని కలెక్టర్కు వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, ఎంఎల్సి తాతా మధు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్ఎలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్రెడ్డి, బానోత్ చంద్రావతి, జెడ్పి మాజీ చైర్మన్ లింగాల కమల్రాజు, సిపిఐ(ఎంఎల్) మాస్లైన్ జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బండారు ఐలయ్య, సిపిఐ(ఎంఎల్)చండ్ర సురేందర్, వివిధ పార్టీల నాయకులు మహ్మద్ మౌలానా, బెల్లం వేణుగోపాల్, బండి రమేష్, మాదినేని జితేందర్ రెడ్డి, యర్రాబాబు, ఎస్కి జానిమియా, ఏపూరి లతాదేవి, ఆవుల అశోక్, జి. రామయ్య, శిరోవ -లక్ష్మి నారాయణ, యర్రా శ్రీనివాసరావు, పగడాల నాగరాజు, బొమ్మెర రామ్మూర్తి, వివిధ గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

భద్రాద్రి జిల్లాకు తీవ్ర అన్యాయం చేస్తున్న మంత్రులు



- తుమ్మల మాటలు అబద్దాల మూటలు
- సీతారామ ప్రాజెక్టు నీళ్ళు ఎవరికి?
- 4 నియోజకవర్గాలకు చుక్క నీరు లేదు
- అన్ని నియోజకవర్గాలకు సాగునీటి సాధనకు ఉద్యమం
- సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 22 (మనం ప్రతినిధి): సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించడంలో జిల్లా రైతాంగానికి జిల్లా మంత్రులు తీరని అన్యాయం చేస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు ఆరోపించారు. గురువారం కొత్తగూడెంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీతారామ ప్రాజెక్టు పరిశీలన సందర్భంగా చేసిన వ్యాఖ్యలు జిల్లా రైతాంగానికి తీవ్ర అన్యాయం చేసే విధంగా ఉన్నాయని తెలిపారు. గోదావరి నీటిని ఒడిసి పట్టడం ఎవరికోసమని ఆయన ప్రశ్నించారు. జిల్లా రైతాంగానికి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇల్లందు ,పినపాక, కొత్తగూడెం, భద్రాచలం నియోజకవర్గాలకు చుక్క నీరు రావడం లేదన్నారు. కిన్నెరసాని ప్రాజెక్టు, రోళ్ళపాడు ప్రాజెక్టుల ఊసే ఎత్తని మంత్రి లంకాసగర్ కు నీళ్ళు తీసుకొని పోవడానికి ప్రణాళికలు రూపొందించడాన్ని తీవ్రంగా విమర్శించారు. జిల్లాలో ఉన్న అన్ని నియోజకవర్గాలకు సాగునీటి సాధనకు ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అన్ని నియోజకవర్గాలకు సాగునీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. చెరువులకు అనుసంధానం కోసం సమగ్ర ప్రణాళిక రూపొందించాలని, నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సీతమ్మ సాగర్ బహుళ ప్రయోజనాల ప్రాజెక్టు నిర్మాణం కోసం వెంటనే నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మంత్రులు చేస్తున్న అన్యాయాన్ని వివరిస్తామని తెలిపారు. జిల్లా రైతాంగం ఐక్యంగా సాగునీటి సాధనకు పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎజె రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, కొలగాని బ్రహ్మచారి, రేపాకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఢిల్లీలో జాతీయ స్థాయి సెమినార్లో పాల్గొన్న ఎమ్మెల్యే జారె

గిరిజన ప్రాంతాల అభివృద్ధి, పారిశ్రామిక పెట్టుబడులు, గిరిజన యువతకు ఉపాధి అవకాశాలపై చర్చ



దమ్మపేట, అక్టోబర్ 22 (మనం న్యూస్)ః దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి సెమినార్లో తెలంగాణ రాష్ట్రం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ, పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన రాజకీయ నాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, సామాజిక సంస్థల ప్రతినిధులతో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొని అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహం, గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ తన అభిప్రాయాలను వెల్లడించారు.

వివిధ రాష్ట్రాలకు చెందిన రాజకీయ, పారిశ్రామిక, వ్యాపార, సామాజిక రంగాల ప్రముఖులు ఒకే వేదికపై సమావేశమైన ఈ సెమినార్ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై అభిప్రాయాలను పంచుకునేందుకు వేదికగా నిలిచింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అభివృద్ధి అవకాశాలు, వెనుకబడిన ప్రాంతాల పురోగతికి తీసుకోవాల్సిన చర్యలు, యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందించే మార్గాలు వంటి అంశాలపై చర్చలు జరిగాయి.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత

తెలంగాణ రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధి, అక్కడి ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాలు. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వంటి గిరిజన జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లో విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, రవాణా వంటి మౌలిక సదుపాయాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది.ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన అంశాలను సెమినార్లో ప్రస్తావించారు. గిరిజన ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావడం, విద్యా, వైద్య సేవలు మరింత చేరువ కావడం, స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం వంటి అంశాల ప్రాధాన్యతను వివరించారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలైతే స్థానిక ప్రజలకు మెరుగైన జీవన అవకాశాలు లభిస్తాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరడంతో పాటు, ప్రాంతీయ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించడం ద్వారా అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరువయ్యే అవకాశం ఉంటుంది.పారిశ్రామిక పెట్టుబడులతో ప్రాంతీయ అభివృద్ధి పారిశ్రామిక పెట్టుబడులు, కొత్త పరిశ్రమల ఏర్పాటు, స్థానికంగా ఉపాధి అవకాశాల కల్పన కూడా ప్రాంతీయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయి. పరిశ్రమలు అభివృద్ధి చెందడం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు పెరిగే అవకాశం ఉంటుంది. స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుంటూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహించడం అవసరం.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రాంతాలకు అనుగుణంగా పారిశ్రామిక, వ్యాపార అవకాశాలను విస్తరించడం ద్వారా స్థానిక ఆర్థిక కార్యకలాపాలకు ఊతం లభించవచ్చు. పెట్టుబడులను ఆకర్షించేందుకు అనుకూల పరిస్థితులు కల్పించడం, పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ అందించడం వంటి చర్యలు ప్రాంతీయ పురోగతికి దోహదపడతాయి.ఈ అంశాల నేపథ్యంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ,వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పారిశ్రామి కవేత్తలు, వ్యాపార రంగ ప్రముఖులతో కలిసి పెట్టుబడులు, పరిశ్రమల అభివృద్ధి, ఉపాధి అవకాశాలకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

గిరిజన యువతకు నాణ్యమైన విద్య, నైపుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి తీసుకురావడం సమగ్ర అభివృద్ధికి ఎంతో అవసరం. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలపై యువతకు అవగాహన కల్పించడం, పోటీ పరీక్షలకు అవసరమైన మార్గదర్శకత్వం అందించడం, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ద్వారా యువత భవిష్యత్తుకు బాటలు వేయవచ్చు.గిరిజన ప్రాంతాల్లోని యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు పెరిగితే జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితులు తగ్గే అవకాశం ఉంటుంది. పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల మధ్య సమన్వయం పెంపొందించడం ద్వారా యువతకు మరిన్ని అవకాశాలు కల్పించవచ్చు.ఈ నేపథ్యంలో గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు సంబంధించిన అంశాలకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ప్రాధాన్యతనిస్తూ తన అభిప్రాయాలను వెల్లడించారు. విద్యతో పాటు ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రావడం ద్వారా గిరిజన యువత ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందని ఈ అంశం ప్రాధాన్యతను తెలియజేస్తుంది.

వివిధ రంగాల ప్రముఖులతో అభిప్రాయాల మార్పిడి

ఢిల్లీలో నిర్వహించిన ఈ సెమినార్లో వివిధ రాష్ట్రాలకు చెందిన రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, సామాజిక సంస్థల ప్రతినిధులు పాల్గొనడంతో పలు రంగాలకు సంబంధించిన అంశాలపై అభిప్రాయాల మార్పిడికి అవకాశం ఏర్పడింది. అభివృద్ధి కార్యక్రమాలు, పెట్టుబడులు, యువతకు ఉపాధి కల్పన, సామాజిక సంక్షేమం వంటి అంశాలను వివిధ కోణాల్లో చర్చించేందుకు ఈ వేదిక ఉపయోగపడింది. అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ,ఈ సెమినార్లో పాల్గొని గిరిజన ప్రాంతాల అభివృద్ధి, పారిశ్రామిక పెట్టుబడులు, గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు.

యు. కొత్తపల్లి మండలంలో 56 ఎంపీటీసీ నామినేషన్లలు

యు. కొత్తపల్లి సెప్టెంబర్ 22 (మనం న్యూస్): మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా గురువారం నాటికి మొత్తం 56 నామినేషన్లు దాఖలయ్యాయి. మండలంలోని 24 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు.

నామినేషన్ల వివరాల ప్రకారం వైఎస్సార్సీపీ నుంచి అత్యధికంగా 26 నామినేషన్లు దాఖలు కాగా, తెలుగుదేశం పార్టీ నుంచి 18, జనసేన పార్టీ నుంచి 9, స్వతంత్ర అభ్యర్థులుగా ఇద్దరు, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్



జిల్లా పరిషత్‌లో ఎంసిఎంసి ఏర్పాటు

జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్

అనంతపురం, కలెక్టరేట్ అక్టోబర్ 22 : మనం న్యూస్: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జడ్పిటిసి / ఎంపిటిసి ఎన్నికల కోసం మీడియా ధృవీకరణ మరియు పర్యవేక్షణ కమిటీ (మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ , ఎంసిఎంసీ) ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ తెలిపారు. స్థానిక సంస్థల (జడ్పిటిసి, ఎంపిటిసి) ఎన్నికలకు సంబంధించి టీవీ ఛానెళ్లు / కేబుల్ నెట్వర్క్ / రేడియో / సినిమా హాళ్లు / బహిరంగ ప్రదేశాలలో ఆడియో విజువల్ డిస్ప్లేలు / ఈ-పేపర్లు / బల్క్ ఖిఖిలు / వాయిస్ మెసేజ్లు / సోషల్ మీడియాలో రాజకీయ ప్రకటనల ధృవీకరణ, 'పెయిడ్ న్యూస్' పరిశీలన మరియు పర్యవేక్షణ కోసం జిల్లా స్థాయిలో మీడియా ధృవీకరణ మరియు పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ కమిటీ చైర్మన్ గా, కమిటీ సభ్యులుగా జిల్లా ప్రజా పరిషత్ సిఈఓ పి.విజయలక్ష్మి, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి ఏ.బాలకొండయ్య సభ్యులుగా మీడియా ధృవీకరణ మరియు పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

జిల్లా పరిషత్ లో ఎంసిఎంసి ఏర్పాటు..:

అనంతపురం నగరంలోని జిల్లా ప్రజా పరిషత్ లోని ప్లానింగ్ సెక్షన్ ఎదురుగా ఉన్న గదిలో మీడియా ధృవీకరణ మరియు పర్యవేక్షణ కమిటీ (మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ , ఎంసీఎంసీ) ఏర్పాటు చేయడం జరిగింది.

ఏదైనా గుర్తింపు పొందిన లేదా నమోదైన రాజకీయ పార్టీ లేదా వ్యక్తిగత అభ్యర్థి ద్వారా ఏదైనా రాజకీయ ప్రకటన యొక్క ధృవీకరణ కోసం దరఖాస్తును, అటువంటి ప్రకటన యొక్క టెలికాస్ట్ / ప్రసారం / ప్రదర్శన ప్రారంభమయ్యే తేదీకి కనీసం మూడు రోజుల ముందుగా నియమించబడిన కమిటీకి సమర్పించాలి.

అటువంటి ప్రతి దరఖాస్తు అనెక్సర్-ఎ (అనెక్సర్ - ఏ) లో సూచించిన ఫార్మాట్లో ఉండాలి. ప్రతిపాదిత ప్రకటన యొక్క ఎలక్ట్రానిక్ రూపంలో రెండు కాపీలు, దానితో పాటు సక్రమంగా ధృవీకరించబడిన ప్రతిలేఖనం(ట్రాన్స్క్రిప్షన్) తదితర వివరాలతో సమర్పించాల్సి ఉంటుంది. పెయిడ్ న్యూస్ కొరకు జిల్లా స్థాయి ఎంసిఎంసీ పర్యవేక్షిస్తుంది.

కత్తిపూడి జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం..

నలుగురు భవానీ భక్తులు మృతి!

భవానీ భక్తుల కుటుంబాల్లో తీవ్ర విషాదం..



శంఖవరం అక్టోబర్ 22 మనం ప్రతినిధి: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడి సమీపంలోని రావికంపాడు రోడ్డు కూడలి వద్ద గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్కార్పియో కారు ఢీకొనడంతో విజయనగరం జిల్లా డెంకాడ ప్రాంతానికి చెందిన నలుగురు భవానీ భక్తులు దుర్మరణం పాలయ్యారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

విజయనగరం జిల్లా డెంకాడ ప్రాంతం నుంచి సుమారు 40 మంది భవానీ భక్తులు ప్రైవేట్ బస్సులో విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి బయలుదేరారు. కత్తిపూడి సమీపంలో బస్సు సాంకేతిక లోపంతో ఆగిపోవడంతో, మరమ్మతులు జరుగుతున్న సమయంలో కొందరు భక్తులు టీ తాగేందుకు, ఇతర అవసరాల కోసం బస్సు దిగారు. ఈ క్రమంలో రహదారిని దాటుతున్న భక్తులపైకి వేగంగా వచ్చిన స్కార్పియో కారు దూసుకెళ్లింది.

ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందగా, మరో భక్తుడు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు కోల్పోయారు. మృతులను డెంకాడకు చెందిన సిరిగిడి ఎర్రయ్య (38), లింగాల సీతారాం (45), బొనేల సత్తిబాబు (40), తాటిపూడి శివప్రసాద్ (40)గా పోలీసులు గుర్తించారు. గాయపడిన మరో ఇద్దరిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న కాకినాడ డీఎస్పీ తిలక్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో భవానీ భక్తుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. దర్యాప్తులో భాగంగా ప్రతిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి సూర్య అప్పారావు, అన్నవరం సబ్ ఇన్స్పెక్టర్ శ్రీ హరి బాబు, అన్నవరం పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నామినేషన్ కేంద్రాల వద్ద కనీస సౌకర్యాల కరువు !

తాడేపల్లిగూడెం అక్టోబర్ 22 (మనం న్యూస్) : నామినేషన్ కేంద్రాల వద్ద కనీస ఏర్పాట్లు చేయకపోవడంతో అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో నామినేషన్ ప్రక్రియను ఎన్నికల సిబ్బంది పర్యవేక్షిస్తున్నప్పటికీ, అభ్యర్థులు కూర్చోవడానికి కనీస వసతులు కూడా కల్పించలేదు. కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేకపోవడంతో నామినేషన్ వేయడానికి వచ్చిన అభ్యర్థులు, వారి మద్దతుదారులు తాగునీటి కోసం తహతహలాడారు. మంచినీటి బాటిల్ కోసం చుట్టుపక్కల దుకాణాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.అభ్యర్థులకే కాకుండా విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి, భద్రతా విధుల్లో ఉన్న పోలీసులకు కూడా తాగునీరు అందుబాటులో లేకపోవడంతో బయట నుండి డబ్బులు పెట్టి బాటిళ్లు కొనుగోలు చేయాల్సి వచ్చింది.వివిధ గ్రామాల నుంచి వచ్చిన అభ్యర్థులకు ఈ పరిస్థితి మరింత ఇబ్బందిగా మారింది. సాధారణంగా నామినేషన్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసే ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ను కూడా ఎన్నికల అధికారులు ఏర్పాటు చేయకపోవడం పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా కనీస సౌకర్యాలు కల్పించకుండా నామినేషన్ ప్రక్రియ కొనసాగిస్తున్నారంటూ ఆర్వో పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.రానున్న మండల పరిషత్ ఎన్నికల నేపథ్యంలో విధులు నిర్వహించేందుకు 7500 మందిని నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన జిల్లా సంయుక్త కలెక్టర్



అనంతపురం, కలెక్టరేట్ అక్టోబర్ 22(మనం న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా జెడ్పీటిసి,ఎంపిటిసి ఎన్నికలు - 2026 కు సంబంధించి పెద్దపప్పూరు మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో గురువారం ఎంపిటిసి నామినేషన్ల ప్రక్రియను జిల్లా సంయుక్త కలెక్టర్ సి.విష్ణుచరణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఎన్నికల నోటిఫికేషన్ షెడ్యూల్ ప్రకటన, నోటీస్ బోర్డు ఏర్పాటు, సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, సెక్యూరిటీ సమస్యలు, తదితర వివరాలను జిల్లా సంయుక్త కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా ఎంపిటిసి నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు కుల ధృవీకరణ పత్రాలు, ఆదాయ ధృవీకరణ పత్రాలను సమయానికి ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి ఎలాంటి భద్రత సమస్యలు రాకుండా చూడాలన్నారు.

నామినేషన్ల చివరి రోజు చివరి సమయంలో ఇబ్బందులు రాకుండా పటిష్ట జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ ఆర్ఓ, పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్, ఎంపీడీవో పెద్దపప్పూరు, డిఎం మార్కుడ్ మరియు ఎన్నికల అధికారి పెన్నేశ్వరి, తహసీల్దార్ బాలాజీ రాజు, ఎన్నికల సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

మేయర్, కార్పొరేటర్ల అభ్యర్థుల విజయం కోసం పని చేయండి

- **వైభవ్ రెసిడెన్సీలో బీసీ నాయకులతో మంత్రి సత్యకుమార్**



అనంతపురం, అక్టోబర్ 22 మనం న్యూస్ : నగరంలోని వైభవ్ రెసిడెన్సీలో ఎస్ఆర్ లోకేష్ బాబు ఆధ్వర్యంలో బీసీ నాయకులతో మంత్రి సత్యకుమార్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మంత్రితోపాటు నగరపాలక సంస్థ బీజేపీ మేయర్ అభ్యర్థి అజేష్ యాదవ్, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు ఎస్ఆర్ నాగభూషణం, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చక్రధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కేంద్రంలో, రాష్ట్రంలో, స్థానికంగా కూడా ఎన్డీఏ కూటమి అధికారంలో ఉంటేనే నిధులు సమకూర్చుకుని నగరాన్ని మరింత అభివృద్ధి చేయడం సాధ్యమవుతుందన్నారు. వైసీపీకి ఓటు వేస్తే ప్రయోజనం ఉండదని వ్యాఖ్యానించారు. నగరంలో అభివృద్ధి ప్రస్థానం కొనసాగాలంటే కూటమి మేయర్ అభ్యర్థి అజేష్ యాదవ్ను భారీ మెజారిటీతో గెలిపించాలని బీసీ నాయకులకు పిలుపునిచ్చారు. వైసీపీకి ఓటు వేస్తే అనంతపురం నగరం మళ్లీ వెనుకబడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేసి అన్ని స్థానాల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మొత్తంగా అనంతపురం నగరపాలక సంస్థ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కూటమి పార్టీలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయని తెలిపారు. అనంతరం ఎస్ఆర్ నాగభూషణం మాట్లాడుతూ.. ఎన్డీయే కూటమి విజయం సాధిస్తేనే అనంతపురం నగరం అభివృద్ధి చెందుతుందన్నారు. కావున బీసీ నాయకులంతా మేయర్ అభ్యర్థి అజేష్ యాదవ్తోపాటు కార్పొరేటర్ల అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పెద్ద ఎత్తున బీసీ నాయకులు, యువత తదితరులు పాల్గొన్నారు.

పోడూరు ఎంపీపీ అభ్యర్థిగా దొంగ సూర్య వరప్రసాద్

- **టీడీపీ నుంచి పోడూరు-2 ఎంపీటీసీగా నామినేషన్.**
- **40 ఏళ్ల రాజకీయ అనుభవంతో మండల అభివృద్ధికి కృషి చేస్తా.**

పోడూరు, అక్టోబరు 22, మనం ప్రతినిధి : పోడూరు మండల పరిషత్ అధ్యక్ష పదవి అభ్యర్థిగా కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ నాయకుడు దొంగ సూర్య వరప్రసాద్ బరిలో నిలిచారు. గురువారం పోడూరు మండల పరిషత్ కార్యాలయంలో పోడూరు-2 ఎంపీటీసీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఆశీస్సులతో ఆయన టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నాని అందుకు పితాని సత్యనారాయణకు తన మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. నాలుగు దశాబ్దాలకు పైగా రాజకీయ అనుభవం ఉన్న సూర్య వరప్రసాద్ ఎంపీపీ అభ్యర్థిగా పోటీ చేస్తుండటంతో పార్టీ శ్రేణుల్లో ఆసక్తి నెలకొంది.

మండల అభివృద్ధే ధ్యేయం

నామినేషన్ దాఖలు చేసిన తదనంతరం ఆయన మాట్లాడుతూ పోడూరు మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని సూర్య వరప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు సమ ప్రాధాన్యమిస్తూ మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని, తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తానని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో మండల సమగ్ర అభివృద్ధికి కృషి చేయడమే తన లక్ష్యమని తెలిపారు.

భారీగా తరలివచ్చిన కూటమి శ్రేణులు

సూర్య వరప్రసాద్ నామినేషన్ కార్యక్రమానికి టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రరాజు రమేష్రాజు, టీడీపీ నాయకులు రుద్రరాజు సీతారామరాజు (రవిరాజు), రుద్రరాజు బంగారురాజు, మాజీ ఉపసర్పంచ్ శిలబోయిన జయరామకృష్ణ, మాజీ సర్పంచ్ కుక్కల దుర్గారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు,కూటమి నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించండి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపు



రాయదుర్గం, అక్టోబరు 22, మనం న్యూస్: రాయదుర్గం పురపాలక సంఘం ఎన్నికల్లో తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ, జనసేన కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పట్టణ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో ఆయన మాట్లాడుతూ కూటమి పార్టీలన్నీ ఐక్యంగా ఎన్నికల బరిలో నిలుస్తున్నాయని స్పష్టం చేశారు.మూడు పార్టీల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు పురపాలక ఎన్నికల్లో జనసేనకు మూడు, భారతీయ జనతా పార్టీకి రెండు వార్డులను కేటాయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా భారతీయ జనతా పార్టీ తరపున 9వ వార్డులో నాగరత్నమ్మ, 37వ వార్డులో భాగ్యమ్మ పోటీ చేస్తున్నారని వెల్లడించారు. జనసేన తరపున కూడా ముగ్గురు అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలుస్తారని పేర్కొన్నారు.తెలుగుదేశం పార్టీ అభ్యర్థులతోపాటు కూటమి భాగస్వామ్య పార్టీలైన భారతీయ జనతా పార్టీ, జనసేన అభ్యర్థులను సైతం అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కూటమి ఐక్యతను చాటుతూ అన్ని వార్డుల్లోనూ అభ్యర్థుల విజయానికి పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు అందిస్తోందని, వాటి ద్వారా వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నా యని కాలవ శ్రీనివాసులు తెలిపారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. కూటమి పార్టీల మధ్య ఉన్న ఐక్యతను పురపాలక ఎన్నికల్లోనూ ప్రతిబింబించాలని, ప్రజలు కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి అఖండ విజయాన్ని అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం చైర్మన్ అభ్యర్థి టంకశాల హనుమంతు, పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణమూర్తి, భారతీయ జనతా పార్టీ నాయకురాలు వసుంధరాదేవి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీటీసీ నామినేషన్లకు పటిష్ఠ భద్రత

డ్రోన్లు, సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా

యు.కొత్తపల్లి సెప్టెంబర్ 22 (మనం న్యూస్): మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు కొత్తపల్లి ఎస్సై జి. వెంకటేష్ గురువారం తెలిపారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థుల భద్రతతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

ఇందులో భాగంగా డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, ఎంపీడీవో కార్యాలయం. కరెంట్ ఆఫీస్ , ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు శాఖ తరపున తగిన చర్యలు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు .

నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రముఖులు

వసుంధరదేవిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీ బీకే దంపతులు



హిందూపురం (మనం న్యూస్), అక్టోబర్ 22: హిందూపురం మున్సిపల్ మాజీ చైర్మన్ రమేష్ కుమార్ కుమారుడు పవన్ రక్షిత వివాహ వేడుక గురువారం పట్టణంలోని ఆర్ఎంఎస్ కన్వెన్షన్ హాల్లో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధరదేవి, హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బి.కె. పార్థసారథి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. వివాహ వేడుక సందర్భంగా పలువురు రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖుల రాకతో వివాహ వేడుక సందడిగా సాగింది. అనంతరం హిందూపురం పట్టణంలోని బాలాజీ నివాసంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధరదేవిని ఎంపీ బి.కె. పార్థసారథి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పరస్పరం ఆత్మీయంగా పలకరించుకున్నారు. అదేవిధంగా ఇదే రోజు ఎంపీ తనయుడు సుధాకర్ మనుమడి నామకరణ మహోత్సవానికి ఎంపీ బి.కె. పార్థసారథి, కమలమ్మ దంపతులు హాజరయ్యారు. చిన్నారిని ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో హిందూపురం మున్సిపల్ చైర్మన్ టీడీపీ అభ్యర్థి పి.ఎస్. మంజునాథ్, నాగరాజు, మంచాల మారుతి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్సీపీలో చేరిన పాటంశెట్టి సూర్యచంద్ర దంపతులు



కిర్లంపూడి అక్టోబర్ 22:(మనం న్యూస్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే ధ్యేయంగా శక్తివంచన లేకుండా పనిచేస్తానని వైఎస్సార్సీపీ నాయకుడు పాటంశెట్టి సూర్యచంద్ర స్పష్టం చేశారు. జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్చార్జ్ తోట నరసింహం, తోట రాంజీల ఆధ్వర్యంలో గోరువారం తాడేపల్లి లోని క్యాంపు కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి సమక్షంలో తన సతీమణి శ్రీదేవి, ముఖ్య అనుచరులతో కలిసి ఆయన వైఎస్సార్సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి వైఎస్ జగన్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పాటంశెట్టి సూర్యచంద్ర మాట్లాడుతూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జగ్గంపేట నియోజకవర్గ పరిధిలోని పంచాయతీలు, మండలా ల్లో వైఎస్సార్సీపీ అభ్యర్థుల విజయానికి అహర్నిశలు శ్రమిస్తానని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా వంచిస్తోందని తీవ్రంగా విమర్శించారు. మళ్లీ ఎన్నికలు రాగానే గ్రామాల్లోకి వచ్చి పనులు చేస్తామంటూ మాయమాటలు చెబుతున్న కూటమి నేతల ప్రకటనలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు.

గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో గడపగడపకూ అందిన సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ జగ్గంపేట నియోజకవర్గం లో వైఎస్సార్సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా ముందుకు సాగాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వారం రోజులైనా పూడ్చని రహదారి గుంత!

- ప్రమాదం జరిగాకే స్పందిస్తారా?
- మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై కాలనీవాసుల ఆగ్రహం



ఆర్మూర్, అక్టోబర్ 22 (మనం న్యూస్): ఆర్మూర్ పట్టణంలో రహదారిపై ఏర్పడిన భారీ గుంత వాహనదారులకు ప్రమాదకరంగా మారుతోంది. డ్రైనేజీ మరమ్మతుల కోసం రహదారిపై గుంత తీసి వారం రోజులు గడుస్తున్నా, ఇంతవరకు మరమ్మతులు పూర్తి చేసి గుంతను పూడ్చకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రద్దీగా ఉండే రహదారిపై గుంతను అలాగే వదిలేయడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు.

రద్దీ రహదారిపై తప్పని ఇబ్బందులు.

ఆర్మూర్ మీదుగా నిజామాబాద్కు నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇలాంటి ప్రధాన రహదారిపై భారీ గుంత ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతను తప్పించుకునే క్రమంలో వాహనాలు పక్కకు మళ్లించాల్సి వస్తుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాత్రివేళల్లో మరింత ప్రమాదకరం

పగటిపూట కనిపించే గుంత రాత్రి వేళల్లో వాహనదారులకు సరిగ్గా కనిపించకపోవచ్చని స్థానికులు చెబుతున్నారు. సరైన హెచ్చరిక సూచికలు లేకపోతే వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రమాదం జరిగాకే స్పందిస్తారా?

డ్రైనేజీ మరమ్మతుల కోసం రహదారిని తవ్విన అనంతరం పనులను త్వరితగతిన పూర్తి చేసి, రహదారిని యథాస్థితికి తీసుకురావాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే వారం రోజులుగా గుంతను పూడ్చకపోవడంపై వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వకుండా సమస్యను పెండింగ్లో ఉంచడం సరైంది కాదని విమర్శిస్తున్నారు.

తక్షణమే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్.

ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించిన తర్వాత స్పందించడం కంటే, ముందుగానే సమస్యను పరిష్కరించడం అవసరమని కాలనీవాసులు అంటున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ మరమ్మతులు పూర్తి చేయడంతో పాటు రహదారిపై ఉన్న భారీ గుంతను పూడ్చాలని డిమాండ్ చేస్తున్నారు. అప్పటివరకు వాహనదారులకు ప్రమాదం జరగకుండా తగిన హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి ప్రజల ఇబ్బందులను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



'స్వేచ్ఛా రథం' ప్రారంభించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

- వెట్టిచాకిరీ నిర్మూలనకు 'స్వేచ్ఛా రథం', కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం

కామారెడ్డి, అక్టోబర్ 22 (మనం బ్యూరో): వెట్టిచాకిరీ నిర్మూలనపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, వెట్టిచాకిరీ బాధితులకు అందించే సహాయం, పునరావాసంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన 'స్వేచ్ఛా రథం' ప్రచార వాహనాన్ని గురువారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు.

బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి...

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ., వెట్టిచాకిరీ నిరోధక చట్టం అమల్లో ఉన్నప్పటికీ అక్కడక్కడ ఇటువంటి ఘటనలు వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు. బాధితులను గుర్తించి తక్షణమే రక్షించడంతోపాటు వారికి ప్రభుత్వ సహాయం, పునరావాసం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్మికులకు తమ హక్కులపై అవగాహన కల్పించి, వెట్టిచాకిరీ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పని ప్రదేశాల్లో అవగాహన....

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించే స్వేచ్ఛా రథం ద్వారా అసంఘటిత కార్మికులు, వెట్టిచాకిరీకి గురయ్యే ప్రమాదం ఉన్న వర్గాలకు అవగాహన కల్పించనున్నారు. వ్యవసాయం, ఇటుక బట్టీలు, చేపలు, రొయ్యల పెంపకం, గనులు, క్వారీల్లో పనిచేసే కార్మికులకు వెట్టిచాకిరీ దుష్పరిణామాలు, ఫిర్యాదుల నమోదు విధానాలను వివరించనున్నారు. అప్పులు, ముందస్తు చెల్లింపులు, బలవంతపు ఒత్తిళ్లతో వెట్టిచాకిరీలో చిక్కుకున్నవారికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ సహాయ వ్యవస్థలను తెలియజేయనున్నారు.

హెల్ప్లైన్ను వినియోగించుకోవాలి...

వెట్టిచాకిరీకి గురైనవారు లేదా అలాంటి ఘటనల గురించి తెలిసినవారు 080-69434343 టోల్ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. కరపత్రాల ద్వారా గ్రామీణ ప్రాంతాలు, పని ప్రదేశాల్లో ఈ నంబరుపై ప్రచారం చేయనున్నారు.

అధికారులతో ప్రతిజ్ఞ...

కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ డాక్టర్ మున్నం శశికుమార్ అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దామోదర్, జిల్లా పంచాయతీ అధికారి మురళి, అంతర్జాతీయ న్యాయ సహాయ సంస్థ ప్రతినిధి ఆనంద్ కుమార్తోపాటు కార్మిక, పోలీసు, మానవ అక్రమ రవాణా నిరోధక, న్యాయ సేవలు, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు



- ఐడీఓసీలో పండుగ సాయన్న చిత్రపటానికి నివాళులు
- సామాజిక సమానత్వం, ఆత్మగౌరవంపై నేతల ఉద్ఘాటన
- పాల్గొన్న అదనపు కలెక్టర్ విక్టర్, మున్సిపల్ చైర్పర్సన్, ప్రజాప్రతినిధులు

కామారెడ్డి, అక్టోబర్ 22 (మనం బ్యూరో): తెలంగాణలో ధైర్యసాహసాలకు, ప్రజా పోరాటాలకు ప్రతీకగా నిలిచిన పండుగ సాయన్న జయంతి వేడుకలను గురువారం కామారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ విక్టర్ (రెవెన్యూ) ముఖ్య అతిథిగా హాజరుకాగా, మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి, అనంతరం పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన జీవితం, ధైర్యసాహసాలు, ప్రజల కోసం చేసిన పోరాటాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. పండుగ సాయన్న చరిత్రను భావితరాలకు తెలియజేయడంతోపాటు సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం, సామాజిక చైతన్యాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు.

పాల్గొన్న ప్రముఖులు

జిల్లా బీసీ అభివృద్ధి అధికారి నర్సయ్య, సహాయ బీసీ అభివృద్ధి అధికారి మామిండ్ల చక్రధర్, గ్రంథాలయ మాజీ చైర్మన్ పున్న రాజేశ్వర్ ముదిరాజ్, మాజీ జడ్పీటీసీ నంద రమేష్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు గజ్జల భిక్షపతి ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు కల్ల గంగారాజం ముదిరాజ్, కౌన్సిలర్లు కల్ల గణేష్ ముదిరాజ్, భాను ప్రసాద్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీలా నాగరాజు ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు బట్టు విట్టల్ ముదిరాజ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు, బహుజన సంఘ నాయకులు కొత్తపల్లి మల్లయ్య, ఒడ్డెర ఎల్లయ్య, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. నరేష్, పవన్, సునీత, స్వామి, శాంతీష్ సహా పలువురు హాజరయ్యారు.

భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

- గర్భిణులకు హెచ్ఐవీ, సిఫిలిస్ పరీక్షల నిర్వహణపై సమీక్ష

భిక్కనూరు, అక్టోబర్ 22 (మనం న్యూస్): భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సమాచార విభాగం సంప్రదింపుల నిపుణుడు రాజీవ్ రంజన్ తివారి, తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహాయ ప్రాజెక్టు సంచాలకుడు డాక్టర్ రాజేశం ఆధ్వర్యంలోని బృందం గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసింది.

ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు హెచ్ఐవీ, సిఫిలిస్ పరీక్షలు ఏ విధంగా నిర్వహిస్తున్నారనే అంశాన్ని బృందం పరిశీలించింది. పరీక్షల్లో వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఎలాంటి చికిత్స అందిస్తున్నారు అవసరమైన సందర్భాల్లో సంబంధిత చికిత్సా కేంద్రాలకు ఏ విధంగా పంపిస్తున్నారు అనే వివరాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకుంది. అనంతరం పరీక్షలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, వ్యాధి నిర్ధారణ అయిన వారికి సకాలంలో చికిత్స అందించడం, అవసరమైన వైద్య సేవల కోసం



సంబంధిత కేంద్రాలకు పంపించడం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి పలు సూచనలు చేసింది.

గర్భిణీ స్త్రీలకు అవసరమైన పరీక్షలు సకాలంలో నిర్వహించి, వ్యాధులు ఉన్నట్లు నిర్ధారణ అయిన వారికి తగిన చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని బృందం సూచించింది.

ఈ కార్యక్రమంలో భిక్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ వనశ్రీ, ఇతర వైద్య సిబ్బంది, తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రతినిధులు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాభావం.. ప్రత్యామ్నాయ పంటలే మేలు!



- జిల్లాలో 4-5 మీటర్ల మేర తగ్గిన భూగర్భ జలమట్టం, యాసంగిలో ఆరుతడి పంటలకు ప్రాధాన్యమివ్వాలి
- ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి, అక్టోబర్ 22 (మనం బ్యూరో): వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. నీటి లభ్యతను అంచనా వేసుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని, నీటి వనరులను పొదుపుగా వినియోగిస్తూ ప్రతి నీటి బొట్టునూ సంరక్షించాలని కోరారు. సదాశివనగర్ మండలం ధర్మారావుపేట రైతువేదికలో గురువారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిర్వహించిన వీడియో సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలు, పత్తి మార్కెటింగ్, కనీస మద్దతు ధరలపై రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. అనంతరం రైతునేస్తం, ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా రైతులతో కలెక్టర్ మాట్లాడారు.

నీటి లభ్యతను బట్టి సాగు ప్రణాళికలు.


జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే భూగర్భ జలమట్టం సుమారు నాలుగు నుంచి ఐదు మీటర్ల మేర తగ్గిందని తెలిపారు. సదాశివనగర్, పెద్దకొడప్గల్, మహమ్మద్నగర్ మండలాల్లో వర్షపాతం లోటు ఉందన్నారు. రాబోయే ఎనిమిది నుంచి తొమ్మిది నెలలు నీటి నిర్వహణలో కీలకమని పేర్కొన్నారు. నిజాంసాగర్ ఆయకట్టుతో పాటు చెరువుల్లో నీటి లభ్యతను బట్టి సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.

ఉద్యాన పంటల సాగుపై దృష్టి.

యాసంగిలో నీటి లభ్యతను బట్టి వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి జొన్న, మొక్కజొన్న, శనగ, కంది, వేరుశనగ వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడటం, పంట మార్పిడి పాటించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చన్నారు. ఇంకుడు గుంతలు, నీటి నిల్వ నిర్మాణాలతో వర్షపు నీటిని ఒడిసిపట్టాలని కోరారు. భూమి, నీటి పరిస్థితులకు అనుగుణంగా ఉద్యాన పంటల సాగును పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అందరికీ నమస్కారం..

ఇన్ స్టాలో సోనియా తొలి పోస్టు



ఢిల్లీ, అక్టోబర్ 22 : కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ ఇన్ స్టాలో చేరారు. గురువారం ఈ సోషల్ మీడియా వేదికపైకి వచ్చిన ఆమె.. తొలి పోస్టు పెట్టారు. ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' త్వరలో విడుదల కానున్న నేపథ్యంలో దానికి సంబంధించిన కొన్ని దృశ్యాలను షేర్ చేశారు. 'అందరికీ నమస్కారం. 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' ఫస్ట్ లుక్ మీతో షేర్ చేసుకుంటున్నందుకు సంతోషంగా ఉంది. ఈ కథ ప్రేమ, కర్తవ్యం, నష్టం వంటి ఎన్నో ఉద్వేగాలను తెలియజేస్తోంది' అంటూ తన కుమార్తె ప్రియాంకాగాంధీ, పబ్లిషర్లతో ఉన్న వీడియోను పంచుకున్నారు. నవంబర్ 10న ఈ పుస్తకం ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది.

ట్రంప్ ఆంక్షలు విధిస్తే.. ఈయూ అవార్డు ఇచ్చింది

న్యూయార్క్, అక్టోబర్ 22 : అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ)పై అమెరికా ప్రభుత్వం ఇటీవల భారీ ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఐసీసీతోపాటు ట్రైబ్యునల్లో పనిచేసే అధికారులకు యురోపియన్ యూనియన్ అత్యున్నత మానవ హక్కుల పురస్కారం సఖరోవ్ ప్రైజ్ వరించింది. ఈ అవార్డు ప్రకటించిన సందర్భంగా యురోపియన్ పార్లమెంట్ అధ్యక్షురాలు రాబర్టా మెట్సోలా మాట్లాడుతూ అంతర్జాతీయ చట్టాలు, న్యాయాన్ని నిలబెట్టడంలో ఐసీసీ చేసిన కృషికి ఈ పురస్కారం ఓ నిదర్శనమన్నారు. సోవియట్ అసమ్మతివాది, నోబెల్ పురస్కార గ్రహీత ఆండ్రూ సఖరోవ్ పేరుమీద 1988లో ఈ అవార్డును ఈయూ అందజేస్తోంది. మానవ హక్కులు, ప్రాథమిక స్వేచ్ఛ కోసం కృషి చేసే వ్యక్తులు, సంస్థలకు ఏటా ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తోంది. తాజాగా అవార్డు లభించడంపై ఐసీసీ అధ్యక్షురాలు టొమోకో అకానే స్వాగతించారు. న్యాయస్థానం, అధికారులు తీవ్ర సవాళ్లు ఎదుర్కొంటున్న సమయంలో ఈ గుర్తింపు లభించడం ఎంతో సంతోషకర విషయమన్నారు. ఈ నేపథ్యంలోనే ఐసీసీ రద్దుకు ప్రయత్నిస్తున్న అగ్రరాజ్యం ఇటీవల భారీ ఆంక్షలు ప్రకటించింది. ఐసీసీ ఆర్థిక వనరులను స్తంభింపజేసేందుకు సిద్ధమైంది.

బీఈఎల్తో రక్షణ ఒప్పందం

రూ.770 కోట్ల విలువైన లైట్ వెయిట్ రాడార్ల కొనుగోలు




ఢిల్లీ, అక్టోబర్ 22 : త్రివిధ దళాల ఆయుధ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కేంద్రం మరో కీలక అడుగు వేసింది. లో లెవెల్ లైట్ వెయిట్ రాడార్లను కొనుగోలు చేసేందుకు భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ తో ప్రభుత్వం సుమారు రూ.770 కోట్లతో ఒప్పందం కుదుర్చుకుంది. ఢిల్లీలో రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. ఈ రాడార్లకు ఫైటర్ జెట్లు, మినీ, మైక్రో డ్రోన్లను పసిగట్టి ట్రాక్ చేయగల సామర్థ్యం ఉంది. 2047 నాటికి 'వికసిత్ భారత్' సాధించాలన్న కేంద్రం లక్ష్యానికి అనుగుణంగా ఈ ఒప్పందం జరిగినట్లు రక్షణ శాఖ వివరించింది.

ఫ్రాన్స్ వెళ్తున్నారా..? జాగ్రత్త భారతీయులకు ఎంబసీ అడ్వైజరీ

పారిస్, అక్టోబర్ 22 : మౌలిక వసతుల లేమి, పెరుగుతున్న ధరల వంటి సమస్యలతో ఫ్రాన్స్ మండిపోడుతోంది. ఈ అశాంతియుత పరిస్థితులు, స్థానికంగా కర్ఫ్యూల నేపథ్యంలో భారతీయులు జాగ్రత్తగా ఉండాలని పారిస్లోని భారత ఎంబసీ హెచ్చరించింది. ఫ్రాన్స్లో నివసిస్తున్న, ఆ దేశం వెళ్లాలనుకుంటున్న ప్రయాణికులకు సూచనలు చేసింది. 'నిరసన ప్రదేశాలు, జనాలు భారీగా గుమిగూడిన ప్రాంతాలకు వెళ్లొద్దు. ఎప్పటికప్పుడు స్థానిక ప్రభుత్వాలు ఇచ్చే అధికారిక అడ్వైజరీలను గమనించుకోండి. రవాణాకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోండి'అని ఎంబసీ సూచించింది. సంబంధిత వెబ్సైట్ల వివరాలు షేర్ చేసింది.

ట్రంప్పై మేక్రాన్ ఆగ్రహం..

తమ దేశంలో జరుగుతోన్న నిరసనలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మేక్రాన్ ఖండించారు. రాజకీయ లబ్ధికోసమే విదేశీ నేతలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫ్రాన్స్లో హింసాత్మక ఘటనలకు అక్కడి ప్రభుత్వ వలస విధానాలే కారణమని ట్రంప్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. 'అవొక మూర్ఖపు మాటలు. వాటికి ఎలాంటి ఆమోదయోగ్యత లేదు'అని మేక్రాన్ మండిపడ్డారు.



టర్కియే, ఖతార్, ఇండొనేసియాలతో పాక్ రక్షణ ఒప్పందం

ధృవీకరించని పాకిస్థాన్ విదేశాంగ శాఖ

ఇస్లామాబాద్, అక్టోబర్ 22 : పాకిస్థాన్, టర్కియే, ఖతార్, ఇండొనేసియా దేశాలు బుధవారం దోహాలో ఒక రక్షణ సహకార ఒప్పందంపై సంతకాలు చేశాయి. 'బద్ర్ అవగాహన ఒప్పందం' అని నామకరణం చేసిన ఈ ఒప్పందంపై పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్, టర్కియే రక్షణ మంత్రి యాసర్ గులేర్, ఖతార్ ఉప ప్రధాని షేక్ సౌద్ బిన్ అబ్దుల్ రహమాన్, ఇండొనేసియా రక్షణశాఖ ఉపమంత్రి యూసుఫ్ జొహరీలు సంతకాలు చేశారని ఒక అధికారిక ప్రకటన తెలిపింది. బద్ర్ ఒప్పందంపై జరిగిన సంతకాలకు సంబంధించి పాకిస్థాన్ విదేశాంగ శాఖ ఎలాంటి ప్రకటనా వెలువరించలేదు. మరోవైపు మాల్దీవులతో కూడా పాకిస్థాన్ బుధవారం 20 ఒప్పందాలపై సంతకాలు చేసింది. మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజు ఇస్లామాబాద్లో మూడు రోజుల పర్యటనకు విచ్చేసిన సందర్భంగా ఈ ఒప్పందాలపై సంతకాలు జరిగాయి.

రేహాన్ వాద్రా 'నిరసనల ఫొటోల వివాదం'..

- స్పందించిన బికనేర్ హౌస్



ఢిల్లీ, అక్టోబర్ 22 : కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ కుమారుడు రేహాన్ వాద్రా ఫొటో ఎగ్జిబిషన్ రాజకీయంగా వివాదానికి దారితీసింది. ఢిల్లీలోని బికనేర్ హౌస్ లో 'నో ఐడియా ఈజ్ ఫైనల్' పేరిట ఆయన తీసిన కొన్ని ఫొటోలను ఎగ్జిబిషన్ కు బీజేపీ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ నేపథ్యంలో బికనేర్ హౌస్ స్పష్టతనిచ్చింది. 'నో ఐడియా ఈజ్ ఫైనల్' పేరిట రేహాన్ తాను తీసిన ఫొటోలను తొలిసారి ప్రదర్శనకు ఉంచారు. వన్యప్రాణులు సహా ఇతర థీములు, ఢిల్లీలో జరిగిన నిరసనలను ఫొటోలు తీసి ఎగ్జిబిషన్ పెట్టారు. ఆ ఫొటోల్లో కొన్ని రాజకీయ ఉద్దేశాన్ని కలిగి ఉన్నాయని, సంస్థ విధానానికి వ్యతిరేకమంటూ బికనేర్ హౌస్ అభ్యంతరం వ్యక్తంచేసింది. కళలు, సంస్కృతిని ప్రతిబింబించేవాటిని మాత్రమే ప్రదర్శనకు ఉంచాలని, అందుకే వాటిని తొలగించాలని కోరినట్లు చెప్పింది. ప్రదర్శన ప్రారంభం కావడానికి కొన్ని గంటల ముందే తన ప్రదర్శించిన ఫొటోల్లో చాలావరకు తొలగించాలని, రద్దు చేసుకోవాలని నిర్వాహకులు చెప్పినట్లు వాద్రా సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు. అందులో రెచ్చగొట్టేవి ఏవీ లేవన్నారు. కళాకారుల భావ ప్రకటన స్వేచ్ఛను అణచివేయడం సరికాదన్నారు. దీంతో బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం షురువైంది.

ఎండిన పంటలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు

- ముఖ్యమంత్రితో సహా మంత్రులంతా క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- సీపీఐ(ఎం) పాలిట్‌బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు
- చర్లపల్లి లో సిపిఐఎం బృందం కరువు పరిస్థితులను పరిశీలన



నల్లగొండ,అక్టోబర్ 22 (మనం ప్రతినిధి): ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రితో సహా మంత్రులందరూ క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని కోరారు. గురువారం నల్లగొండ జిల్లా నల్లగొండ మండలం చెర్లపల్లి గ్రామంలో ఎలినోవా ప్రభావంతో ఎండిపోయిన పంట పొలాలను సీపీఐ(ఎం) రాష్ట్ర, జిల్లా నాయకత్వం, రైతు సంఘం నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం బి.వి. రాఘవులు మాట్లాడుతూ.. ₹₹చెర్లపల్లి గ్రామంలో ప్రధానంగా వరి, పత్తి పంటలు సాగు చేశారు. వరి పంట పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కొన్ని చోట్ల పంట పూర్తిగా ఎండిపోయింది. తాలు తప్ప గింజ కనిపించని పరిస్థితి నెలకొంది. మరో తడుపు నీరు అందితే పంట చేతికొచ్చేది. మొత్తం పెట్టుబడి పెట్టి పంట దిగుబడి వస్తుందని ఆశించిన రైతులకు చివరికి ఒక్క పైసా కూడా చేతికి రాని పరిస్థితి ఏర్పడింది. ఇది చాలా దుర్భరమైన పరిస్థితి. చిన్న, సన్నకారు రైతులు పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాకపోతే వారి జీవితాలు ఎంత హృదయవిదారకంగా ఉంటాయో ఇక్కడి రైతుల పరిస్థితిని చూస్తే అర్థమవుతోంది అని అన్నారు.

పత్తి పంట పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉంది

పత్తి చేలు పైకి పచ్చగా కనిపిస్తున్నప్పటికీ ఆకులన్నీ వాడిపోయాయి. మరో వారం రోజులు వర్షం లేకపోతే పత్తి పంట కూడా పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే వర్షాభావం వల్ల పంట పెరుగుదల లేదు. కాపు కాసిన కాయలు కూడా ఎండిపోయి రాలిపోతున్నాయి. భవిష్యత్తులో మళ్లీ వర్షాలు పడతాయనే గ్యారెంటీ కూడా లేదు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులను ప్రభుత్వం ఏ విధంగా ఆదుకుంటుందో తక్షణమే ప్రకటించాలి అని రాఘవులు డిమాండ్ చేశారు.

కేబినెట్లో కూర్చుంటే రైతుల కష్టాలు అర్థం కావు

రాష్ట్రంలో ఎలినోవా ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై చర్చించేందుకు రేపు కేబినెట్ సమావేశం నిర్వహిస్తున్నట్లు పత్రికల్లో వచ్చింది. అయితే కేబినెట్లో కూర్చొని చర్చిస్తే రైతుల వాస్తవ పరిస్థితులు పూర్తిగా అర్థం కావు. మంత్రులందరూ జిల్లాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించాలి. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 315 మండలాలు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. వాతావరణ శాఖ ఇచ్చే సమాచారం మాత్రమే సరిపోదు. మంత్రులు నేరుగా పొలాల్లోకి వెళ్లి పంటలను పరిశీలిస్తేనే రైతులు ఎదుర్కొంటున్న హృదయవిదారక పరిస్థితులు అర్థమవుతాయి. రైతులను ఎలా ఆదుకోవాలనే దానిపై ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలి అని అన్నారు.

తాగునీటి సమస్యతో పాటు రైతుల కష్టాలపైనా దృష్టి పెట్టాలి

రాబోయే రోజుల్లో తాగునీటి కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పినట్లు తెలుస్తోంది. తాగునీటి సమస్యపై ప్రభుత్వం ఆలోచించడం అవసరమే. భవిష్యత్తులో నీటి కొరత తీవ్రంగా ఉండే ప్రమాదం ఉంది. అయితే ప్రస్తుతం రైతులు పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రాని పరిస్థితి ఏర్పడింది. చివరికి కుటుంబ పోషణకు, తిండికి కూడా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తోంది. కాబట్టి రైతులను తక్షణమే ఆదుకోవడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలి అని రాఘవులు స్పష్టం చేశారు.

కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి

కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.20 వేల కోట్ల నుంచి రూ.30 వేల కోట్ల వరకు నిధులు కోరినట్లు చెబుతున్నారు. అయితే ఈ మొత్తం ఎంతవరకు సరిపోతుందో కూడా ఆలోచించాలి. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుందో లేదో స్పష్టత లేదు. అన్ని రాజకీయ పార్టీలు కలిసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తేనే రాష్ట్రానికి నిధులు సాధించే అవకాశం ఉంటుంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు ముఖ్యమంత్రితో సహా మంత్రులందరూ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించాలి. రేపటి కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలి. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి అన్ని పార్టీలను కలుపుకొని అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి. రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న వనరుల నుంచి తక్షణ సహాయంగా రైతులకు ఎంత మొత్తాన్ని ఖర్చు చేయబోతున్నారో కూడా ప్రకటించాలి అని డిమాండ్ చేశారు.

ఇది సాధారణ పరిస్థితి కాదు.. అత్యవసరంగా స్పందించాలి

ప్రస్తుతం నెలకొన్న పరిస్థితి సాధారణమైనది కాదు. ఇది అత్యవసర పరిస్థితి. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యపై తీవ్రంగా ఆలోచించి తగిన నిర్ణయాలు తీసుకోవాలి. అఖిలపక్ష సమావేశం నిర్వహించడంతో పాటు రైతు సంఘాలతో కూడా చర్చించాలి. నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు తక్షణ సహాయక చర్యలు చేపట్టాలి అని బి.వి. రాఘవులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ పర్యటనలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, తీగల సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, సుధాకర్ రెడ్డి, నారి ఐలయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వీరపల్లి వెంకటేశ్వర్లు పాలడుగు నాగార్జున, బండ శ్రీశైలం, సయ్యద్ హాశం, పాలడుగు ప్రభావతి, చినపాక లక్ష్మీనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు ఎండీ సలీం, దండంపెల్లి సత్తయ్య, కొండ అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

దొండపాడులో నవరాత్రి ఉత్సవాలు



చింతలపాలెం, అక్టోబర్ 22 (మనం న్యూస్): మండల పరిధిలోని దొండపాడు గ్రామంలో బొడ్రాయి వద్ద 'టీం మహాశక్తి' యూత్ వారు ఏర్పాటు ఏర్పాటుచేసిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు అయిన బుధవారం రోజు రాత్రి 8 గంటలకు నిమజ్జనం కోసం వెళ్తున్న అమ్మవారిని కోడా సిఐ రామకృష్ణారెడ్డి, చింతలపాలెం ఎస్సై పరమేష్, గ్రామ సర్పంచ్ చెన్నకేశవ వెంకయ్య, ఉపసర్పంచ్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో ఎటువంటి ,వివాదాలు లేకుండా తక్కువ సౌండ్ తో ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు ఈ సందర్భంగా టీం మహాశక్తి యూత్ వారు సిఐ రామకృష్ణారెడ్డిని, ఎస్సై పరమేష్ ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీం మహాశక్తి నిర్వాహకులు వేల్పుల హనుమాన్ రెడ్డి, చింతకుంట శాంతా రెడ్డి, బరిగలసత్యం, జె ఎం ఆర్ గ్రూప్ చైర్మన్ రేలాజగన్మోహన్ రెడ్డి, పాశం వీరారెడ్డి,శేఖర్ రెడ్డి, ఆవులూరి శ్రీనివాస్ రెడ్డి, నర్ర తిరుపతిరెడ్డి, విగ్రహ దాత సిహెచ్ అంకిరెడ్డి, కార్తీక్ యాదవ్,కళ్యాణ్, సాయి, భార్గవ్ రెడ్డి, ఎం చంద్రారెడ్డి, హరినాథ్ రెడ్డి, మరియు టీం మహాశక్తి యూత్ సభ్యులందరూ పాల్గొని ఈ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

జన్మదిన వేడుకల వేల అన్నదాన కార్యక్రమం



అనంతగిరి, అక్టోబర్ 22 (మనం న్యూస్): మండల కేంద్రంలోని తెలంగాణ శబరిమల శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో 16వ రోజు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షులు అర్వపల్లి సత్యనారాయణ జన్మదిన సందర్భంగా ఆలయంలో అయ్యప్ప దీక్ష స్వాములకు అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా జన్మదిన సందర్భంగా స్వాములకు అన్నదానం ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమని ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ కొండపల్లి వాసు మాట్లాడుతూ డిసెంబర్ వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఇలాంటి సందర్భాలు మరి ఏ ఇతర సందర్భాల్లోనైనా అన్నదాన కార్యక్రమానికి దాతలు ముందుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో పందిరి వీరయ్య రాము కనకయ్య కిరణ్ శ్రీను నరసింహారావు ఉపేందర్ దీక్ష స్వాములు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ నూతన కమిటీ ఎన్నిక



తిరుమలగిరి, అక్టోబర్ 22 (మనం న్యూస్): తిరుమలగిరి మండల పరిధిలోని తొండ గ్రామంలో ఎంఎస్ఎఫ్ నూతన కమిటీని ఎమ్మెస్ ఎఫ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కందుకూరి సోమన్న సమక్షంలో గురువారం ఎన్నుకున్నారు.అధ్యక్షులు. చెరుకు యాదగిరి, అధికార ప్రతినిధి పి. బాబు,ప్రధాన కార్యదర్శి ఎం. కిరణ్, ఉపాధ్యక్షులు పి. లోకేష్,ఉపాధ్యక్షులు పి. యశ్వంత్,గణేష్, కార్యదర్శులు వి.సిద్ధు,పి.నరసింహ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కందుకూరి సోమన్న మాదిగ మాట్లాడుతూ విద్యా రంగం సంక్షేమ శాఖ హాస్టల్లో నెలకొన్న దుర్భర పరిస్థితులపై పెండింగ్ స్కాలర్ షిప్ లు మరియు కోట్లాది రూపాయల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఎస్.సి,ఎస్.టి,బి.సి అగ్రకుల పేద వర్గాల విద్యార్థుల మౌలిక సమస్యల పరిష్కారానికై ₹అతి త్వరలో భారీ ఎత్తున₹ హైదరాబాదులో జరిగే విద్యార్థుల మహోద్యమానికి శ్రీకారం చుట్టడానికి విద్యార్థుల కోసం జరిగే జరిగే ఉద్యమంలో భాగస్వాములు చేయడానికి సామాజిక ఉద్యమాల అన్న మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గ్రామాలలో కమిటీలు వేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ తొండ గ్రామ కమిటీ అధ్యక్షులు పల్లెర్ల సురేష్ మాదిగ, సోమారపు వెంకన్న,మాచర్ల విజయ్, బోండ్ల రవీందర్, చింతవంశీ, భాష మల్ల రాజయ్య, మేకల ఆకాష్, జలగం శ్రీహర్షిత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వీరుడు పండుగ సాయన్న



సూర్యాపేట, అక్టోబర్ 22 (మనం ప్రతినిధి): నిజాం నిరంకుశ పాలనకు, భూస్వామ్య వ్యవస్థ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడి, నిరుపేదల ఆకలి తీర్చిన ప్రజా వీరుడు పండుగ సాయన్న అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు..పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలను పురస్కరించుకొని గురువారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...అణగారిన వర్గాల కోసం పోరాటం పండుగ సాయన్నను తెలంగాణ రాబిన్‌హుడ్గా పిలుస్తారని తెలిపారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతూ, అణగారిన వర్గాల ఆకలి తీర్చేందుకు కృషి చేశారని చెప్పారు. నిజాం పాలకుల ధాన్యాగారాలను కొల్లగొట్టి, ఆ ధాన్యాన్ని పేదలకు పంచిపెట్టేవారని పేర్కొన్నారు. ధనవంతులు, పెట్టుబడి దారులు, భూస్వాముల ఆధిపత్యానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడారని వివరించారు.నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా మహబూబ్నగర్ జిల్లాలో జన్మించిన పండుగ సాయన్న చిన్నతనం నుంచే దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారని కలెక్టర్ పేర్కొన్నారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటం సాగించి, పేదల పక్షాన నిలిచిన గొప్ప ప్రజా వీరుడని కొనియాడారు.ఈ వేడుకల్లో అదనపు కలెక్టర్ బి హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, బీసీ వెల్ఫేర్ అధికారి విశాల్ డిఎంహెచ్ఓ వెంకటరమణ, డిసిఓ శ్రీరామ్ బీసీ సంఘ నాయకులు ఈదుల యాదగిరి ముదిరాజ్ కమ్యూనిటీ జిల్లా అధ్యక్షులు, కళా కరుణాకర్ స్టేట్ సెక్రెటరీ, కందుల రమేష్, చలమల నరసింహ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు, బూర మాల్సూర్ గౌడ్ జై గౌడ అధ్యక్షులు, పి వీరాచారి విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు, డాక్టర్ కృష్ణ బంటు టియుడబ్ల్యూజే ఐజేయు సూర్యాపేట జిల్లా ప్రచార కార్యదర్శి, తన్నీరు రాం ప్రభువు రాష్ట్ర ఉపాధ్యక్షులు బీసీ సంక్షేమ సంఘం, మామిడి వెంకటేశ్వర్లు మాజీ జిల్లా అధ్యక్షులు, దున్న శ్యాం టీఎన్జీవో జిల్లా కార్యదర్శి, ఇతర సంఘ నాయకులు తదితరులు అధికారులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ అంకిత్ కార్యదీక్ష



- 238 రోజుల పాలనలో జిల్లా బాస్ ప్రత్యేక ముద్రపై స్పెషల్ ఫోకస్
- ప్రగతి పథంలో భద్రాద్రి

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 22 (మనంప్రతినిధి): అధికార దర్పం కాదు..బాధ్యతల నిర్వహణ ! ఆర్భాటపు సమీక్షలు కాదు.. అనునిత్యం క్షేత్రస్థాయి పర్యటనలు .. కార్యాలయాలకే పరిమితం కాని పాలన..ప్రజల చెంతకే వెళ్లే పరిపాలన ... తప్పు చేస్తే ఉపేక్షించని కఠిన వైఖరి.. ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపే కార్యదక్షత.... ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి పాఠశాలల వరకు ఆకస్మిక తనిఖీలు.. భూ సమస్యల నుంచి ప్రజావాణి అర్జీల వరకు పరిష్కారమే లక్ష్యంగా అడుగులు, గోదావరి వరదల ముప్పులో ప్రజలకు రక్షణ కవచం.. భద్రాద్రి రామాలయ పునరుద్ధరణలో నిరంతర పర్యవేక్షణ , ప్రభుత్వ పాలనలో పారదర్శకతకు పట్టం.. సమాచార హక్కు చట్టం అమలులో రాష్ట్రస్థాయి అవార్డుతో జిల్లాకు కీర్తి కిరీటం, బాధ్యతలో రాజీ లేదు.. ప్రజాసేవలో అలసత్వం లేదు.. పాలనలో పారదర్శకతకు వెనుకడుగు లేదు , ఆయనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్....

238 రోజుల్లోనే..అభివృద్ధిపై అంకిత్ మార్క్

బాధ్యతలు చేపట్టి ఏడాది కూడా కాలేదు..అప్పుడే పాలనలో తనదైన ముద్ర వేసే దిశగా అడుగులు. అధికారుల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ..విధుల్లో నిర్లక్ష్యంపై కఠిన వైఖరి...ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ.. అభివృద్ధి పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ కార్యాచరణలో ఈ అంశాలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఫిబ్రవరి 26న బాధ్యతలు స్వీకరించిన ఆయనకు అక్టోబర్ 22 నాటికి 238 రోజులు పూర్తయ్యాయి. ఈ వ్యవధిలో వివిధ ప్రభుత్వ శాఖల పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలు, జిల్లాలోని కీలక అంశాలపై దృష్టి సారించడంతో పాటు సమాచార హక్కు చట్టం అమలులో రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్నారు

క్షేత్రస్థాయిలోనే..

కార్యాలయ సమీక్షలకే పరిమితం కాకుండా ప్రభుత్వ వైద్యశాలలు, పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలిస్తున్నారు. సిబ్బంది విధి నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవలపై దృష్టి సారిస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకునే వైఖరితో ప్రభుత్వ శాఖల్లో బాధ్యతాయుత పనితీరుకు ప్రాధాన్యమిస్తున్నారు

వైద్య, విద్యా సేవలపై నిఘా



ప్రభుత్వ ఆసుపత్రులు, విద్యాసంస్థలు సామాన్య ప్రజలకు కీలకమైన సేవాకేంద్రాలు. వీటిలో సేవల నాణ్యత, సిబ్బంది బాధ్యతాయుత పనితీరు మెరుగుపడాలన్న దిశగా కలెక్టర్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి, సంబంధిత అధికారులు వాటిపై స్పందించేలా చూడటం పాలనలో కీలకమైన అంశంగా నిలుస్తోంది

భూసర్వే.. సమస్యల పరిష్కారానికి ముందడుగు

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో భూసర్వే కార్యక్రమాలను ముమ్మరంగా చేపడుతున్నారు. భూములకు సంబంధించిన వివాదాలు, రెవెన్యూ వ్యవహారాలు ప్రజలకు ఇబ్బందులు కలిగించే అంశాలు కావడంతో వాటి పరిష్కారంలో సంబంధిత శాఖల సమన్వయానికి ప్రాధాన్యమిస్తున్నారు. రెవెన్యూ, అటవీ భూములకు సంబంధించిన సమస్యలపై దృష్టి సారిస్తూ పరిష్కార మార్గాలను అన్వేషిస్తున్నారు

ప్రజావాణికి వచ్చే అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజావాణి కార్యక్రమం ద్వారా వివిధ మండలాల ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తున్నారు. అర్జీలను పరిశీలించి, నిబంధనల ప్రకారం సత్వర పరిష్కారం లభించేలా చర్యలు తీసుకోవడంపై కలెక్టర్ దృష్టి సారిస్తున్నారు. ప్రజల సమస్యలను వినడం మాత్రమే కాకుండా, వాటి పరిష్కారానికి శాఖల వారీగా చర్యలు చేపట్టడం ప్రజాకేంద్రిత పాలనలో కీలకం

ఆర్టీఐ దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యం

సమాచార హక్కు చట్టం ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకతకు ముఖ్యమైన సాధనం. జిల్లాలోని వివిధ కార్యాలయాల్లో ఆర్టీఐకి సంబంధించిన దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి సారిస్తున్నారు. చట్ట నిబంధనల ప్రకారం ప్రజలకు అవసరమైన సమాచారం అందుబాటులో ఉండేలా చూడటం, ప్రభుత్వ శాఖల్లో జవాబుదారీతనాన్ని పెంపొందించడం ఈ ప్రక్రియలో కీలక అంశాలు

రామాలయ పునరుద్ధరణ పనులపై నిరంతర పర్యవేక్షణ



భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం పునరుద్ధరణ పనులు జిల్లాకు అత్యంత ప్రాధాన్యమైన అంశం. రాబోయే గోదావరి పుష్కరాల నాటికి పనులు పూర్తయ్యేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ పురోగతిని పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ప్రాధాన్యమైన ఈ ఆధ్యాత్మిక క్షేత్రంలో పునరుద్ధరణ పనులు నిర్ణీత గడువులో పూర్తికావాలన్న లక్ష్యంతో జిల్లా యంత్రాంగం కృషి చేస్తోంది

గోదావరి వరదల వేళ అప్రమత్తత

గోదావరి వరదలు భద్రాద్రి ప్రాంతంలో ప్రజల భద్రతకు సవాలుగా మారే అవకాశం ఉంటుంది. ముంపు ప్రాంతాల ప్రజలు సురక్షితంగా ఉండేలా అధికారులను అప్రమత్తం చేయడం, అవసరమైన చర్యలకు ప్రాధాన్యమివ్వడం విపత్తుల నిర్వహణలో కీలకం. వరదల సమయంలో శాఖల మధ్య సమన్వయం, ప్రజల ప్రాణభద్రతకు సంబంధించిన చర్యలు సమర్థంగా అమలయ్యేలా చూడటంపై జిల్లా యంత్రాంగం దృష్టి సారిస్తోంది

238 రోజుల ప్రయాణం.. ముందున్న లక్ష్యాలు

ఫిబ్రవరి 26 నుంచి అక్టోబర్ 22 వరకు పూర్తయిన 238 రోజులు కలెక్టర్ అంకిత్ పాలనా ప్రయాణంలో తొలి దశగా చెప్పవచ్చు. ఈ కాలంలో క్షేత్రస్థాయి తనిఖీలు, ప్రజావాణి అర్జీల పరిష్కారం, భూసర్వే, ఆర్టీఐ దరఖాస్తుల నిర్వహణ, రామాలయ పునరుద్ధరణ, వరదల సమయంలో ప్రజల భద్రత వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. అయితే అభివృద్ధి ఫలితాలను మరింత స్పష్టంగా చాటిచెప్పేది పూర్తయిన పనులు, పరిష్కారమైన ప్రజా సమస్యలు, మెరుగుపడిన ప్రభుత్వ సేవలు, ప్రజలకు అందిన ప్రయోజనాలే. ఈ అంశాలకు సంబంధించిన గణాంకాలు అందుబాటులోకి వస్తే జిల్లా అభివృద్ధిలో కలెక్టర్ పాత్రను మరింత సమగ్రంగా అంచనా వేయవచ్చు

ప్రజల విశ్వాసమే అసలైన గుర్తింపు

అవార్డు ఒక గుర్తింపు.. తనిఖీలు ఒక పర్యవేక్షణ.. ఆదేశాలు ఒక కార్యాచరణ. కానీ వీటి అంతిమ లక్ష్యం ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, ప్రభుత్వంపై విశ్వాసాన్ని పెంపొందించడం. కలెక్టర్ అంకిత్ నేతృత్వంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యంత్రాంగం ఈ లక్ష్యాల దిశగా సాగించే కార్యాచరణే రానున్న రోజుల్లో పాలనా పనితీరుకు కొలమానంగా నిలవనుంది. కలెక్టర్ పనితీరుపై జిల్లా ప్రజలందరూ హర్షతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుపై కాంగ్రెస్ దృష్టి

- అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్వోత్తమ్ రెడ్డి గెలుపునకు కృషి చేయాలి
- కాంగ్రెస్ శ్రేణులకు డీసీసీ వైస్ ప్రెసిడెంట్ గుడి వంశీధర్ రెడ్డి పిలుపు



జనగామ అక్టోబర్ 22 (మనం ప్రతినిధి): రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని డీసీసీ వైస్ ప్రెసిడెంట్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గుడి వంశీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. లింగాల ఘణపురం మండలం నెల్లుట్ల గ్రామంలోని తన వ్యక్తిగత కార్యాలయంలో మండలానికి చెందిన సర్పంచులు, పార్టీ ప్రతినిధులు ఆయనకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియపై చర్చించి, అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదయ్యేలా సమష్టిగా కృషి చేయాలని సూచించారు.

అర్హులైన పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైందని వంశీధర్ రెడ్డి తెలిపారు. 2022 నాటికి డిగ్రీ అర్హత పొందిన ప్రతి ఒక్కరూ నవంబర్ 6వ తేదీలోపు తమ ఓటును నమోదు చేసుకోవాలని కోరారు. ఇందుకోసం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పార్టీ యువ నాయకత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించారు.

సర్వోత్తమ్ రెడ్డి గెలుపునకు కృషి చేయాలి

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రామిరెడ్డి దామోదర్ రెడ్డి కుమారుడు సర్వోత్తమ్ రెడ్డిని పార్టీ బలపరిచిన అభ్యర్థిగా ప్రకటించిందని తెలిపారు. ఉన్నత విద్యావంతుడైన సర్వోత్తమ్ రెడ్డికి దేశవిదేశాల్లోని ప్రముఖ సంస్థల్లో పనిచేసిన అనుభవం ఉందని, ఆసియా ఖండంలోనే అతిపెద్ద బ్యాంకులో రీజినల్ మేనేజర్గా పనిచేశారని పేర్కొన్నారు. అనంతరం తన తండ్రి బాటలో ప్రజాసేవకు అంకితమై కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్నారని వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల కార్యాచరణకు అనుగుణంగా ముందుకు సాగుతూ ఆయన విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

రైతులకు గోదావరి జలాలు అందించే చర్యలు

ప్రపంచవ్యాప్తంగా ఎల్నినో ప్రభావంతో వర్షాలు తగ్గి రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవతో దేవాదుల ప్రాజెక్టు ద్వారా మండలంలోని గ్రామాలు, చెరువులు, కుంటలకు గోదావరి జలాలు అందించే చర్యలు చేపడుతున్నారని వంశీధర్ రెడ్డి తెలిపారు. రైతాంగానికి సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చేస్తున్న ప్రయత్నాలు ఉపయుక్తంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లింగాల ఘణపురం మండల ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

సమన్వయంతో ముందుకు సాగాలి

పార్టీ నియమించిన కో-ఆర్డినేటర్ సమక్షంలో మండలంలోని సర్పంచులు, పార్టీ ప్రతినిధులతో ఓటరు నమోదు ప్రక్రియపై చర్చించినట్లు తెలిపారు. అర్హులైన పట్టభద్రులెవరూ ఓటరు నమోదుకు దూరం కాకుండా చూడాలని, పార్టీ నిర్దేశించిన కార్యాచరణను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని కోరారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచేయాలని వంశీధర్ రెడ్డి పిలుపునిచ్చారు.

మంగపేటలో ఘనంగా కొమరం భీమ్ 125వ జయంతి వేడుకలు

- కొమరం భీమ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పని చేయాలి
- మండల పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు



మంగపేట, అక్టోబర్ 22: మనం ప్రతినిధి: మంగపేట మండల కేంద్రంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కొమరం భీమ్ 125వ జయంతి కార్యక్రమానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు మరియు ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అయ్యోరి యానయ్య గార్లు ముఖ్య అతిథిగా హాజరై బస్టాండ్ ఎదురుగా ఉన్న కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు,అయ్యోరి యానయ్య మాట్లాడుతూ,ఆదివాసీల హక్కుల సాధన కోసం కొమరం భీమ్ చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. జల్,జంగల్, జమీన్'(నీరు,అడవి,భూమి) అనే నినాదంతో పాటు మా పాలన - మా రాజ్యం అనే ఆశయంతో ఆదివాసీ సమాజాన్ని ఏకం చేసి,వారి హక్కుల కోసం పోరాటం చేసిన గొప్ప ఉద్యమ నాయకుడని కొనియాడారు. కొమరం భీమ్ చూపిన మార్గంలో పయనిస్తూ,ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాట స్ఫూర్తిని నేటి తరాలు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ భద్రాచల సీతారామ చంద్ర స్వామి దేవస్థానం డైరెక్టర్ పూజారి సురేందర్, మాజీ మండల అధ్యక్షులు మైల జయరాం రెడ్డి,ఏటూరు నాగారం ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ పగిడిపెల్లి వెంకటేశ్వర్లు,జిల్లా నాయకులు తుడి భగవాన్ రెడ్డి,మండవ రామకృష్ణ,అసెంబ్లీ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జంగం భానుచందర్,మైనారిటీ సెల్ అధ్యక్షులు హిదయతుల్ల,శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన చైర్మన్ యర్రంగారి సురేష్,ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మూగల చంటి,యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా ఇంచార్జీ భూక్యా కుమార్,నాయకులు కొమురం లక్ష్మీపతి,ఎట్టి సారయ్య,బొంబోతుల మురళి, బండపెల్లి నర్సయ్య,పట్టెం పగిడి,మద్దేవేని రాజు మరియు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి రంగానికే మా మొదటి ప్రాధాన్యం

సాగునీటి పనులను వేగవంతం చేయాలి: మంత్రి సీతక్క



ములుగు, అక్టోబర్ 22,మనం ప్రతినిధి: ములుగు నియోజకవర్గంలో సాగునీటి రంగానికే తమ మొదటి ప్రాధాన్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. రైతులకు సాగునీటి సౌకర్యాలను మెరుగుపరిచేందుకు పకడ్బందీ ప్రణాళికలు రూపొందించి, పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం తన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సాగునీటి శాఖ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో సాగునీటి అవసరాలు, చేపట్టాల్సిన పనులు, నిధుల మంజూరు, భూసేకరణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ, స్థానిక రైతుల అవసరాలను గుర్తించి, అందుబాటులో ఉన్న నీటి వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. సాగునీటి వనరులు ఉన్నప్పటికీ రైతులకు నీరు అందని పరిస్థితి ఉండకూడదని, శాశ్వత సాగునీటి సౌకర్యం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. చిన్న పనులతోనైనా ఎక్కువ మంది రైతులకు ప్రయోజనం చేకూర్చే అవకాశాలను పరిశీలించాలని మంత్రి సూచించారు. కోటి, రెండు కోట్లు, ఐదు కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టే పనుల ద్వారా 50 నుంచి 100 ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉన్నా, వాటిని గుర్తించి అంచనాలు సిద్ధం చేయాలని తెలిపారు. నియోజకవర్గ సాగునీటి అవసరాలను ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. బండారుపల్లి, జాకారం, పొట్లపూర్ తదితర ప్రాంతాలకు సాధ్యమైనంత మేర సాగునీరు అందించే అవకాశాలను పరిశీలించాలని మంత్రి సూచించారు. రామప్ప, లక్నవరం సాగునీటి పనులను వేగవంతం చేయాలని, ఆయా పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు. అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తిచేసి, వచ్చే సమ్మక్క-సారలమ్మ జాతర నాటికి నీటిని అందించే లక్ష్యంతో పనిచేయాలని చెప్పారు. ప్రస్తుతం పనులు చేపట్టేందుకు అనుకూల సమయం ఉన్నందున, వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు వీలైనంత మేర పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. చిన్న, పెద్ద పనులన్నింటికీ అవసరమైన అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. ప్రతిపాదనలు ఏ స్థాయిలో పెండింగ్లో ఉన్నాయో గుర్తించి, సంబంధిత ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని చెప్పారు. నిధుల మంజూరు, పనుల పురోగతికి సంబంధించి తన ప్రత్యేక విధుల అధికారి, వ్యక్తిగత సహాయకులతో అధికారులు నిరంతరం సమన్వయం చేసుకోవాలని మంత్రి సూచించారు. మండలాల వారీగా ప్రతిపాదించిన పథకాలు, పరిష్కరించాల్సిన అంశాలను వారికి తెలియజేయాలని చెప్పారు. అవసరమైతే ప్రతి మూడు రోజులకు ఒకసారి పెండింగ్ అంశాలను తన దృష్టికి తీసుకురావాలని, సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. చెరువులను పూర్తిస్థాయిలో నింపుకోవడంతో పాటు ముంపు సమస్యల పరిష్కారంపైనా దృష్టి సారించాలని మంత్రి సూచించారు. కొత్తగూడెం ప్రాంతంలో ముంపు సమస్యను పరిశీలించి అవసరమైన చర్యలు ప్రతిపాదించాలని చెప్పారు. రామప్ప పరిధిలో భూసేకరణ అవసరాలను గుర్తించి, అంచనాలతో కూడిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. నీటి నిల్వలు పెంచే క్రమంలో స్థానిక ప్రజలు, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. జంపన్నవాగుతో పాటు తాడ్వాయి, లింగాపూర్, కొండపర్తి, కాటాపూర్, మేడారం తదితర ప్రాంతాల్లోని వాగులపై చిన్న తరహా చెక్డ్యామ్ల నిర్మాణ అవకాశాలను పరిశీలించాలని మంత్రి తెలిపారు. స్థానికంగా నీటిని నిల్వచేసి రైతులకు ఉపయోగపడే పనులను గుర్తించాలని చెప్పారు. ములుగు డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, నర్సంపేట డివిజన్ పరిధిలోని పనులపై సంబంధిత అధికారులతో తాను మాట్లాడతానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సాగునీటి శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి
- పర్యాటక అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి
- ఫోన్ ద్వారా అధికారులకు దిశా నిర్దేశం చేసిన రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క
- ప్రతి 15 రోజులకు పనుల పురోగతిపై సమీక్ష
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



ములుగు, అక్టోబర్ 22,మనం ప్రతినిధి: జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ, నిర్దేశించిన గడువులోగా పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గురువారం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో రోడ్లు, భవనాలు, నీటిపారుదల, పర్యాటక, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఎన్పీడీసీఎల్, తదితర శాఖల ఉన్నతాధికారులతో జిల్లా కలెక్టర్ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా చేపట్టిన పనులు, వాటి ప్రస్తుత స్థితి, పనులు పెండింగ్లో ఉండటానికి గల కారణాలను ఆయన క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అభివృద్ధి పనుల పురోగతిపై ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహిస్తామని అన్నారు. అధికారులు నిర్లక్ష్యం వహించకుండా క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని సూచించారు. పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలను సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించి, నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనులు చేపట్టేందుకు రాబోయే ఆరు నెలలు అనుకూలంగా ఉంటాయని, ఈ కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పెండింగ్లో ఉన్న అంచనాలను సిద్ధం చేసి, టెండర్ ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. పనుల పూర్తికి స్పష్టమైన గడువులను నిర్దేశించి, వాటికి అనుగుణంగా పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. యంగ్ ఇండియా పాఠశాల, వైద్య కళాశాల నిర్మాణాలు, ఇతర మరమ్మతు పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. పుష్కరాలకు సంబంధించిన పనులను వేగంగా చేపట్టాలని, జంపన్నవాగు అభివృద్ధికి అవసరమైన అంచనాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. రామప్ప ఐలాండ్, పర్యావరణ ఉద్యానవనం, ప్లాజా, పరిపాలనా భవనాలు, ఎకో టూరిజం విలేజ్, బటర్ఫ్లై గార్డెన్, ప్రసాద్ పథకం కింద చేపట్టిన పర్యాటక సమాచార కేంద్రం పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పర్యాటక ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. సమీక్ష సమావేశం సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క ఫోన్ ద్వారా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జిల్లాలో పర్యాటక అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో సంబంధిత శాఖల అధికారులు బృందంగా పనిచేసి, పెండింగ్ పనులను గుర్తించి త్వరగా పూర్తి చేయాలని అన్నారు. పర్యాటక ప్రాంతాల్లో చేపట్టే నిర్మాణ పనుల్లో నాణ్యతను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రత్యేక ప్రణాళికతో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడంతోపాటు, వాటికి విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు.మేడారం జాతరను దృష్టిలో ఉంచుకొని రోడ్లు, భవనాల శాఖ పరిధిలో పెండింగ్లో ఉన్న రహదారి పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. మేడారంలో నూతన అతిథిగృహ నిర్మాణానికి సంబంధించిన పనులను త్వరగా ప్రారంభించాలని సూచించారు. మల్లూరు ఆలయం వద్ద అవసరమైన వసతుల కల్పనతోపాటు, పుష్కరాలకు సంబంధించిన పనుల కోసం అంచనాలను సిద్ధం చేసి సమర్పించాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాలు, గ్రామ సమాఖ్య భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి సూచించారు. వైద్య కళాశాల, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ భవన నిర్మాణం, గిరిజన ప్రాంతాల్లో రహదారి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అంచనాల తయారీ, టెండర్ల ఖరారు, పనుల ప్రారంభంలో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. సంబంధిత సాంకేతిక అధికారులు పనులను క్రమం తప్పకుండా పరిశీలించి, పురోగతి వివరాలను తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, జిల్లా అధికారులు అప్పలనాయుడు, ధర్మానాయక్, భిక్షపతి, శ్యాంసింగ్, సునీత, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు చెట్టిపెల్లి పరామర్శ



మంగపేట, అక్టోబర్ 22,మనం ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ఆదేశానుసారం, జిల్లా పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ అన్న సూచన మేరకు గురువారంరోజు మంగపేట మండలంలోని చెరుపల్లి గ్రామంలో విషాదకర సంఘటనల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు పార్టీ నాయకులతో కలిసి మృతుల కుటుంబాలను పరామర్శించి,తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ మండల బీసీ సెల్ అధ్యక్షులు ముత్తినేని ఆదినారాయణ సోదరుడు శ్రవణ్ కుమార్ భార్య క్రీస్తుశేషులు నాగమణి ప్రమాదవశాత్తు మరణించడం ఎంతో బాధాకరమని,ఆమె మృతి కుటుంబ సభ్యులకు తీరని లోటని పేర్కొన్నారు.ఆమె దశదినకర్మల సందర్భంగా వారి నివాసానికి వెళ్లి నాగమణి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పరామర్శించి,ఈ కష్టకాలంలో వారికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా,అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు లగ్గా శోభన్,చంద్రం, మైనర్ గార్ల మాతృమూర్తి క్రీస్తుశేషులు పుల్లమ్మ మరణించడం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు.ఆమె దశదినకర్మలకు హాజరై చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, మాతృమూర్తిని కోల్పోయిన బాధ వర్ణనాతీతమని,ఆమె లేని లోటు ఎన్నటికీ తీరనిదని పేర్కొంటూ తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని,వారి కుటుంబ సభ్యులకు ఈ అపారమైన దుఃఖాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు.

ఈ పరామర్శలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అయ్యోరి యానయ్య,శ్రీ భద్రాచల సీతారామ చంద్ర స్వామి దేవస్థానం డైరెక్టర్ పూజారి సురేందర్,ఏటూరు నాగారం ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ పగిడిపెల్లి వెంకటేశ్వర్లు,జిల్లా నాయకులు తుడి భగవాన్ రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షులు ముత్తినేని ఆదినారాయణ,యువజన కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి ఎడ్ల నరేష్,అసెంబ్లీ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జంగం భానుచందర్,ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మూగల చంటి,యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా ఇంచార్జీ భూక్యా కుమార్,బొంబోతుల మురళి,పట్టెం పగిడి,మద్దేవేని రాజు,బూర్గుల సతీష్,గడ్డం పరమేష్,యర్రంకాని చంద్రశేఖర్ మరియు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు కోతకు ముందే దళారీల కొర్రీలు

- పెట్టుబడి పేరుతో స్థానిక పురుగుమందుల వ్యాపారులు రైతులపై ఒత్తిడి చేస్తున్నారని రైతులు ఆవేదన
- అఖినేపల్లి మల్లారంలో రైతుల సమైక్యతా సమావేశం
- బిల్లులు.. రసీదులు లేకుండానే ఎరువులు, పురుగు మందుల విక్రయాలు చేస్తున్నారని ఆరోపణలు



మంగపేట : అక్టోబర్ 22,మనం ప్రతినిధి: రైతులు ఎదుర్కొంటున్న ధాన్యం కొనుగోళ్ల సమస్యలు, వ్యాపారుల ఒత్తిడిపై గురువారం అఖినేపల్లి మల్లారంలో రైతుల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసినప్పుడు బిల్లులు, రసీదులు ఇవ్వకుండా వ్యాపారులు వ్యవహరిస్తున్నారని సమావేశంలో రైతులు ఆరోపించారు. తాము ముందుగానే పెట్టుబడులు పెడుతున్నామనే కారణంతో తమ వద్దే ధాన్యం, ఇతర పంట ఉత్పత్తులను తాము నిర్ణయించిన ధరకే విక్రయించాలని ఒత్తిడి తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పినపాక మండలంలోని జానంపేట, టీ.కొత్తగూడెం, దుగినేపల్లి, ఏడూళ్ల బయ్యారం, ఐలాపురం, సీతంపేట, పినపాక గ్రామాలతో పాటు ములుగు జిల్లా సరిహద్దులోని అఖినేపల్లి మల్లారం బోర్డర్ గ్రామాల్లో దళారుల జోక్యం ఎక్కువగా ఉందని రైతులు తెలిపారు. ధాన్యం ధర తగ్గించడం, తేమ-తరుగు పేరుతో అదనపు కోతలు విధించడం వల్ల రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఇతర కొనుగోలుదారులు గ్రామాలకు రాకుండా కొందరు అడ్డుకుంటున్నారని, దీంతో రైతులు తమ పంటను గిట్టుబాటు ధరకు విక్రయించలేకపోతున్నారని సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. రైతులపై వ్యాపారుల ఒత్తిడిని నియంత్రించి, పంటలకు గిట్టుబాటు ధర లభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎరువులు, పురుగుమందుల కొనుగోళ్లకు బిల్లులు, రసీదులు అందించేలా చూడాలని, ధాన్యం కొనుగోళ్లలో ధర, తరుగు విషయంలో పారదర్శకత పాటించేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని రైతులు కోరారు. రైతుల సమస్యలపై సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సమావేశం కోరింది.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

- పట్టభద్రులకు ములుగు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇస్సార్ ఖాన్ పిలుపు
- మంత్రి సీతక్క ఆదేశాలు.. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనల మేరకు ఓటరు నమోదు కార్యక్రమం



ములుగు: అక్టోబర్ 22,మనం ప్రతినిధి: ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పరిధిలోని పట్టభద్రులందరూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని ములుగు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇస్సార్ ఖాన్ పిలుపునిచ్చారు. మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనలతో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. 2023 డిసెంబర్ 31 నాటికి డిగ్రీ ఉత్తీర్ణులైన అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. నవంబర్ 6వ తేదీలోపు తమ ఓటు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, పట్టభద్రులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఇస్సార్ ఖాన్ అన్నారు. అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకునేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియపై ఏవైనా సందేహాలు ఉన్నా, దరఖాస్తు చేసుకోవడంలో ఇబ్బందులు ఎదురైనా తమను సంప్రదించాలని తెలిపారు. ప్రతి మండలంలో కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు అందుబాటులో ఉన్నారని, వారిని సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు నవంబర్ 6వ తేదీలోపు ఓటు నమోదు చేసుకుని ప్రజాస్వామ్య బలోపేతంలో భాగస్వామి కావాలని ములుగు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇస్సార్ ఖాన్ కోరారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలకు ఘన నివాళి



- మంగపేటలో పోలీస్ల క్యాండిల్ ర్యాలీ

మంగపేట, అక్టోబర్ 22, మనం ప్రతినిధి: పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగపేట మండలంలో పోలీసుల ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం మంగపేట పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభం ప్రారంభమై తెలంగాణ సెంటర్ వరకు అక్కడి నుండి వై జంక్షన్ వరకు జరిగింది. మంగపేట ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘనంగా నివాళులర్పించారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. దేశ భద్రత, ప్రజల సంక్షేమం కోసం పోలీసులు అందిస్తున్న సేవలు మరువలేనివని పేర్కొన్నారు. క్యాండిల్ ర్యాలీ ద్వారా అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు సేవ చేయాలనే సందేశాన్ని అందించారు. పోలీస్ అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా తెలిపారు.

ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఇతరులు పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు.

అటవీ జంతుల కోసం కరెంటు ఉచ్చులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటాం

- పంటల రక్షణకు రైతులు ప్రత్యామ్నాయ మార్గాలు అనుసరించాలి
- ములుగు డి.ఎస్.పి రవీందర్



ములుగు, అక్టోబర్ 22,మనం ప్రతినిధి: అటవీ జంతువుల నుండి రక్షణ కోసం పంట పొలాలలో కరెంట్ ఉచ్చులు పెడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ములుగు డిఎస్పి రవీందర్ హెచ్చరించారు. అటవీ జంతువుల కోసం ఏర్పాటు చేసిన ఉచ్చుల వలన మనుషుల ప్రాణాలు పోతున్నాయని తద్వారా సంపాదించే కుటుంబ పెద్ద ప్రాణాలు కోల్పోయి వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని వెల్లడించారు.

ఇటీవల కాలంలో ములుగు మండలంలోని జాకారం గ్రామ పంచాయతీ పరిధిలో ఇలాగే పంట పొలాలలో కరెంట్ ఉచ్చులు పెడితే మనుషుల ప్రాణాలు పోయి సదరు వ్యక్తులు జైలు పాలు అయిన సంగతి గుర్తు చేశారు. అందువల్ల పంటల రక్షణ కొరకు రైతులు ప్రత్యామ్నాయ మార్గాలు అనుసరించాలి అని, కరెంటు ఉచ్చులు పెట్టే అనవసరంగా జైలు పాలు కావద్దని హెచ్చరించారు. ఎవరైనా వ్యక్తులు కరెంటు ఉచ్చులు పెట్టినట్టు తెలిసిన, కనిపించిన వెంటనే పోలీసువారికి సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

జనాభా గణనకు క్షేత్రస్థాయిలో పటిష్ఠ ప్రణాళిక



- గణన ప్రాంతాల గుర్తింపుపై అధికారులకు శిక్షణ

ములుగు, అక్టోబర్ 22, మనం ప్రతినిధి: జనాభా గణన-2027 రెండవ దశ నిర్వహణకు సంబంధించి అక్టోబర్ 22, 23 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ తరగతులను జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్. మహేందర్ గురువారం ప్రారంభించారు.

ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఈ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి.

జనాభా గణన రెండవ దశలో గణన బ్లాకులు, ఉప గణన బ్లాకుల ఏర్పాటుపై హైదరాబాద్ నుంచి వచ్చిన జనగణన శాఖ అధికారులు విహేందర్ బాబు, నాయుడు శిక్షణ అందిస్తున్నారు.

ఈ శిక్షణ కార్యక్రమం లో ఆర్డీఓ కృష్ణవేణి, ముఖ్య ప్రణాళిక అధికారి ఛార్జ్ అధికారులు, అదనపు ఛార్జ్ అధికారులు, జిల్లా అధికారులు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, గణాంక అధికారులు, ఈడీఎం, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తొలి టీ20లో కివీస్ పై రికార్డు విజయం





మొన్నటి వరకూ స్వదేశంలో ఆడిన టీమ్ఇండియా.. దాదాపు నెల రోజులపాటు సాగే పర్యటన కోసం న్యూజిలాండ్లో అడుగు పెట్టింది. ప్రయాణబడలిక తీరకముందే మైదానంలోకి దిగాల్సి వచ్చింది. ఎలా ఆడతారోనని అభిమానులు కాస్త అందోళనకు గురైనా.. తమకు ఎలాంటి ఇబ్బంది లేదని కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాటలను నిజం చేస్తూ టీమ్ఇండియా అదరగొట్టింది. రికార్డు లక్ష్య ఛేదన చేసి చరిత్ర సృష్టించింది. ఐదు టీ20ల సిరీస్ లో భారత్ శుభారంభం చేసింది. 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

క్రైస్ట్ చర్చ్ మైదానంలో జరిగిన తొలి టీ20లో కివీస్ పై భారత్ నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో టీమ్ఇండియా ఆరు వికెట్లను కోల్పోయి 19.4 ఓవర్లలో 230 పరుగులు చేసి గెలిచింది. టీ20ల్లో అత్యధిక లక్ష్యాన్ని ఛేదించిన మ్యాచ్ ఇదే కావడం గమనార్హం. ఇంతకుముందు విశాఖపట్నంలో (2023) ఆస్ట్రేలియాపై 209 పరుగుల టార్గెట్ ను ఛేదించి టీమ్ఇండియా విజయం సాధించింది.

భారీ లక్ష్య ఛేదనలో ఓపెనర్ సంజు శాంసన్ (67: 33 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సు) విజృంభించాడు. కేవలం 23 బంతుల్లోనే అర్ధ శతకం సాధించి టీమ్ఇండియాకు బలమైన పునాది వేశాడు. ఆఖర్లో నమన్ ధిర్ (42: 15 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్ లు), శ్రేయస్ అయ్యర్ (42: 28 బంతుల్లో ఒక ఫోర్, రెండు సిక్సు) దూకుడుగా ఆడి జట్టుకు విజయం అందించారు. అభిషేక్ శర్మ (29: 12 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్ లు), అక్షర్ పటేల్ (24: 14 బంతుల్లో 3 ఫోర్లు, ఒక సిక్స్) విలువైన పరుగులు చేశారు. తిలక్ వర్మ (6), ఇషాన్ కిషన్ (1) విఫలమయ్యారు. కివీస్ బౌలర్లలో బ్రాస్ వెల్ 2, శాంట్నర్ 2, ఫెర్గూసన్, ఆడమ్ మిల్నే చెరో వికెట్ తీశారు. అర్ధ శతకంతో టీమ్ఇండియా విజయంలో కీలక పాత్ర పోషించిన సంజు శాంసన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. శనివారం ఇదే వేదికపై రెండో టీ20 మ్యాచ్ జరగనుంది.

దంచేసిన ఫిలిప్స్.. ఇబ్బంది పడిన భువీ

దాదాపు నాలుగేళ్ల తర్వాత అంతర్జాతీయ మ్యాచ్ బరిలోకి దిగిన భువనేశ్వర్ కుమార్ తొలి ఓవర్ ను అద్భుతంగా వేశాడు. కానీ, తన స్పెల్ లో మిగతా ఓవర్లలో భారీగా పరుగులు సమర్పించాడు. పవర్ ప్లేలో కనీసం ఒక్క వికెట్ అయినా తీసే అతడు.. 4 ఓవర్లలో 49 పరుగుల ఇచ్చి వికెట్ లేకుండా కోటా ముగించాడు. టిమ్ సీఫర్ట్ (24), ఫిన్ అలెన్ (45) దూకుడు దెబ్బకు భువీతోపాటు అర్ష్ దీప్ పవర్ ప్లేలో భారీగానే పరుగులు ఇచ్చారు. మయాంక్ వచ్చి సీఫర్ట్ను ఔట్ చేయడంతో కాస్త స్కోరు బోర్డు వేగం మందగించింది. డారిల్ మిచెల్ (28)తో కలిసి ఫిన్ ఇన్నింగ్స్ ను నడిపించేందుకు ప్రయత్నించాడు. అతడు పెవిలియన్కు చేరాక వచ్చిన గ్లెన్ ఫిలిప్స్ (82: 40 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్ లు) దూకుడుగా ఆడాడు. బెవోన్ జాకబ్స్ (31: 16 బంతుల్లో 3 సిక్స్ లు) కూడా వేగంగా ఆడాడు. దీంతో కివీస్ స్కోరు 220+ దాటేసింది. భారత బౌలర్లు మయాంక్, అక్షర్, అర్ష్ దీప్ తలో వికెట్ తీశారు.

అభిషేక్ శర్మ ప్రపంచ రికార్డు



టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ మరో వరల్ రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. అంతర్జాతీయ టీ20 క్రికెట్ లో ఆడిన తొలి బంతికే అత్యధికసార్లు సిక్సర్ బాదిన ప్లేయర్గా అభిషేక్ చరిత్ర సృష్టించాడు. క్రైస్ట్ చర్చ్ వేదికగా న్యూజిలాండ్ తో జరుగుతున్న తొలి టీ20లో సిక్సర్ తో తన పరుగుల ఖాతా తెరిచిన అభిషేక్.. ఈ అరుదైన ఫీట్ ను సొంతం చేసుకున్నాడు.

ఈ పంజాబ్ బ్యాటర్ ఇప్పటివరకు తను ఆడిన తొలి బంతికే 7 సిక్సర్లు బాదాడు. ఇంతకుముందు ఈ రికార్డు అఫ్గానిస్తాన్ ప్లేయర్ షఫికుల్లా షిన్వారీ(6) పేరిట ఉండేది. తాజా మ్యాచ్ తో షిన్వారీ ఆల్ టైమ్ రికార్డును అభిషేక్ బ్రేక్ చేశాడు.

కాగా పొట్టి క్రికెట్ లో అభిషేక్ తన సూపర్ ఫామ్ను కొనసాగిస్తున్నాడు. ఈ మ్యాచ్ లో కూడా కేవలం 12 బంతుల్లో 29 పరుగులు చేసి భారత్ కు శుభారంభం అందించాడు. అంతకుముందు విండీస్ సిరీస్ లో కూడా అభిషేక్ సత్తాచాటాడు.

ఫిలిప్స్ విధ్వంసం

ఇక ఈ మ్యాచ్లో తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 4 వికెట్ల నష్టానికి 225 పరుగుల భారీ స్కోర్ సాధించింది. కివీస్ బ్యాటర్లలో గ్లెన్ ఫిలిప్స్ (36 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సుతో 82 నాటౌట్) టాస్ స్కోరర్గా నిలవగా.. ఫిన్ అలెన్ (24 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సుతో 45), బెవాన్ జాకబ్స్ (16 బంతుల్లో 31) రాణించారు.

భారత బౌలర్లలో అర్ష్దీప్ సింగ్, మయాంక్ యాదవ్, అక్షర్ పటేల్ తలా ఒక వికెట్ పడగొట్టారు. లక్ష్య ఛేదనలో భారత బ్యాటర్లు కూడా దూకుడుగా ఆడుతున్నారు. సంజూ శాంసన్ కేవలం 23 బంతుల్లోనే తన హాఫ్ సెంచరీ మార్కును పూర్తి చేసుకున్నాడు.

శుభ్ మన్ గిల్ 'వన్డే' రికార్డు బద్దలుకొట్టిన హ్యారీ బ్రూక్



వన్డే క్రికెట్ చరిత్రలో ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ రికార్డు సృష్టించాడు. ఇప్పటి వరకు టీమ్ఇండియా కెప్టెన్ శుభ్ మన్ గిల్ పేరిట ఉన్న ఆ ఘనతను బ్రూక్ అధిగమించాడు. ఇక ఇంగ్లాండ్ తరఫున ఆ ఫీట్ను సాధించిన తొలి ప్లేయర్ గానూ నిలిచాడు. ఇంతకీ అదేంటంటారా? వన్డేల్లో అత్యంత వేగవంతమైన డబుల్ సెంచరీ చేసిన క్రికెటర్ గా హ్యారీ బ్రూక్ అవతరించాడు.

శ్రీలంకతో మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 429 పరుగులు చేసింది. కెప్టెన్ హ్యారీ బ్రూక్ (202: 116 బంతుల్లో 21 ఫోర్లు, 10 సిక్స్ లు) అదరగొట్టాడు. కేవలం 114 బంతుల్లోనే డబుల్ సెంచరీ బాదేశాడు. ఈ క్రమంలో గిల్ (117 బంతుల్లో) పేరిట ఉన్న వేగవంతమైన ద్విశతకం ఘనతను బ్రూక్ అధిగమించాడు. ఇక ఇంగ్లాండ్ తరఫున డబుల్ సెంచరీ.. అత్యధిక వ్యక్తిగత నమోదు చేసిన బ్యాటరూ బ్రూకే కావడం గమనార్హం. గతంలో బెన్ స్టోక్స్ న్యూజిలాండ్ పై 2023లో చేసిన 182 పరుగులే ఇప్పటి దాకా అత్యధిక వ్యక్తిగత స్కోరు. ఇప్పుడు ఆ ఘనతనూ బ్రూక్ తన ఖాతాలో వేసుకున్నాడు.

కొత్త లుక్లో మహేశ్

టాలీవుడ్ సూపర్స్టార్ మహేశ్ బాబు తన మోస్ట్ అవేటెడ్ గ్లోబల్ అడ్వెంచర్ ఫిల్మ్ 'వారణాసి' తాజా షూటింగ్ షెడ్యూల్ ను పూర్తి చేసుకొని తాజాగా హైదరాబాద్ కు తిరిగి వచ్చారు. మహేశ్ బాబు తన కుటుంబంతో కలిసి నిన్న రాత్రి హైదరాబాద్ ఎయిర్ పోర్టులో కనిపించారు. ఈ ట్రిప్ లో ఆయన ఆకుపచ్చ క్యాప్, డార్క్ ఓవర్ కోట్, మెరూన్ టీషర్ట్, నల్లటి ప్యాంటుతో చాలా స్టైలిష్ గా కనిపించారు. గత కొంతకాలంగా 'వారణాసి' కి సంబంధించిన క్యారెక్టర్ కోసం లాంగ్ హెయిర్, గడ్డంతో కనిపించిన మహేశ్ బాబు, ప్రస్తుతం తన మెజారిటీ షూటింగ్ భాగం పూర్తికావడంతో మళ్లీ తన క్లాసిక్ క్లీన్ షేవెన్ (క్లీన్ లుక్) అవతారంలోకి మారారు. ఎయిర్ పోర్టులో క్లాసిక్ స్టైలిష్ లుక్ లో ఉన్న మహేశ్ బాబు ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి.



దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ అడ్వెంచర్ చిత్రం 'వారణాసి' షూటింగ్ లో మహేశ్ బాబు ప్రస్తుతం ఫుల్ బిజీగా ఉన్నారు. సుమారు 1400 కోట్ల భారీ బడ్జెట్తో తెరకెక్కుతున్న ఈ పాన్ వరల్ మూవీలో ప్రియాంక చోప్రా జోనస్, పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రలు పోషిస్తుండగా.. మహేశ్ బాబు 'రుద్ర' అనే పవర్ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. హైదరాబాద్ తో పాటు కెన్యా, జార్జియా వంటి విదేశీ లొకేషన్లలో కీలక సన్నివేశాలను తెరకెక్కించిన ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల మహేశ్ నటనపై రాజమౌళి ప్రశంసల వర్షం కురిపించారు. తాను ఊహించినదాని కంటే రెట్టింపు స్థాయిలో నటించి మహేశ్ బాబు 'రుద్ర' పాత్రకు పూర్తి న్యాయం చేశారని కొనియాడారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమ కీర్తిని గ్లోబల్ స్థాయిలో మరో స్థాయికి తీసుకెళ్లేలా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం, 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్ గా విడుదల కానుంది. రాజమౌళి-మహేశ్ కాంబోలో వస్తున్న తొలి సినిమా కావడంతో ఈ మూవీ కోసం ఫ్యాన్స్ ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

బోల్డ్ అండ్ ఇండిపెండెంట్ క్యారెక్టర్లో శృతి హాసన్



మల్టీ టాలెంటెడ్గా ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నా.. స్టార్ హీరోయిన్ శృతి హాసన్ వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు. ప్రజెంట్ శృతి నటిస్తున్న చిత్రాల్లో 'ఆకాశంలో ఒక తార' ఒకటి. మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ హీరోగా, పవన్ సాదినేని దర్శకత్వంలో రాబోతున్న ఈ పాన్ ఇండియా చిత్రంలో శృతి పాత్రకు సంబంధించిన ఓ ఇంట్రెస్టింగ్ బజ్ నెట్టింట సందడి చేస్తుంది. స్ట్రాంగ్ అండ్ మీనింగ్ఫుల్ క్యారెక్టర్స్తో సందడి చేసే శృతి హాసన్.. ఈ మూవీలో కూడా ఒక స్ట్రాంగ్ రోల్ చేయబోతుందట.

ఇందులో శృతి బోల్ అండ్ ఇండిపెండెట్ ఉమెన్ క్యారెక్టర్లో నటిస్తుందని ఓ వార్త ఇండస్ట్రీ వర్గాల్లో చక్కర్లు కొడుతుండగా.. శృతి హాసన్ ఫ్యాన్స్ పండుగ చేసుకుంటున్నారు. కాగా.. 'ఆకాశంలో ఒక తార' చిత్రంలో దుల్కర్ సల్మాన్ 'కృష్ణ' అనే కీలక పాత్రలో నటిస్తుండగా, సాత్విక వీరవల్లి కథానాయికగా పరిచయమవుతున్నారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమాస్, లైట్ బాక్స్ బ్యానర్లపై సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మిస్తున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషల్లో నవంబర్ 20, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నారు.

ఆ అనుభూతి నమ్మశక్యం కానంత అద్భుతంగా ఉంది.. సాయి పల్లవి



బాలీవుడ్ నుంచి రాబోతున్న ప్రతిష్టాత్మక పౌరాణిక చిత్రం 'రామాయణ'. స్టార్ డైరెక్టర్ నితేశ్ తివారీ ఎంతో గ్రాండ్ గా విజువల్ వండర్గా తెరకెక్కిస్తున్న ఈ ప్రాజెక్టులో శ్రీరాముడిగా రణబీర్ కపూర్, సీతాదేవిగా సాయి పల్లవి, లక్ష్మణుడిగా రవి దూబే నటిస్తుండగా.. అత్యంత పవర్ ఫుల్ పాత్ర రావణాసురుడిగా రాకింగ్ స్టార్ యశ్ కనిపించనున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన ప్రతి అప్డేట్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకోగా.. ఇటీవల విడుదల చేసిన రావణాసురుడు (యశ్) గ్లింప్స్ సినిమాపై మరింత హైప్ క్రియేట్ చేసింది. ఇందులో భాగంగానే తాజాగా నేచురల్ బ్యూటీ సాయి పల్లవి పంచుకున్న విశేషాలు 'రామాయణ'పై మరింత ఎక్స్ పెక్టేషన్స్ పెంచేస్తున్నాయి.

'మీరు రామాయణ సినిమాను తప్పకుండా 3Dలో చూడాలి. నేను మొబైల్ లో ట్రైలర్ చూసినప్పుడు కలిగిన అనుభూతి ఒకలా ఉంది. కానీ 3D గ్లాసెస్ పెట్టుకుని థియేటర్ లో ట్రైలర్ చూసినప్పుడు కలిగిన అనుభూతి మాత్రం నమ్మశక్యం కానంత అద్భుతంగా ఉంది. నాసిరకమైన లేదా సాధారణ స్థాయి వెర్షన్ ను తీసుకురావడం తనకు ఇష్టం లేదని నమిత్ చెప్పారు. ఇంతటి గొప్ప కథను ప్రపంచానికి అందించబోతున్నందుకు భారతీయులుగా మేం గర్వపడుతున్నాం. అంతే కాకుండా ఇలాంటి పవిత్రమైన ప్రాజెక్టులో నేను భాగం కావడం మరింత సంతోషంగా ఉంది' అని చెప్పుకొచ్చింది సాయి పల్లవి.

'ఫౌజీ' సెట్స్ నుంచి ప్రభాస్ వీడియో లీక్? అభిమానుల్లో గూస్ బంప్స్!?

పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్, టాలెంటెడ్ డైరెక్టర్ హను రాఘవపూడి కాంబినేషన్ లో తెరకెక్కుతున్న క్రేజీ పీరియాడికల్ యాక్షన్ డ్రామా చిత్రం 'ఫౌజీ'. ఈ మూవీకి సంబంధించి వీడియో క్లిప్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. 'ఫౌజీ' సెట్స్ నుంచి ప్రభాస్ లుక్ అంటూ ఓ వీడియో నెట్టింట ప్రత్యక్షమయింది. మిలిటరీ గెటప్లో, సింహాసనంపై ప్రభాస్ రాజసంగా కూర్చుని ఉన్న ఈ వీడియో చూసి అభిమానులు పండగ చేసుకుంటున్నారు. అయితే, ఈ వీడియో నిజమైందేనా? దీని వెనుక ఉన్న అసలు నిజాలు ఏమిటనే దానిపై టాలీవుడ్ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది.



అభిమానుల సంతోషంపై నీళ్లుచల్లిన ఏఐ..

ఈ వైరల్ వీడియోపై ఫ్యాక్ట్ చెక్ చేయగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ వీడియోలోని దృశ్యాలు పూర్తిగా నిజమైన షూటింగ్ స్పాట్ లీక్ కాదని, వీటిని గూగుల్ ఏఐ తో సృష్టించి, ఎడిట్ చేసినట్లు స్పష్టమైన వాటర్మార్క్ ఉన్నాయి. వీడియో ప్రారంభంలోని కొన్ని సెకన్లలో ఏఐ సృష్టికి సంబంధించిన సంకేతాలు స్పష్టంగా గుర్తించబడ్డాయి. అయితే, ఆడియో పరంగా ఎలాంటి ఏఐ వాటర్మార్క్ లభించలేదు. కాబట్టి, ఇది అధికారికంగా సినిమా యూనిట్ విడుదల చేసిన టీజర్ లేదా ఒరిజినల్ లీక్డ్ వీడియో కాదని, అభిమానులు లేదా కొందరు సృష్టించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సృష్టి అని తేలింది.

సినిమాపై భారీ అంచనాలు..

మ్యాజికల్ డైరెక్టర్ హను రాఘవపూడి దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. స్వాతంత్ర్యానికి పూర్వం నేపథ్యంతో సాగే ఈ చిత్రంలో ప్రభాస్ సరికొత్త సైనిక అధికారి పాత్రలో కనిపించబోతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇలాంటి సమయంలో ఈ ఏఐ క్రియేటెడ్ వీడియో నెట్టింట వైరల్ కావడం విశేషం. అధికారికంగా మేకర్స్ నుంచి ఎలాంటి అప్డేట్ వచ్చే వరకు ఇలాంటి సోషల్ మీడియా లీక్స్ను, ఏఐ సృష్టితులను నమ్మవద్దని టాలీవుడ్ వర్గాలు సూచిస్తున్నాయి. ఏది ఏమైనప్పటికీ, ప్రభాస్ మేనియాను ఇలాంటి ఫ్యాన్ మేడ్ క్రియేషన్స్ మరోసారి ఇంటర్నెట్లో ట్రెండ్ అయ్యేలా చేస్తున్నాయి.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.